
https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



వైసీపీ విధ్వంసాన్ని సరిచేస్తున్నాం..

7



“ఎవ్వరికీ ఇవ్వని అవకాశం వేంకటేశ్వరస్వామి నాకు ఇచ్చారు. 14సార్లు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించే భాగ్యాన్ని ఆ దేవదేవుడు నాకు కల్పించడం పూర్వజన్మ సుకృతమనుకుంటాను. ప్రపంచం మొత్తం కొలిచే దేవుడు, కష్టాలు కడతేర్చే దేవదేవుడు వేంకటేశ్వరస్వామి. 22 ఏళ్ల క్రితం బ్రహ్మోత్సవాలు ప్రారంభం రోజునే నాకు ప్రాణభిక్ష పెట్టారు. మంచి చేయడం కోసమే వెంకన్న నన్ను బతికించాడని భావిస్తుంటాను. తిరుమల గిరులపై ఇదే పవిత్రత కొనసాగాలి. ఆ పవిత్రతను కాపాడుకుంటూనే... వేంకటేశ్వరస్వామి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేయాలి. తిరుమల కొండలపై పరిఢవిల్లుతోన్న పచ్చదనం సాక్షిగా... వేంకటేశ్వరస్వామి కొలువైన దివ్యగిరులపై గోవింద నామస్మరణ మార్మోగాలి. ప్రజలు సుఖ సంపదలతో ఆనందంగా ఉండాలని వేంకటేశ్వర స్వామిని కోరుకుంటున్నాను”

## ధన్యుడివయ్యా.. చంద్రయ్యా!





ఉప రాష్ట్రపతి బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారి ఏపీ రాష్ట్ర పర్యటనకు వచ్చిన సీపీ రాధాకృష్ణన్‌ను గన్నవరం ఎయిర్ పోర్టులో మర్యాద పూర్వకంగా ఆహ్వానిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు

## ఏపీ.. దేదీప్యమానం!

- ఆంధ్రప్రదేశ్ దేశానికే అన్నపూర్ణ
- ఏపీ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుంది
- బెజవాడ దుర్గమ్మ దర్శనం ఆనందం
- ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ వ్యాఖ్య
- రాధాకృష్ణన్‌కు సీఎం స్వాగతం
- ఘనంగా వీడ్కోలు పలికిన గవర్నర్

4

ఆంధ్రప్రదేశ్‌కు తొలిసారి పర్యటనకు వచ్చిన ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్నారు. విజయవాడ ఉత్సవ్‌కు హాజరయ్యారు. బెజవాడ ప్రాంతం వేడిగావున్నా.. ఇక్కడి ప్రజలు చల్లగా ఉన్నారంటూ కితాబునిచ్చారు. ఈ పర్యటన తనకు ఎప్పటికీ గుర్తుండిపోతుందన్న ఆనందం వ్యక్తం చేస్తూ.. విజయవాడ నుంచి తిరుపతికి వెళ్లారు.

## సువర్ణాధ్యాయం.. మెగా డీఎస్సీ!

- నేడు విజేతలకు నియామక పత్రాలు..
- సీఎం, డిప్యూటీ సీఎం, విద్యామంత్రి చేతులమీదుగా అందజేత
- సచివాలయం వద్ద ప్రాంగణంలో విస్తృత ఏర్పాట్లు



6

రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన అతిపెద్ద డీఎస్సీని విజయవంతంగా పూర్తిచేసిన కూటమి ప్రభుత్వం... నేడు (గురువారం) విజేతలకు నియామక పత్రాలు అందిస్తోంది. అమరావతి సచివాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ప్రాంగణంలో పాఠశాల విద్యాశాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్య, ఐటి మంత్రి నారా లోకేష్ చేతులమీదుగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు.

### శతమానం భవతి



ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె శ్రీజ వివాహానికి సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి లోకేశ్ హాజరయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణం బ్రాడీపేటలో నిర్వహించిన వేడుకలకు వీరిద్దరూ వచ్చి నూతన వధూవరులు శ్రీజ, దుర్గా హరిహర సాయి పవన్‌కుమార్‌లను ఆశీర్వదించారు. వైవాహిక జీవితంలోకి అడుగుపెడుతున్న నూతన దంపతులకు మంత్రి లోకేశ్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

4

## వెంకన్న వైభవం.. విశ్వవ్యాప్తం

- ఐదు వేల శ్రీవారి ఆలయాలు నిర్మించాలి
- ప్రతి రాష్ట్ర రాజధానిలో స్వామి ఆలయం ఉండాలి
- ప్రపంచంలో తెలుగువారున్న ప్రతిచోటా ఆలయం
- టీటీడీ నిర్వహణలోని అన్ని ఆలయాల్లో అన్నదానం
- పాలక మండలికి సీఎం చంద్రబాబు సూచనలు

వివరాలు 2వ పేజీలో

## అంగరంగ వైభవంగా.. బ్రహ్మోత్సవాలు

- 14వసారి పట్టువస్త్రాలు సమర్పించిన చంద్రబాబు
- సీఎం వెంటుండి స్వామిని దర్శించుకున్న లోకేశ్
- తితిదే డైరీలు, క్యాలెండర్ల ఆవిష్కరణ
- ఉప రాష్ట్రపతితో కలిసి స్వామి వాహన సేవలో సీఎం

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం ధ్వజారోహణం వైభవంగా జరిగింది. ఇవాళ సాయంత్రం మీనలగ్నంలో ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ నిర్వహించిన ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో తొలిరోజైన బుధవారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవేంకటేశ్వరస్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ముందుగా బేడి ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకున్న సీఎం దంపతులు.. అక్కడినుంచి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి వెంట మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.

3

చైతన్యరథం



# వెంకన్న వైభవం.. విశ్వవ్యాప్తం



- ఐదు వేల వేంకటేశ్వరస్వామి దేవాలయాలు నిర్మించాలి
- దేశంలోని ప్రతి రాజధానిలో శ్రీవారి ఆలయం ఉండాలి
- ప్రపంచంలో తెలుగువారున్న ప్రతిచోటా ఆలయం నిర్మించాలి
- టీటీడీ నిర్వహణలోని అన్ని దేవాలయాల్లో అన్నదానం చేపట్టాలి
- టీటీడీ పాలక మండలికి ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలు
- 14వసారి స్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

తిరుమల (చైతన్య రథం): తిరుమల శ్రీ వేంకటేశ్వరుని వైభవం ప్రపంచం మొత్తం చాటాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. దేశంలోని ప్రతి రాష్ట్రంలో, ప్రపంచంలోని తెలుగువారున్న ప్రతి ప్రాంతంలో శ్రీవారి ఆలయం ఉండాలన్నారు. రాష్ట్రంలో 5 వేల వేంకటేశ్వర స్వామి దేవాలయాలు నిర్మించాలని టీటీడీకి సూచించారు. టీటీడీ నిర్వహణలో ఉన్న ప్రతి ఆలయంలో అన్నదాన కార్యక్రమం చేపట్టాలని సీఎం చంద్రబాబు టీటీడీ పాలకమండలిని కోరారు. తిరుమల శ్రీవారి ఆలయంలో సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. దేవాదాయ మంత్రి ఆనం రామరానారయణ రెడ్డి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో సింఘాల్‌తో కలిసి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం తరపున వేంకటేశ్వరస్వామికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీ సమేతంగా పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం రంగనాయక మండపంలో వేదపండితులు ముఖ్యమంత్రికి వేదాశీర్వచనం అందించి... స్వామివారి తీర్థప్రసాదాలను అందచేశారు.

## అన్ని దేవాలయాల్లో అన్నదానం

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు టీటీడీ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ.. "ఎన్టీఆర్ తొలిసారి సీఎం అయినప్పుడు ఆయన హయాంలో తిరుమలలో అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అన్నదానం కింద రూ.2283 కోట్లు కార్పస్ ఫండ్ ఉంది. ప్రతి నెలా రూ.12 కోట్లు ఖర్చు అవుతుంది. రూ.14 కోట్లు వడ్డీగానే వస్తుంది. కార్పస్ ఫండ్ మీద వచ్చే వడ్డీతోనే అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తిరుమలలో నిర్వహిస్తున్న అన్నదానం తరహాలోనే టీటీడీ నిర్వహణలో ఉన్న అన్ని దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమం చేపట్టాలి. దానికి శ్రీకారం చుట్టాలని టీటీడీ పాలకమండలిని కోరుతున్నాను" అని సీఎం అన్నారు.

## వేంకటేశ్వరుణ్ణి కొలిచే భాగ్యం అందరికీ దక్కాలి

"వేంకటేశ్వర స్వామి దేవాలయాలు రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ఉండాలి. దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానుల్లో టీటీడీ దేవాలయాలుండాలి. ప్రపంచంలో హిందువులు ఎక్కడుంటే... ఆయా ప్రాంతాలు అన్నింటిల్లోనూ వేంకటేశ్వరస్వామి దేవాలయాలు నిర్మించాలి. ఆయా ప్రాంతాల్లోని స్థానికులతో కమిటీలు వేసుకుని ప్రపంచవ్యాప్తంగా వేంకటేశ్వర స్వామి దేవాలయాలను నెలకొల్పేలా చూడాలి. ఆ దేవాలయాలన్నింటినీ తిరుమల వేంకటేశ్వరస్వామి దేవాలయానికి అనుసంధానం చేసుకునేలా చర్యలు తీసుకోవాలి. శ్రీవాణి ట్రస్టుకు మొత్తంగా ఇప్పటి వరకు రూ. 2038 కోట్లు వచ్చాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు రూ.738 కోట్ల మేర విరాళాలు వచ్చాయి. వడ్డీరూపంలో రూ. 268 కోట్లు వచ్చాయి. దీంతో మొత్తంగా రూ.2306 కోట్లు శ్రీవాణి ట్రస్టు వద్ద ఉన్నాయి. శ్రీవాణి ట్రస్టు నిధులనుంచి వివిధ కార్యక్రమాల నిమిత్తం ఇప్పటివరకు రూ.602 కోట్లను టీటీడీ ఖర్చుపెట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో, మారుమూలవున్న ప్రాంతాల్లోని వారికి కూడా వేంకటేశ్వర స్వామిని కొలుచుకునే అవకాశం కల్పించాలి. ఇందుకోసం 5 వేల దేవాలయాలను నిర్మించాలి. అన్ని రాష్ట్రాల రాజధానుల్లో వేంకటేశ్వర స్వామి దేవాలయాల నిర్మాణం కోసం అవసరమైతే నేనే అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు స్వయంగా లేఖలు రాస్తాను. దాతలు ముందుకు వస్తే విరాళాలు తీసుకుందాం. అవసరమైతే మనమూ ఖర్చు పెట్టి దేవాలయాలను నిర్మిద్దాం" అని చంద్రబాబు అన్నారు.

## ప్రాణదానం ట్రస్ట్ ఏర్పాటు లక్ష్యం నెరవేరాలి

"గతంలో నా హయాంలోనే ప్రాణదానం ట్రస్ట్ ప్రారంభించాం. నాకు వేంకటేశ్వరస్వామి ప్రాణభిక్ష పెట్టిన రోజున ఈ ట్రస్ట్ ప్రారంభించాం. ప్రాణదానం ట్రస్టుకు ఇప్పటివరకు రూ.709 కోట్లు రాగా... రూ.21 కోట్లను టీటీడీ ఖర్చు పెట్టింది. ఇంకా రూ.688 కోట్లు ఈ ట్రస్ట్ వద్ద ఉన్నాయి. ప్రాణదానం ట్రస్ట్ ఏ ఉద్దేశ్యంతో ప్రారంభించామో.. ఆ ఉద్దేశ్యానికి తగ్గట్టు ఖర్చు పెట్టాలి. వేంకటేశ్వరస్వామి కొలువైన ఈ ప్రాంతంలో వైద్య సేవలందించే నిమిత్తం ప్రాణదానం ట్రస్ట్ ప్రారంభించాం. అలాగే శ్రీవారి సేవకుల కార్యక్రమాన్ని 2000లో ప్రారంభించాం. ఇప్పటికి ఈ 12 లక్షలమంది స్త్రీలు, 5 లక్షలమంది పురుషులు సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. మొత్తంగా 17 లక్షలమంది శ్రీవారి సేవకులు సేవలు అందించారు. ఈ శ్రీవారి సేవకులను పూర్తిస్థాయిలో నెట్‌వర్క్ చేయాలి. వారి సేవలను వినియోగించుకోవాలి. వారికి తగిన గుర్తింపునివ్వాలి. వీరిని ఉపయోగించుకుని శ్రీవారి ప్రాభవాన్ని, విశిష్టతను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలి" అని చంద్రబాబు సూచించారు.

## వేంకటేశ్వర స్వామే ప్రాణభిక్ష పెట్టాడు...

"ఎవ్వరికీ ఇవ్వని అవకాశం వేంకటేశ్వరస్వామి నాకు ఇచ్చారు. 14సార్లు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించే భాగ్యాన్ని ఆ దేవదేవుడు నాకు కల్పించాడు. ప్రపంచం మొత్తం కొలిచే దేవుడు, కష్టాలు కడతేర్చే దేవుడు వేంకటేశ్వరస్వామి. 22 ఏళ్ల క్రితం బ్రహ్మోత్సవాలు ప్రారంభం రోజునే నాకు వేంకటేశ్వరస్వామి ప్రాణభిక్ష పెట్టాడు. మంచి చేయడం కోసమే భగవంతుడు నన్ను బతికించాడని నేను భావిస్తాను. ఇక్కడ ప్రతి ఒక్కరూ పవిత్ర భావంతో పని చేస్తున్నారు. దీన్ని కొనసాగించాలి. పవిత్రతను కాపాడుతూనే... వేంకటేశ్వర స్వామి వైభవాన్ని నలుదిశలా చాటాలి. తిరుమల కొండల్లో నిత్యం పచ్చదనం ఉండాలి. టీటీడీ ఇచ్చిన లెక్కల ప్రకారం 80 శాతం గ్రీనరీ ఉంది. వేంకటేశ్వరస్వామి కొలువైన ఈ ప్రాంతాన్ని దివ్యక్షేత్రంగా తీర్చిదిద్దాలి. పవిత్రతను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రజలు సుఖ సంపదలతో ఆనందంగా ఉండాలని వేంకటేశ్వర స్వామిని కోరుకుంటున్నాను" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. బ్రహ్మోత్సవాల్లో శ్రీవారి పట్టువస్త్రాలు సమర్పించే కార్యక్రమంలో చంద్రబాబు వెంట సతీమణి భువనేశ్వరి, మంత్రి నారా లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్ తదితరులున్నారు. అదేవిధంగా పలువురు ఎమ్మెల్యేలు, టీటీడీ బోర్డు మెంబర్లు కూడా హాజరయ్యారు.





చైతన్యరథం



# అంగరంగ వైభవంగా సాలకట్ల బ్రహ్మోత్సవాలు



- శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి దంపతులు
- సీఎం వెంటుండి స్వామిని దర్శించుకున్న మంత్రి లోకేశ్
- తితిదే డైరీలు, క్యాలెండర్లకు ఆవిష్కరించిన చంద్రబాబు
- ఉప రాష్ట్రపతితో కలిసి స్వామి వాహన సేవలో సీఎం

తిరుపతి (చైతన్య రథం): అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం ధ్వజారోహణం వైభవంగా జరిగింది. ఇవాళ సాయంత్రం మీనలగ్నంలో ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ నిర్వహించిన ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో తొలిరోజైన బుధవారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవేంకటేశ్వరస్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ముందుగా బేడి ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకున్న సీఎం దంపతులు.. అక్కడినుంచి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి వెంట మంత్రి నారా లోకేశ్ ఉన్నారు. వేదమంత్రోచ్చారణల మధ్య వేదపండితులు సీఎం చంద్రబాబునాయుడు కుటుంబానికి ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ సీఎం కుటుంబానికి స్వాగతం పలికారు. తరువాత ముఖ్యమంత్రి ఆలయ ధ్వజస్తంభానికి నమస్కరించి కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. వకుళామాత, విమాన వేంకటేశ్వరస్వామి, భాష్యకార్ల సన్నిధి, యోగ నరసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదమంత్రోచ్చారణతో వేద పండితులు ముఖ్యమంత్రి కుటుంబానికి ఆశీర్వచం అందించారు. టీటీడీ ఛైర్మన్, ఈవో ముఖ్యమంత్రికి శ్రీవారి తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా 2026 ఏడాది తితిదే డైరీలు, క్యాలెండర్లను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. అనంతరం ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి చంద్రబాబు స్వామివారి పెద్దశేష వాహనసేవలో పాల్గొన్నారు. రాత్రి తొమ్మిది గంటలకు నిర్వహించిన పెద్దశేష వాహన సేవతో బ్రహ్మోత్సవాల వాహన సేవలూ ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, తితిదే బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులలో జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బారాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ, డిప్యూటీ ఈవోలు లోకనాథం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏర్పాటు చేసిన తొలి ధర్మకర్తల మండలి హయాంలో అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు తితిదే సకల ఏర్పాట్లు చేసింది.





## ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ బుధవారం సాయంత్రం తిరుమల చేరుకున్నారు. ఈ సందర్భంగా గాయత్రి అతిథి గృహంవద్ద చంద్రబాబు, లోకేశ్‌కు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ స్వాగతం పలికారు. ఈరోజు రాత్రికి తిరుమలలోనే బస చేయనున్న చంద్రబాబు.. 25న ఉదయం 9.10కి వెంకటాద్రి నిలయానికి చేరుకుని ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ తదితరాలను ప్రారంభిస్తారు. 9.50 గంటలకు తిరుమల నుంచి బయలుదేరి తిరుపతి చేరుకుంటారు. అనంతరం 10.40కి తిరుగు ప్రయాణమవుతారు.

## వెంకన్నకు భక్తుని భారీ కానుక

విశాఖకు చెందిన హిందుస్థాన్ ఎంటర్ ప్రైజెస్ ఎండీ పువ్వాడ మస్తాన్రావు, కుంకుమ దంపతులు తిరుమల శ్రీవారికి భారీ బంగారు కానుక అందించారు. రూ.3.86 కోట్ల విలువైన స్వర్ణ యజ్ఞోపవీతాన్ని స్వామి వారికి బహూకరించారు. ఈ సందర్భంగా తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు.. దాతలను అభినందించి స్వామి వారి తీర్థప్రసాదాలు అందించారు.











చైతన్యరథం

# ఏపీ.. దేదీప్యమానం!





- ఆంధ్రప్రదేశ్ దేశానికే అన్నపూర్ణ
- ఏపీ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుంది
- బెజవాడ దుర్గమ్మ దర్శనం సంతోషదాయకం
- ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ వ్యాఖ్య
- రాధాకృష్ణన్‌కు ముఖ్యమంత్రి ఘన స్వాగతం
- ఘనంగా వీడ్కోలు పలికిన గవర్నర్ అబ్దుల్ నజీర్

విజయవాడ (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్‌కు తొలిసారి పర్యటనకు వచ్చిన ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ విజయవాడ దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలతో ఉప రాష్ట్రపతికి ఘన స్వాగతం పలికారు. మంత్రి కొలుసు పార్థసారథి, పాలకమండలి చైర్మన్ రాధాకృష్ణ తదితరులు.. ఉప రాష్ట్రపతి దంపతులకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ.. విజయవాడ రావడం, అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని.. ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రజలంతా సంతోషంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు. రాష్ట్రంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా తొలుత గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ఉప రాష్ట్రపతికి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, ఐటీ మంత్రి లోకేశ్, ఇతర మంత్రులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు.

## ఘనంగా వీడ్కోలు పలికిన గవర్నరు

ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని శ్రీ కనకదుర్గమ్మ దర్శనం, విజయవాడ ఉత్సవ్ 2025 కార్యక్రమం ముగించుకుని తిరుపతికి తిరుగు ప్రయాణమైన భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ దంపతులకు గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎస్ అబ్దుల్ నజీర్, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. బుధవారం సాయంత్రం 6:50 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం నుండి తిరుపతికి ప్రయాణమయ్యారు.

కృష్ణా జిల్లా ఇన్చార్జి మంత్రి, కార్మిక, కర్మాగారాల మంత్రి వాసంశెట్టి సుభాష్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్ కుమార్ మీనా, డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జీవీజీ అశోక్‌కుమార్, ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, రాజ్యసభ సభ్యులు సాన సతీష్, గుడివాడ, పామర్రు, పెడన నియోజకవర్గాల ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా, కాగిత కృష్ణప్రసాద్, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు డీకే బాలాజీ, జీ లక్ష్మీశ, జిల్లా ఎస్పీ వీ విద్యాసాగర్ నాయుడు భారత ఉపరాష్ట్రపతికి ఘనంగా వీడ్కోలు పలికారు.











## మంత్రి నిమ్మల కుమార్తె వివాహానికి హాజరైన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

పాలకొల్లు (చైతన్య రథం): ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె శ్రీజ వివాహానికి సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి లోకేశ్ హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు పట్టణం బ్రాడీపేటలో నిర్వహించిన వేడుకలకు వీరిద్దరూ వచ్చి నూతన వధూవరులు శ్రీజ, దుర్గా హరిహర సాయి పవన్‌కుమార్‌లను ఆశీర్వదించారు. వైవాహిక జీవితంలోకి అడుగుపెడుతున్న నూతన దంపతులకు మంత్రి లోకేశ్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. తొలుత కల్యాణవేదిక వద్దకు చేరిన సీఎం చంద్రబాబుకు భారీ గజమాలతో మంత్రి నిమ్మల స్వాగతం పలికారు. ప్రజలు, నాయకులకు అభివాదం చేస్తూ లోకేశ్ కాలినడకన కల్యాణవేదిక వద్దకు చేరుకున్నారు. వివాహ వేడుకకు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు, పెద్ద సంఖ్యలో తెదేపా కార్యకర్తలు హాజరయ్యారు. దీంతో పాలకొల్లులో సందడి వాతావరణం నెలకొంది.





## పవన్ హామీతో.. ఉప్పాడలో ఆందోళన విరమణ

పిఠాపురం(చైతన్యరథం): కాకినాడ జిల్లా ఉప్పాడలో రెండు రోజులుగా మత్స్యకారులు చేస్తోన్న ఆందోళనను ఎట్టకేలకు విరమించారు. కాలుష్య కారక పరిశ్రమలను మూసివేయాలని,ఫార్మాకంపెనీల నుంచి విడుదలవు తున్న వ్యర్థాలుసముద్రంలో కలవడంతో మత్స్య సంపద దెబ్బతింటోందని రెండురోజులుగా మత్స్యకారులు ధర్నా చేస్తోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నాయకుల తో కమిటీ ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సీఎం హామీఇచ్చినట్టు జిల్లాకలెక్టర్ మత్స్యకారులకు తెలిపారు.దీనిపై మత్స్యకార సంఘాల నాయకులు చర్చించుకున్న అనంతరం ఇవాళ సాయంత్రం ధర్నా విరమిస్తున్నట్టు ప్రకటించారు. వచ్చేనెల 10లోగా సమస్యలను పరిష్కరించాలని..లేనిపక్షంలో మరోసారి ధర్నాకు దిగుతామని తెలిపారు.

## జీఎస్టీ సంస్కరణలతో వాహన అమ్మకాల్లో జోరు

- కొత్త పన్ను విధానం ప్రజలకు ఊరట
- రోజుకి 4 వేల రిజిస్ట్రేషన్ల దిశగా రాష్ట్రం
- రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో నూతనంగా అమలైన జీఎస్టీ విధానం వాహనాల అమ్మకాలకు ఊత మిచ్చిందాని,పన్నుభారం తగ్గడం తో ప్రజలు కొత్తవాహనాల కొనుగోలుకు ముందుకువస్తున్నారని రవాణా, యువజన, క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 2,991 వాహనాలు తాత్కాలిక రిజి స్ట్రేషన్ పొందాయని తెలిపారు. వీటిలో మోటార్ సైకిళ్లు 2,352, కార్లు/క్యాబ్‌లు 241, ట్రాక్టర్లు 60, ఆటోలు 227, గూడ్స్ వాహనాలు 47, ఆటో గూడ్స్ వాహనాలు 50, ఇతర వాహనాలు 12ఉన్నాయని తెలిపారు. ఈకొత్త విధానం అమల్లోకి వచ్చిన తరువాత రిజిస్ట్రేషన్ వేగం పెరుగుతుందని త్వరలోనే రోజుకు 4,000వాహనాల రిజిస్ట్రేషన్ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కొత్త పన్ను విధానం ప్రజలకు ఊరట కలిగి స్తుందని చెప్పారు. ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా జీఎస్టీ సంస్కరణలు ఉన్నాయని ప్రశంసించారు.

# నేత కళను కాపాడుకోవాలి

- చేనేతలకు ప్రోత్సహంపై ఎమ్మెల్యేలతో వర్కింగ్ గ్రూప్
- అవినీతిని అరికట్టడంద్వారా రూ.200 కోట్లు ఆదాచేశాం
- శాసనసభ్యలంతా వీవర్స్‌శాలను అధ్యయనం చేయండి
- అసెంబ్లీలో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్

అమరావతి (చైతన్య రథం): చేనేత సొసైటీలకు కొంతశాతం యూనిఫాం తయారీ ఆర్డర్ ఇచ్చే అంశంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఎమ్మెల్యేలతో వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ చెప్పారు. 5వరోజు అసెంబ్లీ సమావేశాల ప్రశ్నోత్తరాల్లో భాగంగా నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేష్ సమాధానమిస్తూ... గతంలో ఆప్కోకు ఆర్డర్ ఇస్తే సొసైటీలు సకాలంలో యూనిఫాం సరఫరా చేయలేకపోయారు. చేనేతలను ప్రోత్సహించే అంశంపై గతంలోనూ పలుమార్లు చర్చలు జరిగాయి. అయితే ఇందుకోసం స్ట్రక్చరల్ చేంజ్ రావాలి. ప్రభుత్వ టెండరులో సొసైటీలు ఎలా పోటీపడాలనే విషయాన్ని పరిశీలించాల్సి ఉంది. దాదాపు 50 నియోజకవర్గాల్లో చేనేతలు ఉన్నారు. యూనిఫామ్ విషయంలో మార్కెట్ ధరల పోటీని ఎలా ఎదుర్కోవాలనే విషయమై సభ్యులందరం కూర్చుని మాట్లాడాలి. ఇందుకోసం నలుగురైదురు సభ్యులతో వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేస్తాం. చేనేత వృత్తిని అందరం కలసికట్టుగా కాపాడాలి. అదే సమయంలో సరైన విధంగా సరఫరా జరిగేలా కూడా చూడాలి. అందరం కలసి చర్చిస్తే శాశ్వతమైన పరిష్కారం లభిస్తుంది. కమిట్‌మెంట్‌తో చేనేతలను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపైన ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ స్వదేశీ గురించి చెప్పారు. ఇందులో చేనేత కీలకమైన పాత్ర పోషిస్తుందని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

2019-24 నడుమ స్కూలు విద్యార్థులకు యూనిఫాం కొనుగోలులో అవకతవకలు జరిగినట్టు కొన్ని ఫిర్యాదులు అందాయి. దీనిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించాం. నివేదిక అందిన వెంటనే



చర్యలు తీసుకుంటామని లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బెస్ట్ క్వాలిటీతో మంచి ఫ్యాబ్రిక్, డిజైన్‌తో విద్యార్థులకు అత్యుత్తమమైన కొత్త యూనిఫాం ఇచ్చాం. గతంలోకంటే డ్యూరబిలిటీ, బ్రీతబిలిటీ ఎక్కువ ఉండే దుస్తులిచ్చాం. బాయ్స్, గర్ల్స్‌కు ఒకే విధమైన యూనిఫాం ఇచ్చాం. పాఠశాల విద్యశాఖలో ఐదేళ్లలో వెయ్యికోట్లు ఆదాచేయాలని అధికారులను ఆదేశించాం. టెండరు విధానం పారదర్శకంగా నడిపించాలని చెప్పాం. దీంతో గతఏడాది సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరిట విద్యార్థులకు అందించే కిట్స్, గుడ్లు, చిక్కీలలో రూ.200 కోట్లు ఆదా చేశాం. ఇదే విధానాన్ని అమలుచేసి ఐదేళ్లలో రూ.వెయ్యికోట్లు ప్రభుత్వ ఖజానాకు ఆదా చేస్తామని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు.

"చేనేతలను ప్రోత్సహించేందుకు మంగళగిరి నియోజకవర్గంలో నిర్మాణాత్మకంగా కృషి చేస్తున్నాం. మంగళగిరిలో వీవర్స్ శాల ద్వారా చేనేత కార్మికులకు 40నుంచి 50శాతం ఆదాయం పెంచాం' అని మంత్రి లోకేష్ చెప్పారు. డిజైన్లు, మార్కెటింగ్‌పై టాటా టనేరాతో ఒప్పందం చేసుకున్నాం. మా వంతుగా చేనేత వస్త్రాలను ప్రమోట్ చేస్తున్నాం. గౌరవ సభ్యులు సమయం ఉన్నపుడు వీవర్స్‌శాలను సందర్శించాలి. చేనేతలకు మెరుగైన ఉపాధి, ఆదాయం వచ్చేలా మార్కెట్ లింక్ చేసే అంశాన్ని అధ్యయనం చేయాలి. మేం మూడున్నరేళ్లుగా వీవర్స్‌శాల ద్వారా చేనేతల ఆదాయం పెంచే ప్రయత్నం చేస్తున్నాం. అయినప్పటికీ ఈ వ్యవస్థలో ఇంకా దళారులు ఉన్నారు. చేనేతలను కాపాడుకునేందుకు దీర్ఘకాలిక ప్రణాళిక అమలుచేయాల్సి ఉంది. చేనేతలు వృత్తిపరంగా ఇబ్బంది పడుతున్న మాట వాస్తవం. పాదయాత్రలో ఇచ్చిన హామీమేరకు చేనేతలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం, ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని లోకేష్ స్పష్టం చేశారు.

# చిత్తూరు జిల్లాకు యూనివర్సిటీ



- ప్రతి నియోజకవర్గానికీ జూనియర్ కళాశాల ప్రభుత్వ లక్ష్యం
- శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి లోకేష్

అమరావతి (చైతన్య రథం): చిత్తూరు జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేసే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. 5వరోజు అసెంబ్లీ సమావేశాల ప్రశ్నోత్తరాల్లో భాగంగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ రావు, తుని ఎమ్మెల్యే యనమల దివ్య అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేష్ సమాధానమిచ్చారు. గత ఏడాది నవంబర్‌లో గురజాల ఎమ్మెల్యే జగన్మోహన్ రావు ఈమేరకు ప్రభుత్వానికి లేఖరాశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా విభజన తర్వాత చిత్తూరు జిల్లా పరిధిలో ప్రభుత్వరంగంలో ద్రవిడియన్, ప్రైవేటురంగంలో అపోలో వర్సిటీలు ఆ జిల్లా పరిధిలో ఉన్నాయి. ప్రతి జిల్లాలో ఒక ప్రభుత్వ లేదా ప్రైవేటు వర్సిటీ ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు. ద్రవిడియన్ వర్సిటీ చిత్తూరులో ఉన్నప్పటికీ అది లాంగ్వేజ్ స్పెసిఫిక్ వర్సిటీ. కలసికట్టుగా పనిచేసి చిత్తూరులో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని మంత్రి లోకేష్ చెప్పారు. తుని నియోజకవర్గం తొండంగి మండలం రావికంపాడులో హైస్కూలును జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేయాలని తుని ఎమ్మెల్యే యనమల దివ్య కోరగా, మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ... గత సర్కారు ప్రభుత్వ జూనియర్ కళాశాలలను నిర్వీర్యం చేసిందన్నారు. 'హైస్కూలు ప్లస్ విధానంతో కళాశాలల్లో సబ్జెక్ట్ టీచర్లు లేకుండా చేశారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం వచ్చాక ఈ విధానాన్ని ప్రక్షాళన చేశాం. ప్రభుత్వ కళాశాలల్లో 40శాతం అడ్మిషన్లు మెరుగుపర్చాం. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేశాం, కాంపిటీటీవ్ మెటిరీయల్ ఇస్తున్నాం. ఎగ్జామ్స్‌కు అవసరమైన మెటీరియల్ కూడా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అందిస్తున్నాం. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలను తీర్చిదిద్దుతాం. మండలానికి ఒక జూనియర్ కళాశాల ఉండాలన్నది ప్రభుత్వ సంకల్పం. దానికి కట్టుబడి ఉన్నాం. తుని ఎమ్మెల్యే దివ్య చేసిన విజ్ఞప్తిపై వివరాలు తెప్పించుకొని నిర్ణయం తీసుకుంటాం. రాబోయే రెండేళ్లలో ఈ లక్ష్యాన్ని సాధిస్తామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

# సాల్ట్ ప్రోగ్రాం భేష్



విద్యాశాఖామంత్రి నారా లోకేశ్‌తో సమావేశమైన ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, సమగ్ర శిక్ష ఎస్పీడీ బి శ్రీనివాసరావు.

- విద్యామంత్రి నారా లోకేశ్ సారథ్యం అద్భుతం
- ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల ప్రశంసలు

అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో అమలవుతున్న సంస్కరణలకు ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల నుండి ప్రశంసలు దక్కాయి. ప్రపంచ బ్యాంకు, సమగ్ర శిక్షలో అమలవుతున్న సాల్ట్ ప్రోగ్రాం కార్యక్రమాలు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వినూత్నంగా అమలవుతున్నాయని, దేశానికే కాదు.. దక్షిణ ఆసియకే రోల్ మోడల్‌గా నిలుస్తున్నాయంటూ పపంచ బ్యాంకు ప్రతినిధులు ప్రశంసలు కురిపించారు. బుధవారం విద్యా మంత్రి నారా లోకేశ్‌తో సమావేశమైన ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం.. ఆయన నాయకత్వాన్ని ప్రత్యేకంగా అభినందించారు. పాల్ ల్యాబ్‌లు, గ్యారెంటీడ్ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ, స్కూల్ లీడర్ షిప్ శిక్షణలు బాగా జరుగుతున్నాయన్నారు. మంత్రి లోకేశ్‌ను కలిసిన ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల్లో క్రిస్టెల్ కౌమే, సౌమ్య బజాజ్, యిన్ విన్ ఖైన్, ప్రియాంక సాహూతోపాటు పాఠశాల విద్యశాఖ కార్యదర్శి కోన శశిధర్, సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావులు ఉన్నారు.

## భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు

లీప్ కార్యక్రమానికి సాల్ట్ ప్రోగ్రాం ఎంతగానో దోహదపడుతోందని విద్యా మంత్రి నారా లోకేశ్ ప్రస్తావించారు. గ్యారెంటెడ్ ఎఫ్‌ఎల్‌ఎన్‌కి సాల్ట్ ప్రోగ్రాం ద్వారా జరిగిన ఎఫ్‌ఎల్‌ఎన్ ట్రైనింగ్ పునాది వేయడానికి ఉపయోగపడతాయన్నారు. శిక్షణ కార్యక్రమాల ద్వారా మూల్యాంకనం చేసి భవిష్యత్తు శిక్షణ కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ప్రపంచ బ్యాంకుతో భవిష్యత్తు నిర్మాణ కార్యక్రమానికి, భాగస్వామ్యానికి చర్చించడం కోసం మరోసారి సమావేశమవుతామని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు.

## పాల్ ల్యాబ్‌లు -విద్యలో కొత్త ఆవిష్కరణ

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేయడానికి పాల్ ల్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ ల్యాబ్‌ల ద్వారా విద్యార్థుల్లోని లోపాలను గుర్తించి వ్యక్తిగతంగా సహాయం చేయడానికి వీలుకలుగుతుంది. దీనివల్ల ఉపాధ్యాయులు మరింత మెరుగైన ప్రణాళికతో బోధించగలుగుతున్నారని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు మంత్రి లోకేశ్ వివరించారు.

## ఏపీలో ఎఫ్‌ఎల్‌ఎన్ గ్యారంటీడ్ పథకం

ఫౌండేషనల్ లెర్నింగ్ అండ్ న్యూమరసీ... అందించే లక్ష్యాన్ని సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో ఉందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. "గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ సాధిస్తామని.. అప్పుడు ప్రపంచానికే ఏపీ దిక్సూచిగా నిలుస్తుందని అన్నారు. రాష్ట్ర విద్యాభివృద్ధికి సాల్ట్ -సమగ్ర శిక్ష చేస్తున్న కృషికి విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్,ఎస్పీడీ బి.శ్రీనివాసరావును ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు అభినందించారు.

# మెగా డిఎస్సీ వేడుకకు రండి

## ఎమ్మెల్యేలకు మంత్రి నారా లోకేష్ ఆహ్వానం


అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మెగా డిఎస్సీ ఫైలుపైనే తొలి సంతకం చేశారు. దీనిద్వారా సుమారు 16వేల మందికి టీచర్ ఉద్యోగాలు రాబోతున్నాయని మంత్రి నారా లోకేష్ చెప్పారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క డిఎస్సీ ఏర్పాటు చేయలేదు. నోటిఫికేషన్ దగ్గరనుంచి ఎగ్జామ్స్, సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ వరకూ ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నాం. రేపు కొత్త ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతులమీదుగా నియామక ఉత్తర్వులు అందించబోతున్నాం. ఇది కూటమి ప్రభుత్వానికి గర్వకారణం. ఎమ్మెల్యేలంతా హాజరై జయప్రదం చేయాలని కోరుతున్నాం. ప్రతిపక్ష సభ్యులకూ జీఏడీ ద్వారా ఆహ్వానం పంపించాం. కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా వారినీ కోరుతున్నామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. మెగా డిఎస్సీని అడ్డుకునేందుకు వైసీపీ సుమారు వందకుపైగా కేసులు వేసింది. పకడ్బందీగా నోటిఫికేషన్ ఇవ్వడంతో ఒక్క స్టే కూడా రాలేదు. పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ పూర్తిచేశాం. రేపు సచివాలయం వెనుక వైపు నిర్వహించే భారీ కార్యక్రమానికి టీచర్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతోపాటు వారి కుటుంబసభ్యులు కలిసి సుమారు 32వేలమంది హాజరుకాబోతున్నారు. వేదిక వద్ద ప్రతిజిల్లాకు ఒక్కొక్క జోన్ ఏర్పాటుచేశాం. ఆయా జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు హాజరై సంబంధిత జోన్లలో కూర్చోవాల్సిందిగా కోరుతున్నాం. స్థలాభావంవల్ల అందరికీ బస్సులు ఏర్పాటు చేశామని చెప్పారు. శాసనమండలి డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు స్పందిస్తూ... డిఎస్సీ విషయంలో మంత్రి



లోకేష్ కృషికి అభినందనలు తెలిపారు. ప్రతిపక్షాలు కూడా విమర్శలు చేసే అవకాశం లేకుండా ఎంపిక ప్రక్రియ పూర్తిచేశారని ప్రశంసించారు.

# రాష్ట్రచరిత్రలో సువర్ణాధ్యాయం..

# మెగా డిఎస్సీ!



- నేడు విజేతలకు నియామక పత్రాలు..
- సీఎం, డిప్యూటీ సీఎం, విద్యామంత్రి చేతులమీదుగా అందజేత
- సచివాలయం వద్ద ప్రాంగణంలో విస్తృత ఏర్పాట్లు

అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన అతిపెద్ద డిఎస్సీని విజయవంతంగా పూర్తిచేసిన కూటమి ప్రభుత్వం... నేడు (గురువారం) విజేతలకు నియమాక పత్రాలు అందించబోతోంది. అమరావతి సచివాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ప్రాంగణంలో ఇందుకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్య, ఐటి మంత్రి నారా లోకేష్ చేతులమీదుగా డిఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టిన వెంటనే జూన్ 13, 2025న మెగా డిఎస్సీ ఫైలుపై తొలి సంతకం చేశారు. తర్వాత అన్ని అవాంతరాలను అధిగమించి రాష్ట్ర విద్య, ఐటి మంత్రి నారా లోకేశ్ మెగా డిఎస్సీ క్రతువును విజయవంతంగా ముందుకు నడిపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పటివరకు ఒకసారి చరిత్రను పరిశీలిస్తే డిఎస్సీల ఛాంపియన్ చంద్రబాబునాయుడేనని స్పష్టమవుతుతోంది. 1994 నుంచి 2025 వరకు గత 31సంవత్సరాల్లో 14 డిఎస్సీలను ప్రకటించడం ద్వారా 1,96,619 టీచర్ పోస్టులను భర్తీచేసిన ఘనత తెలుగుదేశం, కూటమి ప్రభుత్వాలకే దక్కుతుంది. ఐదేళ్ల పాలనలో ఒక్క టీచర్ పోస్టును భర్తీచేయని వైసీపీ పెద్దలు... కూటమి ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్సీని అడ్డుకునేందుకు చేయని ప్రయత్నం లేదు. దీనిపై మొత్తం 106 కేసులు దాఖలు చేశారు. అయితే మొదటి నుంచీ ఈ విషయంలో చిత్తశుద్ధితో ఉన్న మంత్రి లోకేశ్.. అధికారులకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తూ విజయవంతంగా నియామక ప్రక్రియ పూర్తయ్యేలా చేశారు. మెగా డిఎస్సీ నోటిఫికేషన్ (ఏప్రిల్ 20, 2025) విడుదల చేశాక కేవలం 150 రోజుల వ్యవధిలో నియామక ప్రక్రియను పూర్తిచేసి... రికార్డు సృష్టించారు. మొత్తం 16,347 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా... ఎంపికైన 15,941 మందికి గురువారం నియాపక పత్రాలు అందజేయనున్నారు.

మంత్రి నారా లోకేశ్ ప్రత్యక్ష పర్యవేక్షణలో మెగా డిఎస్సీ ప్రక్రియలో ఎక్కడా ఎటువంటి విమర్శలకు తావులేకుండా అత్యంత పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా 5.3 లక్షలమంది అభ్యర్థులు మెగా డిఎస్సీ పరీక్షకు హాజరయ్యారు. పూర్తి పారదర్శకంగా డిఎస్సీ పరీక్షలను నిర్వహించిన ప్రభుత్వం... ఆ తర్వాత కీ, మెరిట్ జాబితాను ఆన్‌లైన్‌లో ప్రచురించారు. అన్నిస్థాయిలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి సమర్థవంతంగా ఫిర్యాదులను పరిష్కరించారు. ఎస్సీ వర్గీకరణతోపాటు తొలిసారిగా 3శాతం క్రీడాకోటాను కూడా అమలు చేశారు. క్రీడా కోటా ద్వారా 372మంది క్రీడాకారులకు టీచర్ ఉద్యోగాలు లభించాయి. మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులు, క్రీడా కోటా సహా అన్ని కేటగిరిల్లో వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్లను అమలుచేశారు. ఇకపై ప్రతిఏటా డిఎస్సీ నిర్వహించి టీచర్ పోస్టులను భర్తీ చేస్తామని మంత్రి నారా లోకేశ్ ఇప్పటికే ప్రకటించారు. ప్రస్తుతం డిఎస్సీలో మిగిలిపోయిన 406 పోస్టులతోపాటు కొత్తగా ఖాళీ అయ్యే పోస్టులతో వచ్చే ఏడాది మరో డిఎస్సీ ప్రకటించనున్నారు. ప్రస్తుత మెగా డిఎస్సీలో అత్యధికంగా రాయలసీమలోని కర్నూలు జిల్లాలో 2590 టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నారు.



మెగా డిఎస్సీ-2025లో ఎంపికైన 15,941మంది అభ్యర్థుల్లో 7,955 మంది (49.9శాతం) మహిళలు కాగా, 7,986 మంది (50.1శాతం) పురుషులు ఉన్నారు. పురుషులతో సమానంగా దాదాపు 50శాతం మంది ఎంపిక కావడం ఈ డిఎస్సీలో మరో విశేషం.

సచివాలయం సమీపంలోని ప్రాంగణంలో మెగా డిఎస్సీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. సబ్జెక్టులవారీగా రాష్ట్రస్థాయిలో టాపర్లుగా నిలచిన 16మంది, ఆరుగురు ఇన్‌స్పైర్ విజేతలకు కలసి 22మందికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్ చేతులమీదుగా నియామక పత్రాలు అందజేస్తారు. మిగిలిన వారికి ప్రాంగణంలోనే అధికారులు నియమాక పత్రాలు ఇచ్చేవిధంగా ఏర్పాట్లు చేశారు. ప్రాంగణంలో అభ్యర్థులు, వారితోపాటు వచ్చే కుటుంబసభ్యులు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖుల కోసం మొత్తం 34వేల సీటింగ్‌తో కుర్చీలు ఏర్పాటు చేశారు. రాయలసీమ, దక్షిణ కోస్తా, గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాలవారీగా ప్రాంగణంలో నాలుగు జోన్లు ఏర్పాటు చేశారు. ఇందులో మళ్లీ జిల్లాలు, నియోజకవర్గాల వారీగా సబ్ జోన్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి పాఠశాల విద్యాశాఖ తరపున ఒక ఇన్‌ఛార్జిని నియమించారు. ఆయా జిల్లాల్లో ఎంపికైన నాన్ లోకల్ అభ్యర్థుల కోసం ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు. రాయలసీమ అభ్యర్థులు ప్రత్యేక బస్సుల ద్వారా ఈ రాత్రికి గుంటూరు చేరుకొని, రేపు మధ్యాహ్నం ప్రాంగణానికి వచ్చేలా ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల వాసులకు విజయవాడలో బస ఏర్పాటు చేశారు. రేపు అక్కడనుంచి వారు ప్రాంగణానికి చేరుకుంటారు. నియమాక పత్రాల అందజేతతోపాటు చివరి అభ్యర్థి వరకూ క్షేమంగా స్వస్థలాలకు చేర్చేలా పాఠశాల విస్తృతమైన ఏర్పాట్లు చేసింది.

# రూ.10,644 కోట్ల పర్యాటక పెట్టుబడులు

- 103 సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకున్నాం
- నూతన పాలసీతో ఆ రంగానికి ఊతం
- 100 పుణ్యక్షేత్రాల్లో టెంట్ సిటీలు ఏర్పాటు
- మండలిలలో మంత్రి కందుల దుర్గేష్

అమరావతి(చైతన్యరథం): కూటమి ప్రభుత్వంలో 15 నెలల కాలంలో రూ.10,644 కోట్ల పర్యాటక పెట్టుబడులతో 103 సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకున్నామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. బుధవారం శాసనమండలిలో పర్యాటక రంగంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మంత్రి కందుల దుర్గేష్ స్పష్టమైన సమాధానాలతో కూడిన వివరణ ఇచ్చారు. 2024-29కి నూతన పర్యాటక పాలసీ తీసుకొచ్చాం. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించాం. పారిశ్రా మిక రాయితీలు అనుసరించి కేపిటల్ ఇన్సెంటివ్స్, పవర్ ఛార్జీలు, ఎస్జీఎస్టీ తదితర అంశాల్లో రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం వల్ల 15 నెలల కాలంలో రూ.10,644 కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చి 103 సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకున్నామని తెలిపారు. ఎంవోయూలు చేసు కున్న దాంట్లో రూ.3887 కోట్లతో 15 ప్రాజెక్టుల ద్వారా 2848 గదులు ఏర్పాటు చేసు కునేందుకు అడుగులు పడ్డాయి. అదేవిధంగా రూ.3668 కోట్ల తో 24 ప్రతిపాదనలకు సంబంధించి డీపీఆర్‌లు అందాయి. తద్వారా మరో 3164 గదులు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. పర్యాటక రంగాన్ని ఏపీలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి చేయా లన్న ఉద్దేశంతో టూరిజం సర్క్యూట్‌లు ఏర్పాటు చేస్తున్నాం. అందులో ఎకో, అడ్వెంచర్, వెల్ నెస్, హెలీ టూరిజంలను ప్రవే శపెడుతున్నాం. టూరిజం ప్రాజెక్టులకు ఎంవోయూలు కుదుర్చు కోవడమే కాదు ఆచరణలోకి తెచ్చాం. పీపీపీ విధానంలో హోటళ్లు నిర్మించేందుకు నిర్ణయించినట్లు చెప్పారు.

## అన్ని ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధి

గత ప్రభుత్వంలో మాదిరి డబ్బును ఒకే చోట రాజ ప్రాసాదాలలో కేంద్రీకరించ కుండా సరైన విధాన రూపకల్పనతో అన్ని ప్రాంతాలకు వెచ్చిస్తున్నాం. నూతన పర్యాటక పాలసీలో భాగంగా ల్యాండ్ అలాట్ మెంట్ పాలసీ ద్వారా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశాం. ఎక్కడెక్కడ టూరిజం డిపార్ట్‌మెంట్‌కు ల్యాండ్ ఉందో ఆ ల్యాండ్ పార్సిల్స్‌ను టూరిజం వెబ్‌సైట్‌లో పారదర్శ కంగా అందుబాటులో ఉంచాం. పెద్దపెద్ద సంస్థలతో ఒప్పందం చేసుకున్న సంస్థ లకు ల్యాండ్ పార్సిల్స్ కేటాయించే అవకాశం కల్పించాం. హోమ్ స్టే పాలసీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని మండువా లోగిళ్లను, పురాతన కట్టడాల్లో పర్యాటకులకు విడిది కల్పించే చర్యలు చేపట్టాం. తద్వారా విదేశీ పర్యాటకులను ఆకర్షించాలని భావిస్తున్నాం. త్వరలోనే హోమ్ స్టే పాలసీ తీసుకొస్తున్నాం. గత ప్రభుత్వం హోమ్ స్టే గురించి ఆలోచిం చిన పాపాన పోలేదు. కొన్ని పర్యాటక ప్రాంతాల్లో స్టార్ హోట ళ్లు నిర్మించే పరిస్థితి ఉండదు కాబట్టి ఈ క్రమంలో పర్యాటకులు తిరగడానికి, స్టే చేసేందుకు క్యారవాన్ టూరిజం పాలసీ తీసుకొచ్చాం. ఈ క్రమంలోనే విశాఖలో డబుల్ డెక్కర్ బస్సుల ను ఏర్పాటు చేసి 11 ప్రాంతాలు పర్యాటకులు సందర్శించేందు కు అందుబాటులోకి తీసుకొచ్చాం. కేవలం రూ.250 టికెట్‌తో 24 గంటలు ఆయా ప్రాంతాలను సందర్శించే అవకాశం కల్పించాం. ఉత్తర ప్రదేశ్‌లో కుంభమేళా జరిగిన సమయంలో టెంట్ సిటీలు కీలక పాత్ర పోషించాయి. ఈ క్రమంలో ఏపీలోని 100



పుణ్యక్షేత్రాల్లో టెంట్ సిటీలు ఏర్పాటు చేసేందుకు సంకల్పించాం. ఒక దేవాల యానికి దర్శనానికి వచ్చిన భక్తుడు రెండు మూడు రోజులు సమీప ప్రాంతాలను సందర్శించేందుకు వీలు కలిగేందుకు చర్యలు తీసుకున్నాం. కేంద్ర ప్రభుత్వ సహకారంతో వివిధ పథకాల ద్వారా రూ.441 కోట్ల నిధులతో అఖండ గోదావరి, గండికోట, సూర్యలంక బీచ్, అన్నవరం, సింహాచలం, అహోబిలం, అన్నవరం, నాగార్జునసాగర్ తదితర పర్యాటక ప్రాజెక్టులు చేపడుతున్నాం. అఖండ గోదావరి ప్రాజెక్టు ద్వారా రాజమహేంద్రవరం సమీపంలోని గోదావరి పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నాం. అందులో భాగంగా పురాతన హేవలాక్ బ్రిడ్జిని ఆధునికీకరిస్తూ అందంగా తీర్చిదిద్దుతున్నాం. సందర్శకుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి అయింది. పనులు ప్రారంభమయ్యాయి. గ్రాండ్ క్యానియన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన గండికోట దగ్గర అద్భుత సాహస పర్యాటకాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగంపై ఎంత దృష్టి పెడుతోందనడానికి ఇదే నిదర్శనం.. రాబోయే నాలుగేళ్ల కాలంలో 50 వేల గదుల ఏర్పాటే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాం. ఏపీని పర్యాటకాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని భావిస్తున్నాం. పర్యాటక రంగం ద్వారా ప్రజలకు ఆహ్లాదం, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఆ దిశగా చర్యలు చేపట్టామని వివరించారు.

## గత ప్రభుత్వంలో పర్యాటకాభివృద్ధి శూన్యం

2019-24 మధ్య పర్యాటక శాఖ కేవలం 2 ప్రాజెక్టులను మాత్రమే చేపట్టింది. అందులో ఒకటి అల్లూరి సీతారామరాజు పుట్టిన పాంద్రంగి గ్రామం వద్ద అభివృద్ధికి రూ.2 కోట్లు కేటాయించి ఖర్చు చేశారు. రూ.451 కోట్లతో విశాఖపట్నం జిల్లా రుషికొండ వద్ద రాజప్రాసాదాన్ని నిర్మించారు. 2019-24లో రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా ఒకే ఒక ప్రాజెక్టు మంజూరైంది. రూ.54 కోట్ల వ్యయంతో ప్రసాద్ పథకం కింద విశాఖపట్నంలోని వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో తీర్థయాత్రికుల సౌకర్యార్థం చేపట్టారని వెల్లడించారు. పై ప్రాజెక్టులకు మొత్తం రూ.438.86 కోట్ల నిధులు ఖర్చు కాగా ఇందులో కేవలం రూ.2 కోట్లు మాత్రమే అల్లూరి సీతారామరాజు గ్రామానికి ఖర్చుపెట్టారు. మిగతా డబ్బు అంతా రుషికొండ రాజప్రాసాదానికే ఖర్చు చేశారని విమర్శించారు. 2019-24 కాలంలో ప్రైవేట్ పార్టీలకు ఆపరేషన్స్ అండ్ మేనేజ్ మెంట్ కార్యకలాపాలపై ఏపీటీడీసీ హోటళ్లు, రెస్టారెంట్లు, షాపులు, లైట్ అండ్ సౌండ్ షో వంటి 50 ఆస్తులను ఇవ్వడమైందన్నారు. ఉదాహరణకు తిరుపతి, పలమనేరు, మైపాడు, గోపవరం మొదలైన ప్రాంతాల్లో హోటళ్లను ఇచ్చారని తెలిపారు. 2019-24 వరకు జరిగిన ఈ కార్యక్రమాల్లో ఎక్కడా పర్యాటక రంగం అభివృద్ధి చేయ డానికి గత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టలేదని స్పష్టం చేశారు.

# మహిళల ప్రాముఖ్యతకు నిదర్శనమే.. నవరాత్రోత్సవాలు

- తెలుగు భాష ఎంతో మధురమైనది
- విజయవాడ వేడిగా ఉన్నా.. ప్రజలు కూల్
- విజయవాడ ఉత్సవ్ మరో వందేళ్లు కొనసాగాలి
- విజయవాడ ఉత్సవ్‌లో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్




విజయవాడ (చైతన్య రథం): విజయవాడ పున్నమి ఘాట్‌లో నిర్వహిస్తోన్న విజయవాడ ఉత్సవ్ -2025లో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్యఅతిథిగా బుధవారం సాయంత్రం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ మాట్లాడుతూ తెలుగులో అందరికీ నమస్కారం చెప్పి ప్రసంగాన్ని కొనసాగించారు. తెలుగు భాష సౌందర్యం, సాహిత్యం, సంగీత వైభవాన్ని ప్రశంసిస్తూ తెలుగు భాష ఎంతో మధురమైనదని ప్రముఖ తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి అన్న మాటలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. విజయవాడ ఉత్సవ్ మరో వందేళ్లపాటు కొనసాగాలని ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాల ప్రత్యేకతను గుర్తుచేస్తూ దేశవ్యాప్తంగా దుర్గా నవరాత్రులు ఎంతో ప్రత్యేకమని, తొమ్మిది రోజులపాటు అమ్మవారిని భక్తితో పూజించే సంప్రదాయం ద్వారా మన భారతీయ సంస్కృతిలో మహిళల ప్రాముఖ్యతను తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. మహిళా శక్తిని గౌరవించడం భారతీయ సంప్రదాయమని, అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా కొలవడం ద్వారా శక్తి, భక్తి రెండూ లభిస్తాయన్నారు. ఉత్సవం ద్వారా ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నానన్నారు. విజయవాడ ప్రత్యేకతపై మాట్లాడుతూ విజయవాడ ప్రాంతం వేడిగా ఉన్నా ఇక్కడ ప్రజలు మాత్రం కూల్‌గా ఉంటారన్నారు. రాబోయే రోజుల్లో విజయవాడ దేశంలోనే అభివృద్ధి చెందిన నగరంగా నిలవబోతోందని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై మాట్లాడుతూ విద్య, వైద్యరంగాల్లో రాష్ట్రం ముందుకు సాగుతోందన్నారు. వికసిత భారత్ అనేది ఒక కల కాదు, నిజం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు వెళ్తోందన్నారు. శాస్త్ర, సాంకేతిక, వైద్య, విద్యరంగాల్లో కూడా రాష్ట్రం విశేష పురోగతిని సాధిస్తోందని తెలిపారు.

ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తన మొదటి అధికారిక పర్యటనలో భాగంగా విజయవాడకు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేసారు. తనకు ఇక్కడ అద్భుతమైన గౌరవం లభించిందని, ఇక్కడి సంప్రదాయాలు, సంస్కృతి దేశానికి గర్వకారణమన్నారు. కనకదుర్గ అమ్మ పేరులోనే అనుగ్రహం, ప్రేమ, అమృతం నిక్షిప్తమై ఉందని భావోద్వేగంగా తెలిపారు. మంత్రులు, అధికారులు అందరూ కలిసి రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ, రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సవ వేదికపై గాయని గీతా మాధురి పాడిన పాటలను ఉపరాష్ట్రపతి ప్రత్యేకంగా ప్రశంసించారు.

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ ఆధ్యాత్మిక, పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా విజయవాడ ఉత్సవ్ నిర్వహిస్తున్నామన్నారు. మూడు వేలమంది కళాకారులు ఉత్సవాల్లో ప్రదర్శనలు ఇస్తున్నారన్నారు.

ముందుగా విజయవాడ వైభవంపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఉపరాష్ట్రపతి, మంత్రులు తిలకించారు. సవ్య మానస బృందం ఆధ్వర్యంలో ప్రదర్శించిన వరాహరూపం తదితర నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, సత్య కుమార్ యాదవ్, పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, విజయవాడ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మురళీ, మాజీ పార్లమెంటు సభ్యుల గోకరాజు గంగరాజు, మాజీ శాసనమండలి సభ్యులు బుద్దా వెంకన్న, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# హిందూపురంలో ఎస్సీడీపీ ఏర్పాటు

- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత
- ఎమ్మెల్యే బాలకృష్ణతో కలిసి వీడియో కాన్ఫరెన్స్
- ఎస్సీడీపీతో 292మంది నేతన్నలకు లబ్ధి
- నేటి ట్రెండ్‌కు అనుగుణంగా చేనేత దుస్తుల తయారీ
- నిపుణులు, ఫ్యాషన్ డిజైనర్లతో చేనేతలకు శిక్షణ
- పట్టు సాగు పెంచేలా రైతులకు అవగాహన: మంత్రి సవిత





అమరావతి (చైతన్య రథం): హిందూపురంలో చేనేతలకు ఉపాధితో పాటు ఆధునిక దుస్తుల తయారీలో శిక్షణ ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎస్సీడీపీ) మంజూరు చేసినట్టు రాష్ట్ర చేనేత, జౌళి మంత్రి ఎస్ సవిత తెలిపారు. ఈ క్లస్టర్‌తో 292మంది నేతన్నలకు లబ్ధి చేకూరనుందని వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నాలుగో బ్లాక్‌లో ఉన్న తన పేషీలో ఎమ్మెల్యే బాలకృష్ణతో కలిసి హిందూపురంలో స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎస్సీడీపీ) ఏర్పాటుపై రాష్ట్ర చేనేత, జౌళి మంత్రి ఎస్ సవిత బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి హిందూపురంలో స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎస్సీడీపీ) ఏర్పాటుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. అంతకుముందు హిందూపురంలో ఎస్సీడీపీ ఏర్పాటు, నేతన్నలకు శిక్షణ అందించే విషయమై ఫ్యాషన్ డిజైనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ రూ.1.51 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఎస్సీడీపీకి కేంద్రం రూ.1.44కోట్లు, లబ్ధిదారులు రూ.7.12లక్షలు వాటాగా ఇవ్వనున్నారన్నారు. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం (ఎన్.హెచ్.డి.పి) కింద కేంద్ర ప్రభుత్వం హిందూపురానికి ఎస్సీడీపీ మంజూరు చేసిందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా నేతన్నలకు ఉపాధి లభించడంతోపాటు.. వారికి నేటితరం అభిరుచులకు అనుగుణంగా దుస్తుల తయారీలో శిక్షణ ఇవ్వనుమన్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ స్పందిస్తూ నూతన చేనేత దుస్తుల తయారీలో నిపుణులు, ఫ్యాషన్ డిజైనర్లతో నేతన్నలకు శిక్షణనిచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ప్రస్తుతతరం ఆలోచనలు, ఫ్యాషన్‌ను దృష్టిలో పెట్టుకుని చేనేత దుస్తుల రూపకల్పనపై నేతన్నలకు శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. నేతన్నలకు గౌరవప్రదమైన జీవనం అందించడానికి ఎస్సీడీపీ ఎంతో దోహదపడుతుందన్నారు.

### పట్టు సాగు పెంచేలా చర్యలు

సిల్క్ శారీలో పట్టు ఎంతో కీలకమని మంత్రి సవిత తెలిపారు. సిల్క్ శారీ తయారీలో అవసరమైన పట్టు రాష్ట్రంలో ఉత్పత్తికావడంలేదని,దీంతో బెంగుళూరు ఇతర ప్రాంతాలనుంచి కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. రాష్ట్రంలో పట్టు సాగు పెంచేలా చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. ఇతర ఏపంటల్లో లేనంత రాబడి పట్టుసాగులో వస్తోందని, దీనిపై రైతుల్లో అవగాహన కల్పించనున్నామని తెలిపారు. పట్టు ఉత్పత్తి పెంచి, తద్వారా సిల్క్ చీరల తయారీలో ఏపీ బ్రాండ్ పెంచేలా నిర్ణయించినట్టు మంత్రి సవిత తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా, సెరీ కల్చర్ డైరెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ విధ్వంసాన్ని సరిచేస్తున్నాం

**అమరావతి నిర్మాణ పనులపై మంత్రి నారాయణ**



అమరావతి (చైతన్య రథం): రాజధాని నిర్మాణ పనుల్లో ప్రస్తుతం 10 వేలమంది కార్మికులు పని చేస్తున్నారని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. భాజపా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు శాసనభలో అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. అమరావతిలో సీఆర్డీఏ నుంచి 21 పనులు, ఏడీసీ నుంచి 64 పనులు జరుగుతున్నట్టు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రాజధానిని నిర్వీర్యం చేసి మూడు ముక్కలాట ఆడిందని.. దీంతో అమరావతిలో అడవిలా పెరిగిన చెట్లను తొలగించేందుకు రూ.30 కోట్లు ఖర్చు పెట్టాల్సి వచ్చిందన్నారు. రాజధానిలో ట్రంక్ రోడ్లు, లే అవుట్ రోడ్లు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జడ్జీల బంగ్లాలు, అధికారులు, ఉద్యోగుల నివాసాల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. మార్చి 31నాటికి 3,500 ఫ్లాట్ల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. 2019కి ముందు పనులు చేసిన కొందరు కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంపై ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రశ్నించారు. పెద్ద కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్న ప్రభుత్వం.. చిన్న కాంట్రాక్టర్ల విషయంలో తేడా ఎందుకు చూపుతోందని అడిగారు. గతంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపును పరిశీలిస్తున్నట్టు మంత్రి నారాయణ తెలిపారు. "అమరావతిలో వైకాపా కుట్రలవల్ల జరిగిన విధ్వంసాన్ని సరిచేస్తున్నాం. గతంలో పనులు చేసిన కొందరు కాంట్రాక్టర్లు ఇప్పుడు ముందుకు రాలేదు. మళ్లీ టెండర్లు పిలవాల్సి వచ్చింది. హడ్కో, ప్రపంచ బ్యాంకు ద్వారా రాజధాని నిర్మాణానికి రుణాలు తీసుకున్నాం. పనులు ప్రణాళికబద్ధంగా జరుగుతున్నాయి. పనులు పూర్తయ్యాక ప్రధానిని పిలిచి ప్రారంభోత్సవం చేస్తాం. ఆమదాలవలసలో అమృత్-2లో భాగంగా అక్రమాలు జరిగింది నిజమే. కట్ట నిర్మాణ పనులతోపాటు మరికొన్నింటి విషయంలో నిధుల దుర్వినియోగం జరిగింది. కమిటీ నివేదిక వచ్చింది.. దాని ప్రకారం చర్యలు తీసుకుంటాం" అని నారాయణ సభకు స్పష్టం చేశారు.

# ఓజీ హిట్టవ్వాలి: లోకేశ్



అమరావతి (చైతన్య రథం): ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సినిమా ఓజీ పెద్ద హిట్టవ్వాలని విద్యా మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షించారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. "ఓజీ అంటే ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్. మా పవన్ అన్న అభిమానులకు మాత్రం ఒరిజినల్ గాడ్. పవర్ స్టార్ ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఓజీ సినిమా విడుదల సందర్భంగా పవన్ అన్నకు శుభాకాంక్షలు. సినిమా సూపర్ హిట్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు.

# ఉప్పాడ మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఆయా శాఖలతో కమిటీ ఏర్పాటు చేస్తాం
- అత్యవసర సమస్యలను ఇప్పటికే గుర్తించాం
- ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వెల్లడి

అమరావతి (చైతన్యరథం): ఉప్పాడ మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేస్తామని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మాస్యూటికల్ పరిశ్రమల ప్రభా వం వల్ల తమ జీవనోపాధి మీద ప్రభావం చూపుతుందని ఉప్పాడ ప్రాంత మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారి సమస్యలు నా దృష్టిలో ఉన్నాయి. మత్స్యకార కుటుంబాలు ఎదు ర్కొంటున్న కష్టాలు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోగలను. ప్రస్తుతం నేను శాసనసభ సమావేశాల కారణంగా వ్యక్తిగతంగా వచ్చి మత్స్యకారులతో నేరుగా చర్చించలేకపోతున్నాను. అయితే వారి సమస్యల పరిష్కారం కోసం సోమవారం నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులతో చర్చిస్తున్నాను. మీరు ప్రస్తావిస్తున్న ప్రతి సమస్యను పరిగణనలోకి తీసుకుని పరిష్కార మార్గాలు అన్వేషిం చాలని ఆదేశించాను. కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమలు, ఫిషరీస్, రెవెన్యూ ఉన్నతాధికారులు, కాకినాడ జిల్లా కలెక్టర్‌తో ఒక కమిటీని ఏర్పాటు చేస్తాం. ఇందులో మత్స్యకార ప్రతినిధులు, స్థానిక నాయకులకు స్థానం ఇవ్వాలని నిర్ణయించాం. సమస్యల పరిష్కారంతో పాటు జీవనోపాధుల మెరుగుదల, తీర ప్రాంత గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపైనా ఈ కమిటీ దృష్టిపె డుతుంది. నష్ట పరిహారం మదింపు గురించి ఈ కమిటీ చర్చిస్తుం ది. ఈ కమిటీ మత్స్యకారుల సమస్యలను అధ్యయనం చేసి అమ లు చేయదగిన సిఫారసులతో కూడిన నివేదికను సిద్ధం చేస్తుంది. ఆ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే వీలైనంత త్వరగా పరిష్కరించాల్సిన సమస్యలను గుర్తిం చాం. మరణించిన 18 మంది మత్స్యకారులకు సంబంధించి వారి కుటుంబాలకు చెల్లించాల్సిన బీమా మొత్తం చెల్లింపు, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ దగ్గర దెబ్బ తిన్న పడవలకు నష్ట పరిహారం చెల్లిం పు అంశాలపై అధికారులతో చర్చించాను. ఇందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించాను. అలాగే మచిలీపట్నం, అంతర్వేది తదిత ర ప్రాంతాల్లో మత్స్యకారులకు వేటకు వెళ్లేందుకు అవకాశం ఇవ్వ డంపైనా ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశాను. ఈ అంశాల పై కమిటీ నివేదిక కోసం ఎదురుచూడకుండా ప్రాధాన్యంతో పరిష్కరించాలని తెలిపాను.



ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం కష్ట జీవులకు భరోసా కల్పిస్తుంది. ఈ క్రమంలోనే ఉప్పాడ మత్స్యకారుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తాను. వారి సంక్షేమానికి ప్రాధాన్యమిస్తాం. అసెం బ్లీ సమావేశాలు ముగిసిన తరువాత, నేను స్వయంగా ఉప్పాడ మత్స్యకారులతో కూర్చొని అన్ని సమస్యలపై సమగ్రంగా చర్చిస్తానని తెలిపారు.

# ఆక్వా రంగాన్ని ఆదుకునేందుకు చర్యలు

- రైతులు తప్పనిసరిగా రిజిస్టర్ అవ్వాలి
- వారికి మాత్రమే సబ్సిడీ విద్యుత్ వర్తిస్తుంది
- అసెంబ్లీలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి (చైతన్యరథం): చేపల పెంపకపు అభివృద్ధి ప్రాధికా ర సంస్థ సవరణ బిల్-2025కు శాసనసభ ఆమోదం తెలపడంపై వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అభినందనలు తెలిపారు. ఆక్వా రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని వివరించారు. సీఎం చంద్రబాబు ఆక్వా రంగాన్ని జోన్, నాన్ జోన్‌గా విభజించి అభివృద్ధిపై దృష్టిపెట్టారు. ఆక్వా రైతులు తప్పనిసరిగా రిజిస్టర్ అవ్వాలి. వారికి మాత్రమే సబ్సిడీ విద్యుత్ యూనిట్‌కు రూ. 1.50 వర్తిస్తుందని వెల్లడిం చారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి ఆక్వా పంటలకు జియో ట్యాగ్ చేసి చెరువులను గుర్తిస్తున్నామని వివరించారు. అసెంబ్లీలో ముమ్మడివరం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రంలోని ఆక్వా రైతులకు సబ్సిడీలో 64,500 విద్యుత్ కనెక్షన్స్ లక్ష్యం కాగా.. ఇప్పటికీ 50,000 విద్యుత్ కనెక్షన్స్ ఇచ్చామని తెలిపారు. ఎమ్మెల్యేలు బాధ్యతగా తీసుకుని ఆక్వా బిల్లు, రిజిస్ట్రేషన్ల గురించి రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. సబ్సిడీ విద్యుత్ అందచేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 1100 కోట్లు ఖర్చు అవుతుంది. ఖర్చు ముఖ్యం కాదు.. ఆక్వా రంగాన్ని గాడిలో పెడుతున్నామన్న ఆనందం ముఖ్యమని తెలిపారు. రైతులకు లాభదాయకంగా ఉండేలా రైతులతో, ఆక్వా రంగ పెద్దలతో మాట్లాడి ఆక్వా చట్టాన్ని రూపొం దించాం. 20 శాతం మంది ఆక్వా రైతులు ఇప్పటివరకు రిజిస్ట్రే షన్ చేయించుకోలేదు..వారి కోసం 50 శాతం లేట్ ఫీజ్‌తో మరో అవకాశం కల్పిస్తాం. ఆక్వా కల్చర్ బిజినెస్ ఆపరేషన్ లైసెన్స్ జీవితకాలం ఒక సంత్సర కాలం నుంచి 5 ఏళ్లు తగ్గించేందుకు నిర్ణయం తీసుకున్నాం. ఆక్వా రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక ప్రణాళికలు, సబ్సిడీలు, మార్కెట్ అవకాశాల కల్పన, అంతర్జాతీయ మార్కెట్లపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని తెలిపారు.

# ప్రభుత్వ స్థలాల్లో అనధికార విగ్రహాలు

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం: మండలిలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి**



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేసిన అనధికారిక విగ్రహాల గురించి శాసనమండలిలో ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి, బి.తిరుమలనాయుడు, ఆలపాటి రాజేంద్రప్రసాద్ అడిగిన ప్రశ్నలకు ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ స్థలాలలో మొత్తం 2,524 అనధికారిక విగ్రహాలు ఉన్నాయి. ఇందులో జాతీయ రహదారులపై 38, రాష్ట్ర రోడ్లపై 1671, రాష్ట్ర హైవేలపై 815 ఉన్నాయి. నాయకుల విగ్రహాల ఏర్పాటులో నియంత్రణను అమలు చేస్తూ.. 18.02.2013న జీవో 18 ద్వారా ప్రభుత్వం కొన్ని నిర్దేశాలతో ఉత్తర్వులు ఇచ్చింది. పబ్లిక్ రోడ్లు, కాలి బాటలు, పక్క మార్గాలు, ఇతర ప్రజా వినియోగ ప్రదేశాలలో విగ్రహాల ఏర్పాటు లేదా కట్టడాల నిర్మాణానికి ఎటు వంటి అనుమతి ఇవ్వరాదు. హై మాస్ట్ లైట్స్, స్ట్రీట్ లైట్స్, విద్యుదీకరణ, ట్రాఫిక్/ టోల్ మౌలిక సదుపాయాలు, రోడ్ల అభివృద్ధి/ సుందరీకరణ వంటి పబ్లిక్ యుటిలిటీ/ సుందరీకరణకు సంబంధించిన పనులకు ఈ నిషేధం వర్తించదు. ప్రభుత్వ స్థలా లలోని అనధికారిక విగ్రహాలను తొలగించడానికి మార్గదర్శకాల ప్రకారం కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పులివెం దులలోని కూడళ్ల సుందరీకరణకు ప్రణాళిక శాఖ రూ. 3.50 కోట్లు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టడం జరిగింది. కడప పట్టణంలోని సర్కిళ్లను మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ, డిఎంఎస్ రూ. 7.21 కోట్లు నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేశారు. 2019లో ఇచ్చిన జీవో ప్రకారం ఇప్పటివరకు ఉన్న విగ్రహాలకు ఎటువంటి అనుమతి ఇవ్వలేదు.. ఉన్న విగ్రహాలను తొలగించడా నికి కూడా అనుమతి ఇవ్వలేదు. కలెక్టర్లు మార్గదర్శకాల మేరకు నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాల్లో అనధికార విగ్రహాలకు సంబంధించి సభ్యుల సూచన మేరకు పరిశీలించి వాటిపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

# ఎఫ్‌ఎంజీ విద్యార్థులకు శాశ్వత రిజిస్ట్రేషన్

- ప్రభుత్వం సానుభూతితో పరిశీలిస్తుంది
- ఎన్‌ఎంసీ మార్గదర్శకాలకు అనుగుణంగానే..
- 17 నెలలుగా జరగడం లేదనేది అవాస్తవం
- మండలిలో మంత్రి సత్యకుమార్ వెల్లడి



అమరావతి(చైతన్యరథం): విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించి న విద్యార్థులు (ఎఫ్ఎంజీ) ఏపీ వైద్య మండలి ద్వారా శాశ్వత రిజిస్ట్రేషన్ కల్పించే విషయాన్ని సానుభూతితో పరిశీలిస్తున్నామని వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) మార్గదర్శకాలు అనుసరిస్తూ విద్యార్థులకు న్యాయం చేసేందుకు ఉన్న అన్ని అవకాశాలను పరిగణనలోకి తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర శాసన మం డలిలో బుధవారం సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమా ధానమిచ్చారు. ఎన్ఎంసీ నుంచి వచ్చే మార్గదర్శకాలు, సూచన లనుసరించి విదేశాల్లో వైద్య విద్య పూర్తిచేసిన వారికి ఏపీ వైద్య మండలి శాశ్వత రిజిస్ట్రేషన్లు కల్పిస్తుంది. కొవిడ్-19, ఉక్రెయిన్ యుద్ధంవల్ల ఆన్‌లైన్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన విద్యార్థులకు శాశ్వత రిజిస్ట్రేషన్లు ఎన్ఎంసీ 2022 నుంచి సమయానుకూలంగా మార్గదర్శకాలు విడుదల చేస్తూనే ఉంది. ఆన్‌లైన్‌లో క్లినికల్ ట్రైనింగ్ చేసినట్లు కొందరు విద్యార్థులు ఏపీ వైద్యమండలి కార్యాల యానికి లేఖలు సమర్పించారు. అయితే ఎన్ఎంసీ మాత్రం ఆన్ లైన్‌లో చదివిన కోర్సును ఆన్‌లైన్‌లోనే పూర్తిచేయాలని స్పష్టం చేసింది. దీనివల్ల ఎన్ఎంసీ మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం అనుసరించక తప్పని పరిస్థితి. ఎన్ఎంసీ మార్గదర్శకాలకు విరు ద్ధంగా వ్యవహరించినందుకు రాజస్థాన్ వైద్య మండలి రిజిస్ట్రార్ సస్పెండ్ అయ్యారు. కర్ణాటక వైద్య మండలి రిజిస్ట్రార్ విధుల నుంచి తప్పించిన విషయాన్ని వివరించారు.

**318 మందికి శాశ్వత రిజిస్ట్రేషన్లు జారీ**

రాష్ట్ర వైద్య మండలి కార్యాలయానికి 2023, 2024లో కలిపి 653 మంది విద్యార్థుల నుంచి ఇంటర్న్‌షిప్, శాశ్వత రిజిస్ట్రేషన్ల కోసం దరఖాస్తులొచ్చాయి. ఎన్ఎంసీ మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తుదారుల్లో 318 మంది శాశ్వత రిజిస్ట్రేషన్లు జారీ చేయగా ..ఇంకా 335 మందికి జారీ చేయాల్సి ఉంది. 335 మందిలో 100 మందికి అర్హతలున్నా.. సదరు దేశాల దౌత్య కార్యాలయం నుంచి ధ్రువీకరణ పత్రాలు రావాల్సి ఉన్నందున పెండింగ్‌లో ఉన్నాయి. 40 మంది విద్యార్థులకు విదేశీ దౌత్య కార్యాలయాల నుంచి క్లియరెన్స్ వచ్చినప్పటికీ వీరు ఇంకా ఇంటర్న్‌షిప్ చేస్తున్నం దున అర్హతలేదని నిలిపివేశారు. 224 మంది ఇంటర్న్‌షిప్ చేస్తు న్నందున భారత దౌత్య కార్యాలయం క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంది. కొంతమంది విద్యార్థులు వేర్వేరు కారణాలతో కోర్టును ఆశ్రయిం చారు. వీరి పిటిషన్లపై న్యాయస్థానం ఇచ్చిన రెండు రకాల తీర్పుల పై స్పష్టత కోరుతూ డివిజన్ బెంచ్‌లో ఎన్ఎంసీ సూచన మేరకు ఏపీ వైద్య మండలి రివ్యూ పిటిషన్ వేసింది. ఎన్ఎంసీ నిబంధనల ను ఏపీ మెడికల్ కౌన్సిల్ తప్పనిసరిగా పాటించాల్సిందేనని నిన్ననే హైకోర్టు ఆర్డర్ ఇచ్చిందని సభకు వివరించారు.

**కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి జయశంకర్‌కు లేఖ**

విదేశాల్లో వైద్య విద్య పూర్తిచేసిన విద్యార్థుల డిగ్రీల గుర్తింపు నిరారణలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని కోరుతూ కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖకు ఈ నెల 19న లేఖ రాశాను. పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు విద్యార్థులకు ఇబ్బందులు ఎదురు కాకుండాలని చూడాలని కేంద్ర మంత్రిని కోరాను. శాశ్వత రిజిస్ట్రేషన్లు కోరే విదేశీ విద్యార్థుల గురించి నవంబరు 19, 2024న ఎన్ఎంసీ లేఖ రాసింది. విదేశాల్లో వైద్య విద్యను పూర్తి చేసిన విశ్వవిద్యాలయాల డిగ్రీ గుర్తింపును భారత్ దౌత్య కార్యాల యం ద్వారా నిర్ధారించుకోవాలని ఆ లేఖ ద్వారా రాష్ట్రాలకు ఎన్ఎంసీ సూచించినట్లు వివరించారు.

**ఎన్‌ఎంసీ నుంచి నోటీసులు**

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అనుసరించి ఎన్ఎంసీ 28.07. 2022న ఓ పబ్లిక్ నోటీస్ జారీచేసింది. ఇందులో కొవిడ్-19 లేదా ఉక్రెయిన్ యుద్ధం వల్ల భారత్‌కు తిరిగొచ్చిన చివరి సంవ త్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేందుకు తిరిగి సదరు విదేశాలకు వెళ్లిన విద్యార్థులు ఎంబీబీఎస్ కోర్సు కొనసాగిం పులో కోల్పోయిన క్లినికల్ శిక్షణకు బదులు భారత్‌లో రెండేళ్ల పాటు ఇంటర్న్‌షిప్ తప్పనిసరిగా పూర్తి చేయాలని ఎన్ఎంసీ పేర్కొంది. పూర్తిగా ఆఫ్‌లైన్‌లో చదివిన విదేశీ విద్యార్థులు కూడా భారత్‌లో ఏడాది ఇంటర్న్‌షిప్ పూర్తిచేయాలని ఎన్ఎంసీ నవంబరు 22, 2023 మరో పబ్లిక్ నోటీసు ఇచ్చింది. చివరి సంవత్సరం ఆన్‌లైన్‌లో చదివిన ఎఫ్ఎంజీలు క్లినికల్ శిక్షణ నష్టాన్ని భర్తీ చేసేందుకు రెండేళ్లు (ఏడాది పాటు క్లర్కాప్, మరో ఏడాది ఇంటర్న్ షిప్) పూర్తిచేయాలని నోటీసులో పేర్కొన్నారు. విద్యార్థులు తాము కోల్పోయిన ఆన్‌లైన్ తరగతులను అంతే కాలవ్యవధితో ఆన్‌లైన్ విధానంలో చదవాలి. ఇలా చేస్తేనే కోర్సు పూర్తిచేసినట్లుగా గుర్తిస్తామని ఎన్ఎంసీ ఈ ఏడాది ఆగస్టు 7న వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శికి లేఖలో స్పష్టం చేసిందని వివరించారు.

# జీఎస్టీ సంస్కరణలతో వాహన అమ్మకాల్లో జోరు

- కొత్త పన్ను విధానం ప్రజలకు ఊరట
- రోజుకి 4 వేల రిజిస్ట్రేషన్ల దిశగా రాష్ట్రం
- రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో నూతనంగా అమలైన జీఎస్టీ విధానం వాహనాల అమ్మకాలకు ఊతమిచ్చిందాని, పన్ను భారం తగ్గడంతో ప్రజలు కొత్త వాహనాల కొనుగోలుకు ముందుకు వస్తున్నారని రవాణా, యువజన, క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమ వారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 2,991 వాహనాలు తాత్కాలిక రిజిస్ట్రేషన్ పొందాయని తెలిపారు. వీటిలో మోటార్ సైకిళ్లు 2,352, కార్లు/క్యాబ్‌లు 241, ట్రాక్టర్లు 60, ఆటోలు 227, గూడ్స్ వాహనాలు 47, ఆటో గూడ్స్ వాహనాలు 50, ఇతర వాహనాలు 12 ఉన్నాయని తెలిపారు. ఈ కొత్త విధానం అమల్లోకి వచ్చిన తరువాత రిజిస్ట్రేషన్ వేగం పెరుగుతుందని త్వరలోనే రోజుకు 4,000 వాహనాల రిజిస్ట్రేషన్ సాధ్యమవు తుందని పేర్కొన్నారు. కొత్త పన్ను విధానం ప్రజలకు ఊరట కలిగిస్తుందని చెప్పారు. ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా జీఎస్టీ సంస్కరణలు ఉన్నాయని ప్రశంసించారు.

# జీఎస్టీ సంస్కరణలతో పేదలకు మేలు

### 20 సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్



విజయవాడ (చైతన్యరథం): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రయోజనాలపై హొటల్ హయత్‌లో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా 20 సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్, జీఎస్టీ జాయింట్ కమిష నర్లు ప్రశాంత్, కల్పన, రాష్ట్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ పొట్లూ రి భాస్కరరావు, ఏపీ స్టార్ హొటల్స్ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ స్వామినాయుడు, కార్యక్రమ సమన్వయకర్త కాకాణి తరుణ్ పాల్గొన్నారు. లంకా దినకర్ మాట్లాడుతూ వికసిత్ భారత్ సాధనకు అనుగుణంగా జీఎస్టీ సంస్కరణలు మేలు చేస్తాయని పేర్కొన్నారు. వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు, సేవలు న్యాయమైన ధరకు అందేలా వర్తక వాణిజ్యం నెరిపే వారి కోసం ఏర్పడిన ఛాంబర్ ఆఫ్ కామర్స్, హొటల్ అసోసియేషన్ వారి ద్వారా జీఎస్టీ అవగాహన సదస్సుకు హాజరుకావడం చాలా సంతోషంగా ఉందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు లాభం చేకూరుతున్నదో లేదో, వస్తు సేవల నాణ్యత విషయంలో రాజీ పడకుండా అందుతున్నాయో లేదో చూడవలసిన బాధ్యత జీఎస్టీ అధికారులు, వినియోగదారుల కమిషన్‌పై ఉందన్నారు. రెండు కేటగిరీలు 5 శాతం, 18 శాతానికి రేట్లను పునర్వ్యవస్థీకరించడం ద్వారా జీఎస్టీ సంస్కరణలను అమలు చేసినందుకు నిర్ణయం తీసుకున్న ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా జీఎస్టీ సంస్కరణలకు అనుకూలంగా ఏపీ అసెంబ్లీలో సానుకూల తీర్మానం చేసిన దేశం లో మొట్టమొదటి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

# ప్రతిపక్ష హోదా ప్రజలివ్వాలి.. కోర్టులు కాదు

- జగన్ విధ్వంసంతో రాజధాని పనులు ఆలస్యం
- అమరావతిలో అధునాతన భూగర్భ కేబుల్ వ్యవస్థ
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



అమరావతి(చైతన్యరథం): జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వా ల్సింది ప్రజలే కానీ.. న్యాయస్థానం కాదని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ వ్యాఖ్యానించారు. ఎంతమంది ఎమ్మెల్యేలు ఉంటే ప్రతి పక్ష హోదా వస్తుందో అని కూడా తెలియకుండానే జగన్ ముఖ్య మంత్రి ఎలా అయ్యాడని ఎద్దేవా చేశారు. గతంలో తాము 23 మంది ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసీపీ వాళ్లు తమ నుంచి నలుగు రు సభ్యులను లాగేసుకున్నా... ధైర్యంగా అసెంబ్లీకి వెళ్లి ప్రజల పక్షాన పోరాటం చేశామని గొట్టిపాటి గుర్తు చేశారు. అవినీతి, అక్రమాలకు సంబంధించి జగన్ జైలు నుంచి బెయిల్‌పై బయట కు వచ్చి నేటికి 12 ఏళ్లు పూర్తయిందని ఇందుకోసమే పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నారేమోనని మీడియా అడిగిన ప్రశ్న లకు మంత్రి సమాధానం చెప్పారు. జగన్ విధ్వంసంతో అమరా వతి అభివృద్ధి పనులు ఐదేళ్లు ఆలస్యమయ్యాయని మండిపడ్డారు. రాజధాని అమరావతిలో జరుగుతున్న సీఆర్డీఏ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణ పనులను విద్యుత్ శాఖ అధికారులతో కలిసి మంత్రి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు భవనం లోని వివిధ ఛాంబర్లను మంత్రికి చూపించారు. విద్యుత్ పనుల వివరాలను మంత్రికి తెలియజేశారు. దసరాకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా భవనం ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో అక్టోబర్ 2 నాటికి పూర్తిస్థాయిలో ఎలక్ట్రిఫికేషన్ పనులు పూర్తి కావాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భవనానికి విద్యుత్ అంతరా యాలు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను కూడా చేయాలన్నారు. సీఆర్డీఏతో విద్యుత్ శాఖ అధికారులు సమన్వయం చేసుకుని పను లు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అమరావతి ఆంధ్రుల ఫ్యూచర్ సిటీగా రూపుదిద్దుకుంటున్న నేపథ్యంలో సీఆర్డీఏ పరిధిలో విద్యుత్ ప్రమాదాలకు తావు లేకుండా అధునాతన భూగర్భ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సీఆర్డీఏ ప్రధాన భవనం పరిశీలన తరువాత మంత్రి మీడియాతో మాట్లాడారు. గత రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలతో పనులకు ఆటంకం ఎదురై నా నాణ్యత విషయంలో రాజీ పడకుండా భవన ప్రారంభ సమ యానికి అన్ని పనులూ పూర్తయ్యేలా చూస్తున్నామని తెలిపారు. 2.50 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ భవనంలో సుమారు రెండు మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుందన్నారు. నిరంతరాయం నాణ్యమైన విద్యుత్ అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. ఐదేళ్ల పాటు జగన్ విధ్వసం సృష్టించి రాజధాని లేని రాష్ట్రంగా చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశా రు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత బాధ్యతాయుతంగా అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా చంద్రబాబు తీర్చిదిద్ద తున్నారని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో సోలార్ ప్యానెల్స్, విండ్ టర్బైన్ల తయారీ కూడా చేపడుతున్నామని వివరించారు. ఏటేటా పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా సబ్ స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు.

# పేద విద్యార్థులంటే అంత అలుసా?

- పార్టీ కార్యాలయాలపై ఉన్న శ్రద్ధ
- వైద్య కళాశాలలపై ఎందుకు లేదు?
- దేశవ్యాప్తంగా పీపీపీ విధానం ఉంది
- రూ.8,44,000 కోట్లతో పనులు
- ప్రైవేటీకరణ, పీపీపీ మధ్య తేడా తెలియదా?
- వైసీపీ వైఖరిపై మంత్రి సత్యకుమార్ ధ్వజం
- శాసనమండలిలో ఘాటుగా సమాధానం
- చర్చ నుంచి పారిపోతున్నారంటూ ఎద్దేవా



అమరావతి (చైతన్యరథం): వైసీపీ పార్టీ కార్యాలయాల నిర్మాణాలపై పెట్టిన శ్రద్ధను... కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణా లపై పెట్టలేదని వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ విమ ర్శించారు. రూ.451 కోట్ల భారీ వ్యయంతో ప్యాలెస్‌ను నిర్మించిన జగన్ పేద వైద్య విద్యార్థుల గురించి ఏ మాత్రం పట్టించుకోలేదని మండిపడ్డారు. వైద్య విద్యను పేద విద్యార్థులకు చేరువ చేయాలన్న చిత్త శుద్ధిలేని వైకాపా నేతలు పీపీపీ విధానంలో కొత్త వైద్య కళా శాలల నిర్వహణపై అవగాహన రాహిత్యంతో అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. పీపీపీ విధానం దేశవ్యాప్తంగా అమల్లో ఉందన్నారు. కేంద్ర గణాంకాల ప్రకారం రూ.8.44 లక్షల కోట్ల విలువైన పనులు నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైపులైన్ కింద పీపీపీ విధానంలో పనులు జరుగుతున్నాయన్నారు. మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో పీపీపీ విధానంలో వైద్య కళాశాలలు అద్భుతంగా నడుస్తున్నాయని తెలిపారు. శాసనమండలిలో బుధవా రం వైద్య కళాశాలలు–పీపీపీ విధానం' అంశంపై జరిగిన స్వల్ప కాలిక చర్చలో మంత్రి మాట్లాడారు. “పబ్లిక్, ప్రైవేటు పార్టనర్ షిప్, ప్రైవేటీకరణ మధ్య ఉన్న తేడా తెలియని వారు సీఎంగా ఐదేళ్ల పాటు పనిచేయడం మన దౌర్భాగ్యం. పలు రాష్ట్రాల్లో డిజైన్, ఫైనాన్స్, బిల్డ్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ విధానంలో మెడికల్ కళాశా లల నిర్మాణం జరుగుతుందన్నారు. పీపీపీ విధానాన్ని జాతీయ రహదారులు, విమానాశ్రయాలు, చెన్నై ఐఐటీ వంటి ఉన్నత విద్య సంస్థల్లోనూ అనుసరిస్తున్నారు. 33 ఏళ్ల తరువాత ఆ వైద్య కళాశా లలన్నీ పూర్తిగా ప్రభుత్వం చేతికే వస్తాయి. కళాశాలల నిర్వహణ కోసం టెండరు ద్వారా ఎంపిక చేసిన సంస్థలు పెట్టుబడి పెడతా యి. కళాశాలలు నడుపుతాయి. ప్రభుత్వ భూముల అమ్మకాల ప్రస్తావనే ఇక్కడ ఉత్పన్నం కాదు అని వివరించారు.

### ప్రతి కళాశాలలో 150 చొప్పున సీట్లు

ప్రభుత్వం వద్దనే యాజమాన్య హక్కులు ఉంటాయి. కళాశాల లపై ప్రభుత్వ అజమాయిషీ ఉంటుంది. పీపీపీ విధానంలో నడిచే కళాశాలల్లో జాతీయ స్థాయి కోటా కింద సీట్లు కేటాయించాల్సిన అవసరం ఉండదు. కన్వీనర్ కోటాలోని 50 శాతం సీట్లు ఉచితం గా విద్యార్థులకు అందుబాటులో ఉంటాయి. పీపీపీ విధానంలో నడవ బోయే కళాశాలల్లో 150 చొప్పున సీట్లు ఉంటాయి. పీపీపీ విధానంలో ప్రారంభించే వైద్య కళాశాలల్లో 625 పడకలు ఉంటా యి. వీటిల్లో ఓపీ సేవలు పూర్తిగా ఉచితం. ఇన్ పేషెంట్ల కోసం కేటాయించిన పడకల్లో 70 శాతం ఉచితంగా పేదలకు కేటా యించాలి. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవా కింద సేవలు ఉచితంగా పీపీపీ విధానంలో నడిచే కళాశాలల్లోనూ కొనసాగుతాయి. గత వైసీపీ పాలనలో 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు రూ.8,480 కోట్లు ఆమోదిత వ్యయం కాగా...రూ.1,550 కోట్లు మాత్రమే ఖర్చుపెట్టారు. కేంద్రం, నాబార్డు నుంచి వచ్చిన నిధులను మాత్ర మే ఇందుకు వినియోగించింది. వైద్య కళాశాలల నిర్మాణాల పున రుద్ధరణకు రూ.786.82 కోట్లు కూటమి ప్రభుత్వం ఖర్చుపె ట్టింది. పార్వతీపురంలో కళాశాల ఏర్పాటుకు గత ప్రభుత్వం భూమిని కూడా సేకరించలేదు. భూమి లేకుండా నిర్మాణాలు జరప గలరా? బెంగుళూరులో భూమిని కొనుగోలు చేయకుండానే.. భవ నాలు నిర్మించారా? ప్యాలెస్ నిర్మాణం చేశారా? పులివెందుల కళా శాలలో నిర్మాణాలైతే జరిపారు. కానీ అధ్యాపకులను నియమించ డంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఎన్‌ఎంసీ 47.5 శాతం బోధకుల కొరత ఉందని తనిఖీల ద్వారా గుర్తించింది. ఇప్పటికే ప్రారంభమైన రాజమహేంద్రవరం వైద్య కళాశాలకు రూ.475 కోట్లు ఆమోదిత వ్యయం కాగా.. గత ప్రభు త్వంలో కేవలం రూ.81.74 లక్షలు మాత్రమే ఖర్చుపెట్టారు. కూటమి ప్రభుత్వం రూ.53.73 కోట్లు ఖర్చుపెట్టింది. మచిలీపట్నం కళాశా ల ఏర్పాటుకు కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం కింద రూ.195 కోట్లు గ్రాంటు వచ్చింది. దీనివల్ల ఈ కళాశాలకు రూ.550 కోట్ల ఆమోదిత వ్యయానికి గాను రూ.206 కోట్లు గత ప్రభుత్వం ఖర్చు పెట్టింది. ఈ కళాశాల బిల్లుల చెల్లింపుల కోసం కూటమి ప్రభు త్వం రూ.86.32 లక్షలను కూటమి ప్రభుత్వం చెల్లించిందని మంత్రి వివరించారు.

### చంద్రబాబు హయాంలో 17 కళాశాలలు

చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో 17 వైద్య కళాశాలలొ చ్చాయి. 2000 – 2004, 2004–19, 2024–25లో ఈ కళా శాలలొచ్చాయి. ఈ కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద 22,500 మంది విద్యార్థులు ఉచితంగా ఎంబీబీఎస్ చదివారు. వాస్తవాలు వక్రీకరిస్తూ చంద్రబాబు హయాంలో ఒక కళాశాల కూడా రాలేదని వైకాపా నేతలు అసత్య ప్రచారం చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. పీపీపీ విధానం అమలుపై కూటమి ప్రభుత్వం ఎందుకు నిర్ణయాన్ని తీసుకుందో చెబుతుండగా వైకాపా ఎమ్మెల్సీ లు అడ్డుకునే ప్రయత్నం చేశారు. వైసీపీ ఎమ్మెల్సీలు వాకౌట్ చేయడంతో చర్చ నుంచి పారిపోతున్నారంటూ మంత్రి ఎద్దేవా చేశారు.

# భూకబ్జాకు యత్నం.. బెదిరింపులు

**- వైసీపీ నేతల దందాపై ఫిర్యాదు**

**- ప్రజావినతులకు బాధితురాలు**





మంగళగిరి (చైతన్యరథం): అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన మద్దిపట్ల ఇందిర టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వ హించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో తన సమస్య పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చింది. తమ గ్రామంలో సర్వే నెం. 887లో 887/2, 887/3, 887/4, 887/5 సబ్ డివిజన్లలో తమకు వారసత్వ రీత్యా కొనుగోలు ద్వారా వచ్చిన భూమి ఉంది. 887/4 సర్వే నెంబర్‌లో ఉన్న భూమిని 2005లో కొనుగోలు చేశాం. ఈ భూమిని వైసీపీ నాయకులు ఆక్రమించడానికి అనేక విధాలుగా బెదిరించి గత ప్రభుత్వంలో తమపై అక్రమ కేసు పెట్టి భూమి కాజేయడానికి ప్రయత్నించారు. దీనిపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తే ఆక్రమణను ఆపేశారు. మళ్లీ ఇప్పుడు వారు తమ భూమిలోకి ప్రవేశించడానికి ప్రయత్నించారు. రాజంపేటలో తమపై అక్రమ కేసు పెట్టి మరోసటి రోజు తమ భూమి ప్రహరీని కూల్చివేశారు. కూల్చివేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావుకి అర్జీ ఇచ్చి అభ్యర్థించారు.

– వైఎస్ఆర్ కడప జిల్లా చాపాడు మండలం మొతయిపల్లె గ్రామానికి చెందిన ముపూరి మార్కండేయ్య గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలోని సర్వే నెం.2726-10లో 42 సెంట్లు భూమి ఉంది. 1995లో ముపూరి కొండయ్య కొనుగోలు చేశారు. ఆ భూమిలో తమ పూర్వీకులు సమాధి కూడా ఉండడం తో తమ కుటుంబం వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగి స్తోంది. కానీ షేర్ హుస్సేన్ పీరా కుమారుడు షేక్ యూసఫ్ గత ప్రభుత్వంలో వాలంటీర్‌గా పనిచేస్తూ అక్రమంగా ఆన్‌లైన్‌లో భూమిని తమ పేరుమీద నమోదు చేసుకున్నాడు. దీనిపై పలు మార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

– శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం నివగం గ్రామానికి చెందిన కమలశేషు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలోని సర్వే నెం. 100లో పోరంబోకు భూమి ఉంది. అందు లో కొంతమందికి డీపట్టాలు ఇచ్చారు. వారి వద్ద నుంచి నువులు కరుణ కొనుగోలు చేసి ఆ యొక్క స్థలంలో కమర్షియల్ బిల్డింగ్ 3 ఫ్లోర్లు కట్టారు. దీనిపై కలెక్టర్ గ్రీవెన్స్ వెళ్లగా అది పోరంబోకు భూమి అని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కానీ మండల తహసీల్దార్ వారితో చేతులు కలిపి చర్యలు తీసుకోవడం లేదు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరాడు.

– కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామా నికి చెందిన అబ్దుల్ మునాఫ్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నెం.146-1లో ఎ.2.14 సెంట్లు, 146-1లో కె.మహమ్మద్ గౌస్‌కి 0.39 సెంట్లు భూమి ఉంది. ఈ భూమిని కె.తారశ్రీ, కె.మహమ్మద్ రసూల్, కె.ఇబ్రహీం, బుడగ జంగం ధూపం రంగన్న కుటుంబం దొంగ పత్రాలతో తమ పేర్లపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్ కు ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రార్, సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు కూడా సహకరించారు. వారిపై చర్యలు తీసుకోని తమ భూమిని తమకు ఇప్పించాలని కోరాడు.

– అనకాపల్లి జిల్లా కుంచంగి గ్రామానికి చెందిన సూర్య జగ్గారావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. మాజీ సైనిక ఉద్యోగి అయిన తనకు తమ గ్రామంలో సర్వే నెం.385/2లో య.4.50 సెంట్లు ప్రభుత్వ భూమి డీఫారం పట్టా ఇచ్చారు. సదరు భూమికి సంబంధించి తనకు ఎన్వోసీ ఇవ్వాల్సిందిగా జిల్లా కలెక్టర్ కి విన్నవించినా తనకు న్యాయం జరగలేదు. కావున తమయందు దయవుంచి తమ సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించాడు.

# 15 సార్లు పట్టు వస్త్రాలు సమర్పించిన రికార్డు చంద్రబాబుదే!

అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రతినిత్యం సుప్ర భాత సేవలో ప్రారంభమయ్యే సేవలు, ఉత్సవాలు అనేకం. నిత్యకళ్యాణం, పచ్చ తోరణంగా విరాజిల్లుతూ తిరుమల క్షేత్రంలో శ్రీనివాసునికి దిన-వార-పక్ష-మాస-సంవత్సరోత్స వాలుఎన్ని జరిగినా వీటన్నింటిలో బ్రహ్మోత్సవాల వేడుక తీరే వేరు. సాక్షాత్తు సృష్టి కర్త అయిన బ్రహ్మదేవుడిని తను కొలువు దీరిన తొలినాళ్లలో ఉత్సవాలను జరిపించమని శ్రీనివాసుడు ఆదేశించగా బ్రహ్మ దేవుడు ఉత్సవాలను జరిపించడం ప్రారంభించినట్లు కథనం. ప్రపంచా నికి ఏ విధమైన కష్టాలు రాకుండా కాపాడమని వేడుకునేందుకు ఉత్సవాలను ప్రారంభించి ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారు. బ్రహ్మదేవుడు నిర్వహించే ఉత్సవాలు కనుక వీటికి బ్రహ్మోత్సవా లు అని పేరు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు ఎనిమిది వందల సంవత్సరాలకు పైగా వైభవంగా జరుగుతున్న స్వామి వారి వార్షిక ఉత్సవాలు. ఈ ఉత్సవాలకు పురాణాల్లోనూ విశేషమైన ప్రాముఖ్యత ఉంది. బ్రహ్మదేవుడు స్వయంగా తిరుమ లేశుని కోసం తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాన్ని నిర్వహించాడనే ప్రమేయంతో వీటికి బ్రహ్మోత్సవాలు గా పిలుస్తారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు తొమ్మిది రోజులు పాటు అంగరంగ వైభవంగా వేడుకలు జరుగుతాయి. శ్రీ వేంకటేశ్వరస్వామి వారు వివిధ అవ తారాలలో వాహనాలపై తిరుమాడ వీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు పాల్గొంటారు. ప్రతి ఏటా జరిగే బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించడం 1978 నుంచి ఆనవాయితీగా వస్తోంది. 1978లో నిర్వహించిన శ్రీవారి బ్రహ్మో త్సవాలకు అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చెన్నారెడ్డి మొదటి సారిగా స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. తరువాత దేవాదాయ శాఖ అధికారులే పట్టు వస్త్రాలు సమర్పించేవారు. తరువాత 1984లో ముఖ్యమంత్రిగా ఉన్న నందమూరి తారక రామారావు ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించే ఆనవా యితీని పునరుద్ధరించారు. ఎన్టీఆర్, చెన్నారెడ్డి, ఎన్.జనార్దన్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రులుగా పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆనవాయితీ ప్రకారం 2003లో పట్టు వస్త్రాలు సమర్పించేందుకు తిరుమలకు వెళుతుండగా అలిపిరి వద్ద నక్సలైట్లు అమర్చిన బాంబు దాడిలో చంద్రబాబు గాయ పడటంతో అప్పటి టీటీడీ చైర్మన్ పప్పుల చలపతిరావు పట్టు వస్త్రాలు సమర్పించారు. అప్పటి నుంచి పట్టువస్త్రాల సమర్పణ గరుడ సేవ రోజు కాకుండా ధ్వజారోహణం రోజుకు టీటీడీ మార్పు చేసింది.

మానవాళికి మహోత్సవాలుగా భక్తులు భావించే తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమ ర్పించడంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమం త్రి చంద్రబాబు రికార్డు సృష్టించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి పదవి చేపట్టి తొలిసారి 1995లో తిరుమల బ్రహ్మోత్సవా లకు ప్రభుత్వ తరపున పట్టు వస్త్రాలు సమర్పించడం ప్రారంభించారు. 1995-2004 వరకు పట్టువస్త్రాలు సమర్పించారు. 2003లో బ్రహ్మోత్సవాల సందర్భంగా సీఎంగా చంద్రబాబు పట్టు వస్త్రాలు సమర్పించేందుకు తిరుమలకు వెళుతుండగా అలిపిరిలో జరిగిన బాబు దాడిలో గాయపడి బ్రహ్మోత్సవాలకు వెళ్లలేక పోయారు. 2014 నుంచి 2019 వరకు, 2024 నుంచి ముఖ్యమంత్రిగా ప్రభుత్వం తరపున ఇప్పటివరకు మొత్తం 15 సార్లు పట్టు వస్త్రాలు సమర్పించిన మహద్భాగ్యం చంద్రబాబుకే దక్కింది. తెలుగు రాష్ట్రాల్లో ఆయనకి ఇన్ని సార్లు పట్టు వస్త్రాలు సమర్పించే మహ ద్భాగ్యం గలగడం కలియుగ దైవం కృప వల్లనే అని చెప్పాలి. చరిత్రలో కూడా ఇటువంటి మహద్భాగ్యం మరొకరికి దక్కదు కూడా.

తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి పట్ల గొప్ప పవిత్ర భక్తి కలిగి ఉంటారు చంద్రబాబు. తన జీవితంలో ఎన్నో సమస్యల నుంచి కానీ,అలిపిరిలో బాంబు దాడి జరిగి సురక్షితంగా బయట పడటం కలియుగ శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆశీస్సులతో బయట పడిన ట్లు పలు సందర్భాలలో చెబుతారు. ఆయన తిరుపతి శ్రీ వెంక టేశ్వర స్వామి పట్ల ఎంతో సేవా తత్వం, అత్యంత భక్తి కలిగి ఉన్న ప్రధాన రాజకీయ నాయకుడు. ముఖ్యమంత్రిగా తిరుమల పవిత్ర తకు భంగం కలగకుండా చర్యలు చేపట్టడంలో ముందున్నారు.. ఆయన తరచూ కుటుంబంతో కలిసి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శిస్తారు. తిరుపతిలో ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ 1985 ఏప్రిల్ 6 నుంచి ప్రారంభించిన నిత్యాన్నదాన కార్యక్రమాన్ని చంద్రబాబు కొనసాగిస్తున్నారు. ప్రారంభంలో పరిమితంగానే భోజనం అందించేవారు. నేడు రోజుకు లక్ష మందికి పైగా భక్తులకు అన్నదానం జరుగుతుంది. చంద్రబాబు మనవడు నారా దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా అన్నప్రసాద భవనంలో టుడే డోనర్ మాస్టర్ నారా దేవాన్ష్ పేరుతో తిరుపతి తిరుమలలోని తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద వితరణ కేంద్రంలో ఆ రోజు అన్నప్రసాదానికి అవసరమైన మొత్తం ఖర్చును అందజేసి కుటుం బ సభ్యులతో కలిసి స్వయంగా ప్రసాదాన్ని వడ్డిస్తూ ప్రతి సంవ త్సరం సాంప్రదాయం కొనసాగిస్తున్నారు సీఎం చంద్రబాబు.

తిరుపతి, తిరుమల ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలు, ఆలయ సేవలు, ఆరోగ్యం, విద్య వంటి రంగాల్లో, మౌలిక వసతు లను పెంపొందించడంలో ప్రముఖ పాత్ర పోషించారు చంద్రబాబు . తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి సేవలకు, ఆలయ అభివృద్ధికి పలు చర్యలు తీసుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం వాణి జ్యకరణకు గత ప్రభుత్వం ఇచ్చిన అనేక ప్రైవేటు అనుమతులను రద్దు చేశారు. తిరుమలలో పనిచేస్తున్న ఇతర మతస్తులను వేరే శాఖలకు మార్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. టీటీడీ సేవలలో 100% మార్పులు రావాలని, భక్తులకు సౌకర్యా లు మెరుగుపర్చాలని, ఆలయ నిర్వహణలో పారదర్శకత, ప్రసాదం లడ్డు నాణ్యత పెంచాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల పేరుతో ఆలయ డబ్బులను దుర్వినియోగం చెయ్యద్దని హెచ్చరించారు. భక్తులకు సులభమైన, సౌకర్యవంతమైన దర్శనాలు, వసతులు కల్పించాలనే లక్ష్యంతో దిశానిర్దేశం చేశారు. తిరుమలలో 100 శాతం ప్రక్షాళన జరగాలని, మినహాయింపులు ఉండకూడదని సూచించారు. తిరుమల లడ్డూ మహాప్రసాదం పవిత్రతను, విశిష్టతను, వేంకటేశ్వరస్వామి వైభవాన్ని, టీటీడీ పేరు ప్రఖ్యాతులు దిగజార్చింది గత ప్రభుత్వం. గత ఐదేళ్ల తిరుమల తిరుపతిలో జరుగిన ఘోరాతి ఘోరాలు, పాపాలు హిందూ సమాజాన్ని కలవరపెట్టాయి. ఈ పరిస్థితుల్లో అధికారంలో వచ్చి న చంద్రబాబు గత ప్రభుత్వ తప్పిదాలు సరిదిద్దుతూ 15 నెలలుగా అనేక సంస్కరణలు, తీసుకొచ్చారు. దీంతో తిరుపతికి దేశ, విదేశాల నుంచి వస్తున్న భక్తులు, ప్రధాన మంత్రి, కేంద్రమంత్రులు, ఎంపీలు ఇతర రాజకీయ నాయకులు తిరుమ ల పవిత్రతను కాపాడుతున్న సీఎం చంద్రబాబును అభినంది స్తున్నారు. ఏది ఏమైనా కలియుగ దైవం తిరుమల శ్రీ వెంకటే శ్వర స్వామికి 15 సార్లు పట్టు వస్త్రాలు సమర్పించి రికార్డు సృష్టించిన మహద్భాగ్యం చంద్రబాబుకే దక్కింది. తెలుగు రాష్ట్రాల్లో ఆయనకి ఇన్ని సార్లు పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబుకు హృదయ పూర్వక శుభాకాంక్షలు.



- కలిశెట్టి అప్పలనాయుడు
పార్లమెంటు సభ్యులు, విజయనగరం

## చంద్రబాబును కలసిన సిక్కోలు మహిళలు

●ఎమ్మెల్యే గొండు శంకర్‌తో పాటు కలసిన టీడీపీ మహిళా నాయకురాలు



శ్రీకాకుళం (చైతన్యరథం) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును సిక్కోలు తెలుగుదేశం పార్టీ మహిళా నాయకులు బుధవారం సచివాలయంలో కలుసుకున్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సహకారంతో సీఎం చంద్రబాబును సిక్కోలు మహిళా నాయకులు కలిసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితిని, పార్టీలో వారు చేసిన కృషి గురించి చంద్రబాబుకు వివరించారు. ఆయన మహిళా నాయకులతో మాట్లాడుతూ పార్టీ కోసం చిత్తశుద్ధితో కష్టపడి పని చేసే వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. నిజాయితీతో పనిచేసే వారికి పదవులు తప్పక వరిస్తుందని చెప్పారు. దీంతో మహిళా నాయకులంతా ఆనందం వ్యక్తం చేశారు.

## మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె వివాహ వేడుకకు హాజరైన మంత్రి అచ్చెన్నాయుడు



పాలకొల్లు (చైతన్యరథం): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణతో కలిసి మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె వివాహ వేడుకకు హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులోని బ్రాడిపేట బైపాస్ రోడ్డు ప్రాంతంలో ఏర్పాటు చేసిన కల్యాణవేదికకు వచ్చి నూతన వధూవరులు శ్రీజ, దుర్గా హరిహర సాయి పవన్ కుమార్‌లను ఆశీర్వదించారు. వైవాహిక జీవితంలోకి అడుగుపెడుతున్న నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వారు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందభరితమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు. వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్‌లో సాఫల్యం, శ్రేయస్సు కలగాలని మంత్రి కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## విశాఖ మెడ్ సిటీలో కాసా లార్వేన్ హోటల్‌ను ప్రారంభించిన ఎంపీ శ్రీభరత్



ఆరిలోవ (చైతన్యరథం): ఆరిలోవ విశాఖ మెడ్ సిటీలో బుధవారం కాసా లార్వేన్ హోటల్ను ఎంపీ శ్రీభరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రంగా విశాఖ అభివృద్ధి చెందుతుండగా, ఇలాంటి ప్రీమియం హోటల్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. మెడ్‌సిటీ పరిసర ప్రాంతంలో వసతి సదుపాయాల కొరత చాలా కాలంగా ఉందని, కాసా లార్వేన్ వంటి హోటల్స్ రాకతో ఈ సమస్య తగ్గిపోతుందని అభిప్రాయపడ్డారు. ఆధునిక సౌకర్యాలతో, శుభ్రతా ప్రమాణాలతో, అందుబాటు ధరలతో ఈ హోటల్ అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు హోటల్ ప్రత్యేకతలను వివరించారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం... ఐదు రోజుల పాటు భారీ వర్షాలు



విశాఖపట్నం (చైతన్యరథం): ఉత్తర ఒడిశా, వాయవ్య బంగాళాఖాతం, పశ్చిమ బెంగాల్ గంగా పరివాహక ప్రాంతాల్లో కొనసాగుతున్న అల్పపీడనం మరింతగా ప్రభావం చూపనుంది. వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, సెప్టెంబర్ 25న ఉత్తర మధ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. ఇది 26న బలపడుతూ వాయుగుండంగా మారే అవకాశం ఉంది. ఈ వాయుగుండం 27వ తేదీన దక్షిణ ఒడిశా – ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీరం మధ్య ప్రాంతాన్ని దాటే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. పశ్చిమ బెంగాల్ ఉపరితల ఆవర్తనం నుంచి దక్షిణ ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఉత్తర అంతర కర్ణాటక మీదుగా దక్షిణ ఇంటీరియర్ కర్ణాటక వరకూ ద్రోణి విస్తరించి ఉంది. ఈ ద్రోణి ప్రభావంతో రాబోయే ఐదురోజులపాటు ఆంధ్రప్రదేశ్‌లో పలుచోట్ల వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## కన్నుల పండువ శతాబ్ది ఉత్సవం.. రెండో రోజు మరింత ప్రత్యేకం

● సిక్కోలు సాంస్కృతిక వైభవం చాటింపు వేసిన కొత్తమ్మతల్లి శోభాయాత్ర.. తరలివచ్చిన కళాకారులు



కోటబొమ్మాళి (చైతన్యరథం): కొత్తమ్మతల్లి శతాబ్ది ఉత్సవానికి ప్రధాన ఆకర్షణ వందేళ్ల ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపేందుకు భక్తులు కళాకారులు తండోపతండాలుగా తరలి రావడంతో శోభాయాత్రకు ప్రత్యేకత చేకూరింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ పండుగను అధికారిక పండుగగా గుర్తించి, సంబంధిత ఏర్పాట్లు ఎన్నడూ లేని విధంగా చేయడంతో ఈ సారి ఉత్సవాలు ఉత్తరాంధ్రులకు గొప్ప జ్ఞాపకాలను అందించాయి. అమ్మవారి శోభాయాత్రలో సాంస్కృతిక బృందాలు ఆడిపాడాయి. మన ప్రాంత కళా వైభవం, విశిష్టతను దశ దిశలకూ చాటింపు వేశాయి. అమ్మ వారి దర్శనానికి జనం తండోపతండాలుగా వచ్చారు. ఇదే సందర్భాన వేలాదిగా తరలి వచ్చిన మహిళా భక్తులు శోభాయాత్రను చూసి పులకించి పోయారు. చిన్నారుల కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వారిలో కొత్త ఉత్సాహం నింపారు. భక్తి భావంతో పాటే సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరూ మెలగాలని అప్పుడే ఉత్సవాలకు సార్థకత అని, ఐక్యతను చాటే ఉత్సవాలు మన భారతీయ సనాతన సంస్కృతికి, గత కాల ప్రాభవానికి ప్రతీకలు అని అన్నారు. కొత్తమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సాయంత్రం (బుధవారం సాయంత్రం) చేపట్టిన శోభాయాత్ర వేడుకలు అపూర్వంగా సాగాయి. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల నుంచి వచ్చిన రథాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కోటబొమ్మాళి, కొత్త పేట కూడలి నుంచి రైతుబజారు వరకూ శోభాయాత్ర కనువిందుగా సాగింది. 30 వరకూ కళాబృందాలు, 2000 మంది కళాకారులు, 10 శకటాలతో యాత్ర అత్యంత సందడిగా సాగింది. కోలాటం, తప్పెటగుళ్ళు, థింసా, కోయ, కొమ్ము, బిందెల నృత్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అధిక సంఖ్యలో మహిళల కలశాలతో పాల్గొన్నారు. అరసవల్లి, అన్నవరం దేవస్థానాల ఆలయ రథాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దీంతో ఇక్కడ అనూహ్య రీతిలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ ఏడాది మునుపెన్నడూ లేని విధంగా వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శతాబ్ది ఉత్సవాలు కావడంతో యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధవహించి మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లూ పకడ్బందీగా చేశారు. ఆధునిక సమాజంలో ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. భక్తి భావంతో పాటే ఆధ్యాత్మికతను పెంపొందించుకొని సన్మార్గంలో నడవాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కోటబొమ్మాళి మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు కింజరాపు హరి వర ప్రసాద్, ఆర్డీఓ ఎం.కృష్ణ మూర్తి, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ వెలమల విజయ లక్ష్మీ, అధికారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా సిరిమాను తరలింపు సంబరం... పాల్గొన్న మంత్రి కొండపల్లి



గంట్యాడ (చైతన్యరథం): విజయనగరం పైడితల్లి జాతరలో ప్రధాన ఘట్టమైన సిరిమాను తరలింపు సంబరం బుధవారం అంగరంగా వైభవంగా జరిగింది. మహిమాన్వితమైన సిరిమాను ఇరుసుమాను వృక్షాలు ఈ ఏడాది గంట్యాడ మండలం కొండతామరాపల్లిలో చల్ల అప్పారావు, రామకృష్ణ, నారాయణమూర్తి, లోకవరపు సత్యం కల్లంలో సాక్షాత్కరించాయి. వేలాదిగా తరలి వచ్చిన భక్తుల నడుమ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు, దేవస్థానం ఈవో శిరీష్, పైడిమాంబ దీక్షధారులంతా వృక్షానికి పసుపు కుంకుమలు సమర్పించి దీపారాధనలతో అఖండ అర్చనలు నిర్వహించారు. అంతకముందు నిర్ణయించిన మూహూర్తానికి వేదపండితులు మంత్రోచ్ఛరణ, నాదస్వరాల నడుమ గొడ్డలితో గాట్లు పెట్టి సిరిమానుగా మలిచే పవిత్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం ఇరుసుమానుకు ప్రత్యేక పూజలు చేపట్టి భక్తులంతా పైడిమాంబ నామస్మరణతో ఆ ప్రాంగణమంతా ప్రతిధ్వనించింది. అనంతరం 10వేల మందికి అన్నదాన కార్యక్రమం చేపట్టి భారీ ఊరేగింపుతో సిరిమానును తరలించారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఐవీపీ రాజు, కొండపల్లి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరులో కలకలం రేపుతున్న కలరా కేసులు



గుంటూరు జిల్లాలో రోజు రోజుకు కలరా కేసులు పెరుగుతున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో కలరా కేసులు పదికి చేరాయి. కొందరు బాధితులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. వారి నమూనాలు సేకరించిన వైద్యులు ల్యాబ్‌కు పంపి పరీక్షలు నిర్వహించగా.. ఏడుగురికి కలరా సోకినట్లు గుర్తించారు. ఇక నగరంలో ఇప్పటికే ముగ్గురికి కలరా సోకిన విషయం తెలిసిందే. తాజాగా ఆ సంఖ్య పదికి చేరింది. అటు తెనాలి మండలం అంగలకుదురులో మరొకరు కలరా వ్యాధి బారిన పడ్డారు. ఎయిమ్స్‌లో కలరా సోకిన బాధితులంతా నలభై ఏళ్ళ లోపు వారే. గుంటూరు జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు కృష్ణా జిల్లా నుంచి వచ్చిన మరొకరికి కలరా సోకినట్లు గుర్తించారు. కలరా ఉధృతితో వైద్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. గుంటూరు నగర వ్యాప్తంగా ఎక్కడిక్కడ వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేక బృందాలతో ఇంటింటి సర్వే నిర్వహించి కలరా బాధితులను గుర్తించే పనిలో పడ్డారు. సాధారణ లక్షణాలు ఉన్నవారికి వైద్య శిబిరంలోనే చికిత్స అందిస్తుండగా.. లక్షణాలు విపరీతంగా ఉన్న బాధితులను చికిత్స నిమిత్తం జీజీహెచ్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందజేస్తున్నారు. ఇక కలరా విజృంభణతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

## సైకిల్‌పై విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి



పలాస (చైతన్యరథం): విజయవాడ కనకదుర్గమ్మ మొక్కులు చెల్లించుకోవాలని పలాస, సోంపేట ప్రాంతానికి చెందిన పొందర రవికుమార్, మద్దు శంకరరావు, బతకల దీర్ఘారావు మంగళవారం సైకిల్‌పై బయలుదేరారు. ఈ మేరకు స్థానిక రైల్వేస్టేషన్‌లో సీతారామాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి సైకిల్ యాత్ర ప్రారంభించారు. సుమారు 700 కిలోమీటర్లు తాము సైకిల్‌పై వెళ్లి దుర్గమ్మను దర్శించుకుంటామన్నారు. ఈ సందర్భంగా యాత్రికులు మాట్లాడుతూ.. పదేళ్ల కిందట మొక్కు కున్నామని.. ఇప్పుడు చెల్లించుకుంటున్నామని తెలిపారు.

# జగన్ జైలుకెళ్లి బయటకొచ్చి పుష్కరోత్సవం

- అవినీత కేసులు, ఈడీ కేసులు తుది దశకు చేరుకున్నాయి : గోరంట్ల బుచ్చయ్యచౌదరి



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు వాడివేడీగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిపై రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అవినీతి కేసుల్లో 16 నెలలు జైలుకెళ్లి బయటకొచ్చిన జగన్ పుష్కరోత్సవం జరుపుకుంటున్నారని విమర్శించారు. జగన్ రాజకీయ జీవితం చరమాంకంలో ఉందని ఆరోపించారు. జగన్ రాష్ట్రమంతా.. అవినీతికి పాల్పడ్డారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని ఇష్టానుసారంగా దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌పై ఉన్న అవినీతి కేసులు, ఈడీ కేసులు తుది దశకు చేరుకున్నాయని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ కేసుల్లో ఇంకెన్నేళ్లు జైల్లో మగ్గాల్సి ఉంటుందో? అని అనుమానం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ద్వారా అసభ్య పదజాలం మరింత విస్తృతం చేయాలని తాడేపల్లి ప్యాలెస్‌లో బూతోత్సవం పెట్టారని మండిపడ్డారు. ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదా కోసం పట్టుబట్టటం జగన్ అవివేకమని ఎద్దేవా చేశారు. ఒక్క అవకాశం అని మాజీ సీఎం జగన్ ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ప్రజలు మళ్లీ మళ్లీ మోసపోయేంత అమాయకులు కాదని స్పష్టం చేశారు. గత వైసీపీ పాలకులు పనికట్టుకొని కూటమి ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని ఆరోపించారు. ప్రజలకు మంచి చేస్తుంటే.. ఓర్వలేక పోతున్నారని మండిపడ్డారు.

# కోడెల శివరామ్‌తో ఎన్నారైల ఆత్మీయ సమావేశం




టెక్సాస్ (చైతన్యరథం): అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం డాలస్ నగరంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడెల శివ రామకృష్ణ పర్యటించారు. ఎయిర్ పోర్ట్ నుండి అభిమానులు భారీగా తరలి వచ్చి ఆహ్వానించారు. అక్కడ జరిగిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొని, నందమూరి తారక రామారావు, నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి స్పీకర్ కోడెల శివప్రసాదరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాల ద్వారా ప్రజలకు అందుతున్న అద్భుత ఫలాలు, నూతన పీ-4 విధానంతో దేశానికి తద్వారా రాష్ట్రానికి లభించే అద్భుత ఫలాలు గురించి ముఖ్యంగా పీ- 4 విధానంతో ఆర్థికంగా వెనుకబడిన వేల కుటుంబాల ఎలా కాంతివంతం అవుతాయో వివరిస్తూ, మన భాధ్యతగా పీ-4 కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. దివంగత కోడెల శివప్రసాదరావు పార్టీ కోసం చేసిన సేవను కొనియాడారు. కోడెల టీడీపీ ఒక ఆస్తి అని, తెలుగుదేశం పార్టీ ప్రజా సేవలో మమేకం అవుతునంత సమయం కోడెల పేరు, వారు రాష్ట్రానికి, పార్టీకి అందించిన సేవలు సజీవంగా ఉంటాయని పేర్కొన్నారు. క్యాన్సర్‌కి ఆన్సర్ ఉండాలనే లక్ష్యంగా అన్న నందమూరి తారకరామారావు తీసుకొన్న నిర్ణయంతో కోడెల శివప్రసాద్ ఆధ్వర్యంలో పురుడు పోసుకున్న ఇండో అమెరికన్ కాన్సర్ ఆస్పత్రి రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశ స్థాయిలో పేద, బడుగు వర్గాలకు ఉపయోగపడిన తీరు, ఆ ఆసుపత్రి అభివృద్ధికి కోడెల శివప్రసాదరావు చేసి చేసిన కృషిని పలువురు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో దర్శి జనసేన ఇన్‌ఛార్జ్ గరికపాటి వెంకట్, ఎన్నారై టీడీపీ డాలస్ సభ్యుడైన వీరు, ధూళిపాళ్ల కృష్ణ, వెంకట్, మాధవరావు, హరేంద్ర, ఉడత శ్రీనివాస్, గాలి నాగేశ్వరావు, కిరణ్ పోతురాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 3వ రోజు విజయవాడ ఉత్సవ్




విజయవాడ (చైతన్యరథం): విజయవాడ వైభవం ఉట్టిపడేలా సొసైటీ ఫర్ వైబ్రేంట్ విజయవాడ" సారధ్యంలో వరల్డ్స్ బిగ్గెస్ట్ ఫెస్టీవ్ కార్నివల్ "విజయవాడ ఉత్సవ్ అదరహో అనిపిస్తుంది. నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కూచిపూడి, చెక్కభజన, హరికథ, శాక్సోఫోన్, తోలుబొమ్మలాట, నాటక ప్రదర్శనలతో అలరిస్తుంది. విజయవాడ పేరు కొన్ని దశాబ్దాల పాటు మారుమ్రోగేల విజయవాడ ఉత్సవ్ నభూతో న భవిష్యత్ అన్న రీతిలో ఆకట్టుకుంటుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో "సొసైటీ ఫర్ వైబ్రేంట్ విజయవాడ" సారధ్యంలో వరల్డ్స్ బిగ్గెస్ట్ ఫెస్టీవ్ కార్నివల్ "విజయవాడ ఉత్సవ్" నగరంలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రం నందు 3వ రోజు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో కన్నుల పండువగా సాగింది. ఈ సాంస్కృతిక కార్యక్రమాలకు... ఏపీ రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ చైర్మన్ తేజస్వి పొడపాటి, ఏపీ నాటక రంగ అకాడమి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, విజయవాడ ఉత్సవ్ కమిటీ సభ్యులు మల్లిఖార్జున రావు, కేశినేని జానకి లక్ష్మీ, చంద్ర, సుష్మా, టీడీపీ నాయకులు కోగంటి రాములు, గంగరాజు యాదవ్, జనసేన నాయకులు బాడిత శంకర్, నవనీతం సాంబశివరావు ముఖ్య అతిధులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విజయవాడ దసరా ఉత్సవాల సందర్భంగా వచ్చే భక్తులకు బెజవాడ దుర్గమ్మ 11 రోజులు 11 రూపాలలో దర్శనమిస్తుంటే, కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన విజయవాడ ఉత్సవ్ విజయవాడ ఖ్యాతిని పెంచుతూ విజయవాడ దుర్గమ్మను దర్శించుకునేందుకు వచ్చే భక్త జనానికి చక్కటి ఆహ్లాదాన్ని, సంస్కృతి సాంప్రదాయాలను తెలియపరిచే విధముగా పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరిస్తున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం నగర వాసులతో పాటు రాష్ట్ర నలుమూలల నుండి వచ్చే భక్తుల కోసం ఇటువంటి బృహత్తర ఉత్సవ్‌ను ఏర్పాటు చేయడం, సీఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కూటమి నాయకుల ప్రోద్భలంతో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో స్వచ్ఛంద్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఏపీ నాటక రంగ అకాడమి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఏపీ సాంస్కృతిక చైర్మన్ పొడపాటి తేజస్వి పర్యవేక్షణలో శ్రేయాస్ మీడియా సహకారంతో కనివిని ఎరుగని రీతిలో విజయవాడ ఉత్సవ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విజయవాడ ఉత్సవ్‌ను చూడని కనులు కనులే కాదని విజయవాడ ఉత్సవ్‌ను చూస్తే మైమరచి పోతారన్నారు. అంతరించి పోతున్న కళలకు జీవం పోస్తున్న విజయవాడ ఉత్సవ్‌లో అందరూ భాగస్వాములు కావాలని, విజయవాడ ఉత్సవ్‌లో పాలు పంచుకొని ఆనందసాగరంలో ఓలలాడలని కోరారు.



# బాలికా సంరక్షణ పథకం బాండ్లకు నగదు చెల్లించాలి

- 2023లో మెచ్యూరిటీ అయినా వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసింది
- మనది మంచి ప్రభుత్వం కాబట్టి ఎల్.ఐ.సి.ద్వారా ఇచ్చేలా కృషి చేయాలి
- అసెంబ్లీలో రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం (చైతన్యరథం): బాలికల నిష్పత్తిని ప్రోత్సహించేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2005లో నాటి ప్రభుత్వం కుటుంబంలో ఒక ఆడపిల్ల ఉంటే రూ.లక్ష, ఇద్దరు ఆడపిల్లలు ఉంటే చెరో రూ.30వేల వంతున రూ.60 వేలు జీవీ బీమాసంస్థ (ఎల్.ఐ.సి) బాండ్లు జారీచేసిందని వాటిలో కొన్ని 2023లో వైసీపీ ప్రభుత్వహయాంలో మెచ్యూర్ అయినా తలిదండ్రులకు నగదు చెల్లించలేదని, తమకు తెలియదని గాలికి వదిలేసిందని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చెప్పారు. ఇప్పుడు మన ప్రభుత్వం మంచి ప్రభుత్వం కాబట్టి ఆ కుటుంబాలకు ఎల్.ఐ.సి ద్వారా నగదు అందేలా కృషి చేయాలని ఆయన కోరారు. బుధవారం అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ... తన నియోజకవర్గంలోని తలిదండ్రులు ఈ సమస్య తన దృష్టికి తీసుకువచ్చారని అందుకనే మంత్రికి తెలియచేస్తున్నామని చెప్పారు. ఉమ్మడి తూర్పగోదావరి జిల్లాలో ఈ బ్యాండ్లు కలిగి ఉన్నవారిలో ఒక బాలిక ఉన్నవారి సంఖ్య 3,079,ఇద్దరు బాలికలు ఉన్నవారి సంఖ్య 20,947 అని, తన సిటీ నియోజకవర్గంలో ఒక బాలిక ఉన్నవారి సంఖ్య 1,284,ఇద్దరు ఆడపిల్లలు సంఖ్య 2,675 అని సిటీలో మొత్తం 3,959 అని ఆయన చెప్పారు. రాష్ట్ర పునర్విభజన గడువు ముగిసిందని, ఇప్పుడు వారిలో కొందరి బాండ్లు మెచ్యూరిటీ అయ్యాయని వారికి ఎల్.ఐ.సి ద్వారా నగదుఇప్పించేందుకు మన ప్రభుత్వం తరుపున చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కోరారు. దీనిపై మంత్రి గుమ్మడి సంధ్యారాణి సమాధానం చెబుతూ 2005 కు ముందు చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్న సమయంలో బాలికలు పాఠశాలకు వెళ్ళడాన్ని ప్రోత్సహించాలని స్కూలులో చేరిన ఆడపిల్లకు వెంటనే రూ.500 ఇచ్చేవారని వారికి 18 ఏళ్ళ వయసు వచ్చి ఇంటర్మీడియెట్ పూర్తి చేశాక ఆ కుటుబానికి రూ. 20వేలు అందించాలనే సదుద్దేశంతో ఏర్పాటు చేశారని వివరించారు. తరువాత వచ్చిన ప్రభుత్వం దానిని మార్చి బాలికా సంరక్షణ పథకం బాండ్లను జారీ చేసిందని చెప్పారు. రాష్ట్ర విభజన జరిగినా ఈ పథకానికి మాత్రం విభజన జరగలేదని ఆ ప్రస్తుతం విభజన ఆంధ్రప్రదేశ్ లో వివిధ జిల్లాల వారీగా 4,39,943 మంది ఉన్నారని మంత్రి వివరించారు. ఈ నగదు మొత్తం హైదరాబాద్ ఎల్.ఐ.సి.లో ఉందని, కూటమి ప్రభుత్వం రాగానే అధికారులు నాలుగైదు సార్లు వారితో చర్చించారని ఆమె తెలిపారు. త్వరలో సీఎం చొరవతో మెచ్యూర్ అయిన బాండ్ల నగదు లబ్దిదారులకు అందేలా కృషి చేస్తామని, తాము మరలా వారితో సంప్రదింపులు జరపడానికి సిద్ధమని మంత్రి గుమ్మడి సంధ్యారాణి సమాధానం ఇచ్చారు. దీనిపై ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వం ఆ బాండ్ల విషయం గాలికి వదిలేసిందని విమర్శించారు. ఇప్పుడు మంత్రి వాస్తవాలు తెలియచేసినందుకు ధన్యవాదాలు చెబుతూ త్వరలో లబ్దిదారులకు బాండ్ల నగదు అందుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

# పవన్ కళ్యాణ్ హామీతో ఉప్పాడలో ఆందోళన విరమించిన మత్స్యకారులు



పిఠాపురం (చైతన్యరథం): కాకినాడ జిల్లా ఉప్పాడలో రెండు రోజలుగా మత్స్యకారులు చేస్తున్న ఆందోళనను ఎట్టకేలకు విరమించారు. కాలుష్య కారక పరిశ్రమలను మూసి వేయాలని, ఫార్మా కంపెనీల నుంచి విడుదల అవుతున్న వ్యర్థాలు సముద్రంలో కలవడంతో మత్స్య సంపద దెబ్బతింటోందని రెండ్రోజులుగా మత్స్యకారులు ధర్నా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. డిమాండ్లను పరిష్కరిస్తామని, ఆయా సంఘాల నాయకులతో కమిటీ ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చినట్లు జిల్లా కలెక్టర్ మత్స్యకారులకు తెలిపారు. దీనిపై మత్స్యకార సంఘాల నాయకులు చర్చించుకున్న అనంతరం ఇవాళ సాయంత్రం ధర్నా విరమిస్తున్నట్లు ప్రకటించారు. వచ్చే నెల 10వ తేదీ లోగా సమస్యలను పరిష్కరించాలని.. లేని పక్షంలో మరోసారి ధర్నాకు దిగుతామని తెలిపారు.

# మహిళల ఆరోగ్యం కోసమే స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్

రౌతులపూడి (చైతన్యరథం): మహిళల ఆరోగ్యం కోసమే స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని వైద్యాధికారులు రాజాజీ, శ్రీకాంత్, ప్రణీత అన్నారు. మండలంలోని పి.చామవరం గ్రామంలోని సర్పంచ్ నందమూరి రాజా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పలువురికి వైద్యులు పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు.

## జగన్ ఆలోచనలన్నీ కరెన్సీ.. కన్నింగ్ నెస్.. పవర్.. ఫేక్ పాలిటిక్స్ కేంద్రంగానే ఉంటాయి

**●రాష్ట్ర ప్రగతిని, ప్రజాసంక్షేమం.. సంతోషాన్ని కాంక్షించేవారెవరూ వైసీపీలో ఉండరు**

**●అవినీతిపరులు.. స్వార్ధపరులు.. దోపిడీదారులకే ఆ పార్టీలో స్థానం**

**●25 వైసీపీ కుటుంబాలను టీడీపీలోకి స్వాగతించిన మాజీమంత్రి ప్రత్తిపాటి**



చిలకలూరిపేట (చైతన్యరథం): పార్టీలు.. వర్గాలకు అతీతంగా ప్రజల సంతోషమే లక్ష్యంగా కూటమిప్రభుత్వం అమలుచేస్తున్న సూపర్-6 పథకాలు, రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా, శరవేగంగా జరుగుతున్న అభివృద్ధిని చూసి ఒకవైపు వైసీపీ అధినాయకత్వం కళ్లల్లో నిప్పులు పోసుకుంటుంటే, ఆ పార్టీ సానుభూతిపరులు ప్రజలుమెచ్చిన ప్రభుత్వానికి మద్ధతుగా నిలుస్తున్నారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. నాదెండ్ల మండలం గణపవరం గ్రామానికి చెందిన 25 వైసీపీ కుటుంబాలు బుధవారం ప్రత్తిపాటి సమక్షంలో టీడీపీలోకి చేరాయి. వైసీపీలో చురుగ్గా వ్యవహరిస్తున్న పాటిబండ్ల చినవీరయ్య, పెదవీరయ్య, దావీదు, సుమన్, కోటయ్య సహా 25 కుటుంబాల వారు మాజీమంత్రి చేతులమీదుగా టీడీపీ కండువాలు వేయించుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారు.. టీడీపీ శ్రేణుల్ని ఉద్దేశించి ప్రత్తిపాటి మాట్లాడారు.

**జగన్ ధన దాహానికి సహకరిస్తే ఎంతటివారైనా జైలు పాలే**

రాష్ట్రప్రగతి.. ప్రజా సంక్షేమం, సంతోషం గురించి ఆలోచించే వారెవరూ వైసీపీలో ఉండరని, కేవలం అవినీతిపరులు, స్వార్ధపరులు, దోపిడీదారులకు మాత్రమే ఆ పార్టీలో స్థానముంటుందని చెప్పారు. జగన్ లాంటి అవకాశవాదుల్ని నమ్ముకుంటే, ఎంతటివారైనా, ఎలాంటి వారైనా చివరకు కటకటాల పాలు కావాల్సిందేనని, అందుకు ఉదాహరణలు కోకొల్లలని ప్రత్తిపాటి తెలిపారు. జగన్ ధనదాహానికి సహకరించిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సహా, ఎందరో రాజకీయ నాయకులు నేటికీ కేసుల్లో చిక్కుకొని న్యాయస్థానాల చుట్టూ తిరుగుతూ తమ జీవితాలకు సరిపడా అప్రదిష్ట మూటగట్టుకున్నారని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. చంద్రబాబు ఆలోచనల్ని పంచుకొని, ఆయన దార్శనికతకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకున్న ఎందరో ఉన్నతాధికారులు కేంద్రప్రభుత్వ విభాగాల్లో, దేశ విదేశాల్లో కీలక స్థానాల్లో ఉన్నారని ప్రత్తిపాటి చెప్పారు. చంద్రబాబు నిత్యం ప్రగతి.. ప్రజా సంక్షేమం గురించి ఆలోచిస్తే, జగన్ ఆలోచనలు కరెన్సీ.. కన్నింగ్ నెస్.. పవర్ (అధికారం).. ఫేక్ పాలిటిక్స్ చుట్టూ తిరుగుతుంటాయని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగా శ్రీనివాసరావు, గ్రామ అధ్యక్షులు కెల్లంపల్లి ఆచయ్య, పెంట్యాల శేషయ్య, వలేటి హిమవంతరావు, మాజీ సర్పంచ్ పెనుముల జాన్ బాబు, కాట్రూ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం - ఏలూరు కాలువ అనుసంధానానికి నిధులు మంజూరు చేయాలి : ఎమ్మెల్యే యార్లగడ్డ



గన్నవరం (చైతన్యరథం): పోలవరం కుడికాలువను ఏలూరు కాలువతో అనుసంధానానికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాల్లో భాగంగా బుధవారం జరిగిన సమావేశంలో యార్లగడ్డ మాట్లాడుతూ పోలవరం కుడి కాలువ నీరు ప్రకాశం బ్యారేజీ వరకు వెళ్లి తిరిగి ఏలూరు కాలువ ద్వారా బాపులపాడు మండలానికి రావడానికి సుమారు 50 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వస్తుందని, ఈ రెండు కాలువలను బాపులపాడు మండలంలో ని అంపాపురం వద్ద అనుసంధానం చేస్తే కాలువ చివరి గ్రామాలకు సాగునీటి కొరత తీరుతుందన్నారు. ఈ అనుసంధానానికి గతంలో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రూ.15.60 కోట్ల నిధులు మంజూరు చేసినా వివిధ కారణాలతో పనులు ప్రారంభం కాలేదన్నారు. ఈ పనులకు తక్షణమే నిధులు మంజూరు చేయాలని కోరారు. గత సంవత్సరం వచ్చిన వరదల కారణంగా బుడమేరుకు 39 చోట్ల గండ్లు పడితే వాటిని పూడ్చేందుకు రూ.9 కోట్లు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. 2008వ సంవత్సరం నున్న గ్రామంలో 3.50 ఎకరాల భూమిని జర్నలిస్ట్ కాలనీకి కేటాయించగా ఆక్రమణలపాలై ప్రస్తుతం 2.50 ఎకరాలు మాత్రమే ఉందని ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ కాలనీలో జర్నలిస్టులకు ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పేద ప్రజలకు పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని జర్నలిస్టులకు ఒక సెంటు అదనంగా ఇవ్వాలని గత అసెంబ్లీ సమావేశాల్లో తన కోరగా స్పందించిన మంత్రి పార్థసారథి కమిటీని ఏర్పాటు చేశారని సాధ్యమైనంత త్వరలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని యార్లగడ్డ విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో జీరో అవర్ లో ప్రస్తావిస్తున్న అంశాలకు సంబంధించి ఎమ్మెల్యేలకు తిరుగు సమాచారం ఇవ్వటం లేదని దీనివల్ల తాము ప్రస్తావించిన అంశాలు ఏ స్టేజిలో ఉన్నాయో తెలుసుకునేందుకు వీలు లేకకుండాపోతుందన్నారు.

# సంప్రదాయ సాంస్కృతిక వైభవానికి ప్రతిరూపం విజయవాడ ఉత్సవ్

**●దుర్గమ్మ అవతారాలు ధైర్యం, విజయానికి ప్రతీకలు : కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ ఉత్సవ్ వేడుకల్లో పాల్గొన్న కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ప్రసంగించారు. దసరా సందర్భంగా సంప్రదాయ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక శోభతో విజయవాడ మెరిసిపోతుందని ప్రశంసించారు. "విజయవాడ రావటం నాకు చాలా సంతోషంగా ఉంది. దుర్గమ్మ తొమ్మిది అవతారాలు ధైర్యం, విజయం, శక్తికి ప్రతీకలు. ప్రతి ఏడాది ఇంద్రకీలాద్రి వద్ద జరిగే శరన్నవరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా ఉంటాయి" అని షెకావత్ పేర్కొన్నారు. "విజయవాడ ఉత్సవ్ ద్వారా 3000 మంది కళాకారులు, 250కు పైగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శింపబడుతున్నాయి. ఇవి మన తెలుగు సంస్కృతి, సంప్రదాయాల ప్రతిబింబాలు. మన పండుగలు మన జీవన విధానాల ప్రతిరూపాలు, గ్రంథాలయాలు మన సంస్కృతికి ప్రతీకలు" అని కేంద్ర మంత్రి వివరించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వాన్ని ప్రశంసించిన షెకావత్, "ఆయన ఒక డైనమిక్ లీడర్. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. అమరావతిని ప్రపంచ నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దడానికి సీఎం కృషి చేస్తున్నారు" అని పేర్కొన్నారు. పర్యాటక రంగాన్ని గ్లోబల్ స్థాయిలో తీసుకెళ్లేందుకు ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న కృషిని మంత్రి విశదీకరించారు. "లోకల్ టు గ్లోబల్ దిశగా భారత్ ముందుకు సాగుతోంది. భాషా మాధుర్యం కోల్పోకుండా ఆయా భాషలకు ప్రాధాన్యత కొనసాగాలని ప్రధాని కోరుతున్నారు. పరిశుభ్రత, ఆధ్యాత్మికతలో విజయవాడ వేగంగా అభివృద్ధి చెందుతోంది" అని ఆయన అన్నారు. "వికసిత భారత కోసం ప్రధాని మోడీ కృషి చేస్తున్నారు. అదే దిశలో వికసిత ఆంధ్రప్రదేశ్ కోసం సీఎం చంద్రబాబు ముందుకు తీసుకువెళ్తున్నారు. కలిసి మాట్లాడుదాం, కలిసి ముందుకు సాగుదాం" అని షెకావత్ పిలుపునిచ్చారు. విజయవాడ ఉత్సవ్ వేదికగా గజేంద్ర సింగ్ షెకావత్ చేసిన ప్రసంగం తెలుగు సంప్రదాయాల గౌరవానికి, రాష్ట్ర టూరిజం భవిష్యత్తుకు, జాతీయ అభివృద్ధి దిశలో ఆంధ్రప్రదేశ్ పాత్రకు ప్రతీకాత్మకంగా నిలిచింది.

# ఉద్యోగాల భర్తీకి అమరావతిలో జాబ్ మేళా



తుళ్లూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏపీ సీఆర్డీఏ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 24న తుళ్లూరులోని సీఆర్డీఏ స్కిల్ హబ్ కేంద్రంలో 'జాబ్ మేళా' నిర్వహించారు. ఈ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు అమరావతి పరిసర ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. జాబ్ మేళాలో మొక్సి ఐటీ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ, పేటీఎం, ప్రీమియర్ ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎల్ఎంఎస్ కార్పొరేట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటున్నాయి. ఏఎస్పీ.నెట్ డెవలపర్స్, హెల్ప్ డెస్క్ టెక్ సపోర్ట్, వెబ్ డిజైనర్స్, యూఎక్స్ డెవలపర్స్, ఫార్మసిస్ట్స్, ఫార్మసీ అసిస్టెంట్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ టెక్నీషియన్స్, జూనియర్ టెక్నీషియన్స్, ప్రొడక్షన్ క్వాలిటీ టెక్నీషియన్స్ ఉద్యోగాలను ఈ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు. బీటెక్, ఎంసీఏ, డిగ్రీ, ఇంటర్, ఎస్ఎస్ సీ, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, పీజీ చదివిన ఫ్రెషర్స్, అనుభవం ఉన్న అభ్యర్థులు ఈ జాబ్ మేళాకు హాజరుకావచ్చు. ఈ జాబ్ మేళా ద్వారా రాజధాని ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. అర్హత కలిగిన అభ్యర్థులు తప్పకుండా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఏపీ సీఆర్డీఏ కమిషనర్ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

**102 మందికి ఆఫర్ లెటర్లు..**

జాబ్ మేళాకు 247 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 102 మందికి ఉద్యోగాలు లభించాయి. ఉద్యోగాలకు ఎంపికైన పలువురు అభ్యర్థులకు ఆయా కంపెనీల హెచ్ఆర్ విభాగాల ప్రతినిధులతో కలసి సీఆర్డీఏ సామాజిక సంక్షేమ విభాగ డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు ఆఫర్ లెటర్లు అందజేశారు.

## కనకదుర్గమ్మను దర్శించుకున్న కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షేకావత్



విజయవాడ (చైతన్యరథం): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కేంద్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షేకావత్ బుధవారం రాత్రి ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయనతో పాటు ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ కూడా ఆలయానికి విచ్చేశారు. కేంద్ర మంత్రిని స్వాగతించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ మర్యాదల ప్రకారం వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనం అందించగా, దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాలు జ్ఞాపికలుగా అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వీకే.సీనా నాయక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కోసం వినూత్న ఆలోచనకు మున్సిపల్ సిబ్బంది శ్రీకారం



అమరావతి: రోడ్లపై చెత్త వేయకూడదు అన్న ముఖ్యమంత్రి ఆదేశాలు, ఆకాంక్షలకు అనుగుణంగా మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది వినూత్న విధానాన్ని అనుసరిస్తున్నారు. ఎన్నిసార్లు చెప్పినా ఎంత అవగాహన కలిగించినా కొంత మంది ప్రజల్లో చైతన్యం రావట్లేదని మంగళగిరి నగరంలోని ఒకటో సచివాలయం ఉద్యోగులు ఒక వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. ప్రజలు చెత్త వేసిన చోట రోడ్డు పక్కన శుభ్రం చేసి ముగ్గులు వేసి తులసి కోటను పెట్టి సిబ్బంది పూజలు చేశారు. ప్రజలలో ఈ విధంగానైనా చైతన్యం వచ్చి ఇక్కడ చెత్త వేయకుండా ఉంటారని ఆశిస్తున్నామని సిబ్బంది చెప్పారు.

## శ్రీ సత్యసాయిబాబా 100వ జయంత్యోత్సవాలకు బాలయ్యకు ఆహ్వానం

●నందమూరి బాలకృష్ణను ఆహ్వానించిన ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



పుట్టపర్తి (చైతన్యరథం): అమరావతిలో జరుగుతున్న శాసనసభ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ లాబీ వద్ద సినీ అగ్రహీరో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణని కలిసిన అనంతపురం, సత్యసాయి ఉమ్మడి జిల్లాల నుంచి పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డితో పాటు మంత్రి సవిత, మాజీమంత్రి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి తదితరులు.. ఆర్డిటి సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఎ రెన్యువల్ అయ్యేలా కేంద్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం అసెంబ్లీ లాబీ వద్ద హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణని ప్రత్యేకంగా కలిసి నవంబర్ మాసంలో జరిగే పుట్టపర్తి భగవాన్ శ్రీసత్యసాయిబాబా 100వ జయంత్యోత్సవాలకు రావాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు. సానుకూలంగా స్పందించి ఆర్డిటి సంస్థకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుక వెళ్లి ఆర్డిటి సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఎ రెన్యువల్ అయ్యేవిధంగా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి తప్పకుండా న్యాయం చేస్తుందనే నమ్మకం విశ్వాసం ఉందని నందమూరి బాలకృష్ణ హామీ ఇచ్చారు. అదేవిధంగా పుట్టపర్తి భగవాన్ శ్రీ సత్య సాయిబాబా ఉత్సవాలకు ప్రభుత్వం ద్వారా అన్ని సహాయ సహకారాలు అందిస్తామని బాబా వేడుకలు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తామని బాలకృష్ణ హామీ ఇచ్చారు. దసరా వేడుకల నేపథ్యంలో బుధవారం మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలందరూ నీలం రంగు చీరలు ధరించి అసెంబ్లీకి హాజరయ్యారు.

## నియోజకవర్గంలో రోడ్ల సమస్యలను పరిష్కరించండి

●అసెంబ్లీలో ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి

●మొత్తం 150కోట్లు మంజూరు చేయాలని వినతి



రాప్తాడు (చైతన్యరథం): నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణాలకు నిధులు ఇవ్వాలని.. అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. బుధవారం జరిగిన సమావేశాల్లో జీరో అవర్లో ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాప్తాడు నియోజకవర్గంలో ఇప్పటికే చాలా చోట్ల రోడ్ల సమస్యలు లేకుండా చేసినప్పటికీ.. ఇంకా కొన్ని రోడ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉందన్నారు. అనంతపురం సమీపంలోని టమోటా మండీల దగ్గర నుంచి వయా కనగానపల్లి మీదుగా చిగురచెట్టు వరకు, తగరకుంట నుంచి ఎగువపల్లి, తగరకుంట నుంచి నూతిమడుగు, ఈనాడు ఆఫీస్ దగ్గర నుంచి చిగిచర్ల వరకు ఉన్న ప్రధాన రోడ్లు వేయాల్సి ఉందన్నారు. ముఖ్యంగా యాలేరు తగరకుంట గ్రామాల మధ్యలో ఓపెన్ చేసిన రోడ్డు పనులు ప్రస్తుతం ప్రారంభించామన్నారు. ఇంకనూ సుమారుగా 15కిలోమీటర్ల రోడ్డు పనులు నిధులు లేక ఆపాల్సి వస్తోందన్నారు. ఈ మార్గంలో ప్రయాణించే రైతులు, విద్యార్థులు, ప్రయాణికులు సౌకర్యం కోసం మరియు నియోజకవర్గంలోని ఇతర రోడ్ల నిర్మాణాలకు సుమారు 150కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఇబ్బంది దృష్ట్యా దీనిని వెంటనే పరిగణలోకి తీసుకోవాలన్నారు.

## ఎన్నికల వేళ మాత్రమే రాజకీయ జెండా.. అజెండాలు

●నూతన అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



నెల్లూరు (చైతన్యరథం): ఎన్నికలు లేనివేళ అధికారం, ప్రతిపక్షం అని తేడా లేకుండా అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. నగరంలోని 12వ డివిజన్, చింతారెడ్డిపాలెంలో రూ.26 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని జిల్లా ప్రజా పరిషత్ ఛైర్మన్ ఆనం అరుణమ్మతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క చింతారెడ్డి పాలెం గ్రామ అభివృద్ధికే రూ.కోటి నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అమెరికాలోని చార్లెట్‌లో కూచిపూడి ప్రాక్టికల్ పరీక్షలు



ఇంటర్నెట్ (చైతన్యరథం): తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం (ఎస్‌పిఎంవివి), అనుబంధ సంస్థ అయిన తానా కళాశాల, అమెరికాలోని చార్లెట్‌లో కూచిపూడి ప్రాక్టికల్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. ఈ పరీక్షలను పర్యవేక్షించి, నిర్వహించడానికి తిరుపతి నుండి విచ్చేసిన డా. ఉప్పురి హిమబిందు (ఎం.పి.ఎ. డ్యాన్స్, ఎం.ఫిల్., పి.హెచ్.డి., అసిస్టెంట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యూజిక్, డ్యాన్స్, ఫైన్ ఆర్ట్స్, ఎస్‌పిఎంవివి) వారిని తానా సగౌరవంగా ఆహ్వానించింది. ఈ కార్యక్రమాన్ని స్థానిక తానా చార్లెట్ బృందం నాయకులు నాని వడ్లమూడి, కిరణ్ కొత్తపల్లి, టాగూర్ మల్లినేని, మాధురి ఏలూరి, నాగ పంచుమర్తి సమన్వయం చేసి, డా. హిమబిందుకి, ఉపాధ్యాయురాలు రూప్నీకి ఘనంగా సత్కారం అందించారు. అలాగే, పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ ఈ బృందం శుభాకాంక్షలు తెలియజేసింది. తానా కార్యక్రమాల్లో ఒక ముఖ్యమైన మైలురాయిగా ఈ కార్యక్రమం నిలిచింది. డాన్స్, సంగీతంలో ఉన్నత డిప్లొమా కోర్సులను తీసుకురావడానికి తానా, ఎస్‌పిఎంవివితో భాగస్వామ్యం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇది సాంస్కృతిక, విద్యా సంబంధాలను మరింత పటిష్టం చేసింది. స్థానికంగా ఉన్న కళాకారులు తానా కళాశాల ద్వారా తమ కళను మెరుగుపరుచుకునే అవకాశం లభించింది. తానా అధ్యక్షుడు నరేన్ కొడాలి, తానా వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ లావు, తానా కళాశాల నిర్వాహకులు మాలతి నాగభైరవ తదితరులు ఇందులో పాల్గొన్న స్టూడెంట్లకు అభినందనలు తెలియజేశారు.

## రాష్ట్రంలో 2,524 అనధికార విగ్రహాలు - తొలగింపునకు ఆదేశాలిచ్చాం

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో బహిరంగ ప్రదేశాల్లో అనధికారికంగా విగ్రహాల ఏర్పాటు అంశం శాసన మండలిలో తీవ్ర చర్చకు దారితీసింది. మొత్తం 2,524 విగ్రహాలు అనుమతులు లేకుండా బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేశారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వెల్లడించారు. 2019లో జారీ చేసిన జీవో ప్రకారం ఇప్పటివరకు కొత్త విగ్రహాల ఏర్పాటుకు అనుమతించలేదని ఆయన స్పష్టం చేశారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన విగ్రహాలపై కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశామని మంత్రి తెలిపారు. మార్గదర్శకాల ప్రకారం పరిశీలన చేసి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రశ్నోత్తరాల్లో పాల్గొన్న టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, పులివెందులలో ప్రజా నిధులను దుర్వినియోగం చేసి అనధికారికంగా మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలు ఏర్పాటు చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో "వైఎస్ఆర్ విగ్రహాల కూడళ్ల అభివృద్ధి" పేరిట కోట్లాది రూపాయలు వృథా చేశారని మండిపడ్డారు. అదేవిధంగా టీడీపీ ఎమ్మెల్సీలు బి. తిరుమలనాయుడు, ఆలపాటి రాజేంద్రప్రసాద్ కూడా అనధికార విగ్రహాలపై ప్రశ్నలు లేవనెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా అనుమతి లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేయడంపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో విగ్రహాల ఏర్పాటుకు ముందు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని, లేనిపక్షంలో వాటిని తొలగించే చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.

## విద్యకోసం భూములు దానం చేస్తే వాటిని దోచుకోవడం సరికాదు




ప్రొద్దుటూరు (చైతన్యరథం): ప్రొద్దుటూరులోని మహర్షి పాఠశాల, డీఎడబ్ల్యూ కళాశాల ఆక్రమణల విషయంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రమేయం ఉందని నియోజకవర్గ టీడీపీ మాజీ ఇన్చార్జ్ ప్రవీణ్ కుమారెడ్డి ఆరోపించారు. మహర్షి పాఠశాలకు చెందిన 35 సెంట్ల స్థలం రాచమల్లు సోదరుడికి ఇచ్చేట్లుగా బేరం కుదుర్చుకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై సీఎంకు ఫిర్యాదు చేశానన్నారు. డీఎడబ్ల్యూ కళాశాలకు చెందిన స్థలం ప్లాట్లు వేసి అమ్ముకునేందుకు గతంలో రాచమల్లు కొంత మంది నుంచి రూ.2.50 కోట్లు తీసుకున్నారని వ్యాఖ్యలు చేశారు. ఆయన సోదరుడికి పెట్టుబడి లేకుండా 14 శాతం వాటా ఇప్పించారన్నారు. దాతలు విద్యకోసం భూములు దానం చేస్తే వాటిని దోచుకోవడం సరికాదన్నారు. రాచమల్లు అలా బేరం కుదుర్చుకోకపోతే మహర్షి పాఠశాల, డీఎడబ్ల్యూ కళాశాల స్థలాలపై కోర్టులో కేసు వేయాలన్నారు. రాచమల్లు ప్రొద్దుటూరులో రహస్య మిత్రులు, మధ్యవర్తులను పెట్టుకుని రూ.వందల కోట్ల విలువచేసే ఆస్తులను కబ్జా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు.

## దేవీ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు



చంద్రగిరి (చైతన్యరథం): తిరుపతి జిల్లా, చంద్రగిరి పట్టణంలో వెలసిన గ్రామ దేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ తల్లి దేవీ నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సతీసమేతంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని వారి సతీమణి పులివర్తి సుధా రెడ్డి పాల్గొన్నారు. ముందుగా టవర్ క్లాక్ వద్ద ఉన్న వినాయక స్వామి దేవాలయం వద్దకు ఎమ్మెల్యే సతీ సమేతంగా చేరుకున్నారు. శ్రీ మూలస్థాన ఎల్లమ్మ తల్లి ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ ఈఓ మమత కూటమి నాయకులు, భక్తులు, ఎమ్మెల్యే దంపతులను సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే దంపతులు ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. శ్రీ వినాయక స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిపించి వెండి కవచంతో కూడిన గజవాహన సమర్పణలో దాతలతో పాటు ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. గజ వాహనంపై ఉన్న తెరను తొలగించి భక్తులకు కనువిందు చేశారు. ఆలయ పూజారి ఎమ్మెల్యే దంపతులు, గజవాహన దాతలతో కలిపి గజ వాహనానికి ప్రత్యేక పూజలు జరిపించారు. అమ్మవారి వాహనమైన గజవాహనాన్ని టవర్ క్లాక్ వినాయక స్వామి ఆలయం నుంచి వాహనాన్ని మోస్తూ ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే మరియు దాతలు కలిసి ఆలయ ఈవో చైర్మన్ లకు అందజేశారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే దంపతులకు ఆలయ అర్చకులు, ఈవో, చైర్మన్, సభ్యులు కలిసి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించి దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి ఎమ్మెల్యే దంపతులకు కండువాలతో సత్కరించారు. ఆలయ పూజారి తీర్థప్రసాదాలను అందించి ఆశీర్వదించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ... శాశ్వత గజవాహన ఉభయ దాతలు కీర్తిశేషులు జి.ర్ రాజగోపాల్, వారి శ్రీమతి జి.ర్ కుప్పమ్మ జ్ఞాపకార్థం, వారి వారసులు జి.ర్ విజయ రాఘవులు -సతీమణి బేబీ రాణి, జి.ర్ చక్రపాణి, సత్యనారాయణన్ -హేమావతి ఆధ్వర్యంలో ఈ వెండి గజవాహనం సమర్పించారు. అమ్మవారికి భక్తి, శ్రద్ధా గౌరవాలతో గజవాహనాన్ని సమర్పించిన దాతలకు ఎమ్మెల్యే ఇటువంటి మంచి కార్యాన్ని తల పెట్టారని నమస్కరిస్తూ అభినందించారు. దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శాశ్వత ఉభయ దారులు, తాత్కాలిక ఉభయ దారులు గజవాహనం, గొడుగులు, అన్నదానంతో పాటు దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా, వైభవంగా జరిగేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే పులివర్తి నాని కృతజ్ఞతలు తెలిపారు.

# దేశంలో భారీగా మెడికల్ సీట్ల పెంపు

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మెగికల్ సీట్ల పెంపు, రైల్వే ఉద్యోగుల పండుగ బోనస్, బీహార్‌కు 6 వేల కోట్ల ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. దేశంలో పోస్ట్ గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ వైద్య విద్య సీట్లలో భారీ పెంపునకు ఆమోదం తెలిపింది. 5,023 ఎంబీ బీఎస్ సీట్లను పెంచడానికి, ప్రస్తుత ప్రభుత్వ వైద్య కళాశాలల అప్‌గ్రేడ్ కోసం సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్ విస్తరణకు ఆమోదం తెలిపింది. సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్ 3వ దశ కింద ప్రస్తుత ప్రభుత్వ వైద్య కళాశాలల అప్‌గ్రేడేషన్ ద్వారా 5,000 కొత్త పోస్ట్‌గ్రాడ్యుయేట్ సీట్లు, 5,023 ఎంబీబీ ఎస్ సీట్లు పెంచేందుకు ఆమోదం తెలిపింది. తాజా మార్పులతో దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్ సీట్లు 1,18,190కి, పీజీ సీట్లు 74,306కి చేరుకుంటాయి. మొత్తం రూ.15,034.50 కోట్ల బడ్జెట్ (2025–26 నుంచి 2028–29 వరకు)తో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తారు. ఇందులో కేంద్రం వాటా రూ.10,303.20 కోట్లు కాగా.. రాష్ట్రాల వాటా రూ.4,731.30 కోట్లు. ఇప్పటికే దేశంలో 808 మెడికల్ కళాశాలలో 1,23,700 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నప్పటికీ, డిమాండ్‌కు తగ్గట్టు సామర్థ్యం పెంచడం అవసరమని ప్రభుత్వం గుర్తించింది.

**- బీహార్‌కు రూ.6 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు**
**- రైల్వే ఉద్యోగులకు దసరా, దీపావళి బోనస్**
**- కేంద్ర మంత్రి వర్గం ఆమోదం**



### రైల్వే ఉద్యోగులకు శుభవార్త..

ఢిల్లీ: దేశవ్యాప్తంగా రైల్వే ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో గ్రూప్ సీ, గ్రూప్ డీ ఉద్యోగులకు కేంద్రం 78 రోజుల బోనస్‌ను ప్రకటించింది. దీంతో 10.91 లక్షల మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. ఈ బోనస్ పథకానికి కేంద్ర ప్రభుత్వం రూ.1,866 కోట్లు కేటాయించింది. నాన్‌గెజిటెడ్ గ్రూప్ సీ, గ్రూప్ డీ (లెవెల్ 1 స్టాఫ్) ఉద్యోగులకు ఈ బోనస్ వర్తించనుంది. అలాగే, రైల్వే ప్రొడక్షన్ యూనిట్లు, రైల్వే వర్క్‌షాపులు, ఇతర సహాయ విభాగాలలో పనిచేసే ఉద్యోగులకూ ఈ బోనస్ అందనుంది.

### సముద్ర రంగం అభివృద్ధికి రూ.69,725 కోట్లు

బీహార్‌లో సాహెబ్ గంజ్– బెట్టయ్య ఎన్‌హెచ్ 139 నాలుగు లైన్ల రహదారి 79 కి.మీ. అభివృద్ధికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. రెండేళ్లలో పూర్తి కానున్న ఈ నిర్మాణానికి కేంద్రం రూ.3,822 కోట్లు ఖర్చు చేయనుంది. అలాగే, భక్తియార్ పూర్ – రాజ్‌గిర్– తలయ రైల్వే లైన్ డబ్లింగ్‌కి కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. 104 కి.మీ. మేర రైల్వే లైన్ డబ్లింగ్ కోసం కేంద్రం రూ.2,192 కోట్లు ఖర్చు పెట్టనుంది. ఈ నిర్మాణం ద్వారా బీహార్– జార్ఖండ్ మధ్య కనెక్టివిటీ పెరగనుంది. షిప్పింగ్ మారిటైమ్ అభివృద్ధి సంస్కరణల కోసం కేంద్రం రూ.69,725 కోట్లు కేటాయించనుంది. షిప్పుల తయారీ, షిప్పింగ్ రంగ అభివృద్ధి కోసం కేంద్ర కేబినెట్ నిధులు కేటాయించింది.



## నీట్‌లో 99.99 శాతం మార్కులు.. డాక్టర్ అవ్వాలని లేదని ఆత్మహత్య

నీట్ ఎగ్జామ్‌కు చాలా టఫ్ కాంపిటీషన్ ఉంటుంది. ఎందుకంటే, దేశవ్యాప్తంగా ఈ పరీక్షకు లక్షలాది మంది విద్యార్థులు హాజరవుతారు. ఈ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించడం చాలా అంటే చాలా కష్టం. అయితే ఓ విద్యార్థి ఇటీవల నిర్వహించిన నీట్ యూజీ 2025 పరీక్షలో టాపర్‌గా నిలిచాడు. ఏకంగా 99.99 శాతంతో ఉత్తీర్ణుడయ్యాడు. ఓబీసీ విభాగంలో 1475 ఆల్ ఇండియా ర్యాంక్ సాధించాడు. కానీ, అతడికి డాక్టర్ అవ్వడం ఇష్టం లేదు. దీంతో తన ప్రాణాలు తీసుకున్నాడు. ఈ విషదకరమైన ఘటన మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలో చోటుచేసుకుంది. సిందేవాహి తాలూకాలోని నవర్గావ్ గ్రామానికి చెందిన 19 ఏళ్ల అనురాగ్ అనిల్ బోర్కర్ ఇటీవల నిర్వహించిన నీట్‌లో 99.99 శాతం స్కోర్ సాధించాడు. ఓబీసీ కేటగిరీలో అతనికి 1475వ ఆల్ ఇండియా ర్యాంక్ వచ్చింది. వైద్య కళాశాలలో అడ్మిషన్‌కు అర్హత సాధించడంతో కుటుంబ సభ్యులంతా ఎంతో సంతోషపడ్డారు. అయితే డాక్టర్ కావడం ఇష్టం లేక అడ్మిషన్ కోసం బయలు దేరాల్సిన రోజున తన ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఒక సూసైడ్ నోట్ కనిపించింది. అందులో తనకు డాక్టర్ కావడం ఇష్టం లేదని రాసి ఉంది.

## లద్దాఖ రాష్ట్ర హెూదా ఆందోళనలు హింసాత్మకం..

### నిరాహార దీక్ష విరమించిన సోనం వాంగ్‌చుక్

శ్రీనగర్: కేంద్ర పాలిత ప్రాంతమైన లద్దాఖ్‌కు రాష్ట్ర హెూదా కల్పించాలనే డిమాండ్‌తో చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో పర్యావరణ ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుక్ 15 రోజులుగా సాగిస్తున్న నిరాహార దీక్షను విరమించారు. రాష్ట్ర హెూదా డిమాండ్ చేస్తూ లెహ్ నగరంలో పెద్ద ఎత్తున ఆందోళనకారులు బుధవారంనాడు రోడ్లపైకి వచ్చారు. పోలీసులతో ఘర్షణకు దిగడం, రాళు రువ్వడం, సీఆర్‌పీఎఫ్ వాహనంతో పాటు బీజేపీ కార్యాలయానికి నిప్పుపెట్టడం వంటి హింసాత్మక చర్యలకు దిగడంతో తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది. ఈ నేపథ్యంలో ఉద్యమం హింసాత్మక రూపు దాల్చడంతో తన నిరాహార దీక్షను విరమిస్తున్నట్టు సోనం వాంగ్‌చుగ్ ప్రకటించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వీడియో సందేశాన్ని పోస్ట్ చేశారు. 'లద్దాఖ్ యువకులు తక్షణం హింసను నిలిపివేయాలి. ఇందువల్ల మన ఉద్దేశం దెబ్బతినడంతో పాటు పరిస్థితి దిగజారిపోతుంది. లద్దాఖ్‌లో కానీ దేశంలో కానీ అస్థిరతను మనం కోరుకోవడం లేదు' అని దీక్షా శిబిరం వద్ద గుమిగూడిన తన మద్దతుదారులను ఉద్దేశించి వాంగ్‌చుక్ పేర్కొన్నారు. లద్దాఖ్‌కు రాష్ట్రహెూదా కల్పించి, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలని, తద్వారా భూములు, ఉద్యోగాలు, కల్చరల్ ఐడెంటిటీకి పరిరక్షణ లభిస్తుందని వాంగ్‌చుక్ డిమాండ్ చేస్తున్నారు.

## బీహార్ ఎన్నికలు మోదీ అవినీతి పాలన అంతానికి నాంది: మల్లికార్జున ఖర్గే



పాట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అవినీతి పాలన ముగింపునకు నాంది పలుకుతాయని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. బీహార్ ప్రజలు బీజేపీ రెలీజియస్ పోలరైజేషన్‌పై ఏమాత్రం ఆసక్తిగా లేరని, అభివృద్ధి, సంక్షేమంతో కూడిన రాజకీయాలను కోరుకుంటున్నారని చెప్పారు. బిహార్‌లోని ఎన్డీయేలో అంతర్గత కలహాలు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయని, ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌ను ఒక భారంగా బీజేపీ భావిస్తోందని అన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల వ్యూహాన్ని ఖరారు చేసేందుకు, ఓట్ చోరీ అంశంపై బీజేపీని మరింత ఇరకాటంలో పెట్టే విషయమై చర్చించేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం బీహార్ రాజధాని పాట్నాలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయమైన సదాకత్ ఆశ్రమంలో బుధవారం నిర్వహించారు. ఖర్గే అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కూడా హాజరయ్యారు. బీహార్ తరహాలోనే దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఓటర్లను తొలగించేందుకు కుట్ర జరుగుతోందని తెలిపారు.

## మావోయిస్టులకు బిగ్ షాక్..ఐదుగురి హతం



జార్ఖండ్: గుమ్లాలో భద్రతా దళాల ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. అనంతరం వారి దగ్గర నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. గుమ్లాలో మావోయిస్టుల ఉన్నారన్న సమాచారంతో.. దాడి చేసిన భద్రతా దళాలు మావోయిస్టులను మట్టుపెట్టాయి. ఇరువర్గాల మధ్య భీకర ఎదురుకాల్పులు జరిగినట్లు సమాచారం. అయితే ఇప్పటికి కాల్పులు కొనసాగుతున్నట్లుగా తెలుస్తోంది. మృతిచెందిన మావోయిస్టులను నిషేధిత జార్ఖండ్ జన్ ముక్తి పరిషద్ (జేజేఎంపీ) సంస్థకు చెందిన వారిగా గుర్తించినట్లు తెలిపారు. మృతులను సబ్–జోనల్ కమాండర్లు పేర్కొన్నారు. మృతిచెందిన వారిలో రూ.5 లక్షల రివార్డున్న ఇద్దరు కమాండర్లు ఉన్నట్లు చెప్పారు. మంగళవారం కూడా ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టు అగ్రనేతలు హతమైనట్టు అధికారులు పేర్కొన్నారు. వీరిని మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యులైన రాజు దాదా అలియాస్ కట్టా రామచంద్రారెడ్డి, కోస దాదా అలియాస్ కదారి సత్యనారాయణరెడ్డిగా గుర్తించారు. వీరిద్దరూ తెలంగాణలోని కరీంనగర్‌కు చెందినవారని నారాయణ్ పూర్ ఎస్పీ రాబిన్‌సన్ గురియా తెలిపారు.

### 71 మంది లొంగుబాటు

ఓ వైపు వరుస ఎన్‌కౌంటర్లతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మావోయిస్టులకు మరో బిగ్ షాక్ తగిలింది. ఇప్పటికే అనేకమంది మావోలు అడవిని వీడి వచ్చేస్తున్నారు. ఇప్పుడు తాజాగా 71 మంది మావోయిస్టులు.. పోలీసుల ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో 30 మందిపై రూ.64 లక్షల రివార్డ్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరిలాగే మిగిలిన మావోయిస్టులూ లొంగిపోయి.. ప్రశాంతమైన జీవనం గడపాలని పోలీసులు చెబుతున్నారు.

## లైంగిక వేధింపులు..పరారీలో ఢిల్లీ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్



న్యూఢిల్లీ: విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలతో ఢిల్లీ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ మీద కేసు నమోదైంది. ప్రస్తుతం ఆయన పరారీలో ఉన్నారు. ఢిల్లీలోని వసంత్ కుంజ్‌లో ఉన్న ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ చైతన్యానంద సరస్వతి (గతంలో డాక్టర్ పార్థసారథి)పై ఈ కేసు నమోదు చేశారు. అయితే, ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడని ఢిల్లీ పోలీసులు తెలిపారు. సదరు విద్యాసంస్థలో ఈడబ్ల్యూఎస్ స్కాలర్‌షిప్ కింద పీజీడీఎం కోర్సులు చదువుతున్న ఏకంగా 17 మంది విద్యార్థినులు డైరెక్టర్ చైతన్యానంద మీద ఫిర్యాదు చేయడం విశేషం. ఆగస్టు 4న వసంత్ కుంజ్ నార్త్ పోలీస్ స్టేషన్‌లో మొదటి ఫిర్యాదు దాఖలైంది. చైతన్యానంద విద్యార్థినులపై అసభ్య భాష, అశ్లీల మెసేజ్‌లు పంపడం, అనవసరంగా శరీర భాగాల్ని తాకడం వంటి చేష్టలు చేశాడని పోలీసులు తెలిపారు. ఫ్యాకల్టీ, అడ్మినిస్ట్రేటర్లు కూడా ఈ చర్యలకు మద్దతు ఇచ్చి, విద్యార్థినిలను ఒత్తిడి చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్లు 75(2)/79/351(2) కింద కేసు నమోదు చేశారు. మొత్తం 16 మంది బాధిత అమ్మాయిల వాంగ్మూలాలు పటియాలా హౌస్ కోర్టులో జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ముందు రికార్డ్ చేశారు. నిందితుడు వాడిన వోల్వో కార్‌ను (ఫేక్ డిప్లొమాటిక్ నంబర్ ప్లేట్ 39 యూఎన్1తో) సీజ్ చేశారు. ఎస్ఆర్ఐఎస్ఐఐఎం ఇన్‌స్టిట్యూట్‌లోని సీసీటీవీ ఫుటేజ్, ఎన్‌వీఆర్, ఎస్ఎస్ఎల్‌కు పంపి దర్యాప్తు చేస్తున్నారు. లైంగిక వేధింపుల ఆరోపణలు రావడంతో చైతన్యానంద సరస్వతిని వెంటనే ఇన్‌స్టిట్యూట్ నుంచి తొలగించారు. శ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య మహాసంస్థానం, దక్షిణామ్నాయ శారదాపీఠం, శృంగేరి సంస్థ కూడా సంబంధాలు తెగించుకుని, అతని చట్ట విరుద్ధ కార్యకలాపాలపై ఫిర్యాదు చేశాయి. పోలీసులు దాడులు, రైడ్‌లు చేసినా నిందితుడు ఇంకా పోలీసులకు చిక్కలేదు. ఈ కేసు మరోసారి విద్యా సంస్థల్లో మహిళలకు లభిస్తున్న రక్షణపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

# రష్యా.. ఓ పేపర్ టైగర్!

- ఉక్రెయిన్ చేతలకు టైమొచ్చింది
- అవసరమైతే రష్యా విమానాలకు కూల్చేస్తాం: ట్రంప్



ప్రపంచంలోని రెండు భారీ శక్తుల మధ్య వివాదం ముదురుతోంది. నాటో కూటమి దేశాల గగనతల సరిహద్దులను ఉల్లంఘించి రష్యా ఫైటర్ జెట్లు దూసుకురావడంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అవసరమైతే రష్యా విమానాలను కూల్చేస్తామన్నారు. ఆయన ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో భేటీ అయ్యారు. ఆ తర్వాత ఓ విలేకరి “అలాంటి పరిస్థితుల్లో నాటో సభ్యదేశాలు రష్యా విమానాలను కూల్చేయాలా?” అని ప్రశ్నించారు. దీనికి ట్రంప్ ‘అవును.. కూల్చేస్తాం’ అని బదులిచ్చారు. ఇటీవల కాలంలో నాటో దేశాలైన పోలాండ్, ఎస్తోనియా సహా పలు నాటో సరిహద్దుల్లోకి రష్యా ఫైటర్ జెట్లు చొరబడిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ట్రంప్ రష్యా, ఉక్రెయిన్‌పై ట్రూత్‌లో ఓ పోస్టు పెట్టారు. ఉక్రెయిన్ 2014నుంచి కోల్పోయిన తన భూభాగం మొత్తం తిరిగి పొందగలదని తాను అభిప్రాయానికి వచ్చినట్టు పేర్కొన్నారు. ఈ యుద్ధం రష్యాను ఓ ‘పేపర్ టైగర్’గా మార్చేసింది. ఈ యుద్ధంవల్ల దానికి భారీగా డబ్బు ఖర్చవుతోంది. పెట్రోలియం విక్రయాలతో నిధుల సంపాదన కష్టంగా మారిందన్నారు. “సమయం, ఓపిక, ఐరోపా సమాఖ్య, ముఖ్యంగా నాటో మద్దతుతో ఉక్రెయిన్ తన భూభాగం తిరిగి పొందడం ఎందుకు సాధ్యం కాదు. అంతకుమించి కూడా పొందవచ్చేమో ఎవరికి తెలుసు. పుతిన్, రష్యా భారీ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయి. ఉక్రెయిన్ చేతలకు సమయం ఆసన్నమైంది” అని ఆ పోస్టులో హెచ్చరించారు. ట్రంప్ పోస్టు భారీ మార్పునకు చిహ్నమని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ అన్నారు. అమెరికా నాయకుడు ఓ గేమ్‌ఛేంజర్ అని అభివర్ణించారు. ట్రంప్‌తో భేటీ సమయంలో యుద్ధక్షేత్రంలో ఏం జరుగుతోందో తాను వివరించినట్టు చెప్పారు. ఆయనకు మరిన్ని విషయాలు కూడా తెలుసని చెప్పారు. ట్రంప్ పోస్టు చేసిన కొద్దిసేపటికి అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో మాత్రం దీనికి భిన్నంగా స్పందించారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని సైనిక చర్యలతో ముగించలేమన్నారు. కేవలం చర్చల ద్వారానే ఇది సాధ్యమని తెలిపారు. ఈ విషయాన్ని ఆయన ఐరాస భద్రతా మండలి సమావేశంలో పేర్కొన్నారు. “ఈ ప్రమాదకర సంక్షోభానికి శాంతియుత పరిష్కారం తీసుకొచ్చేందుకు అమెరికా అన్ని ప్రయత్నాలు చేస్తోంద”న్నారు.

# సింగిల్ మార్కెట్లపై ఆధారపడటం తగ్గించాలి

## గ్లోబల్ సౌత్ దేశాల సమావేశంలో జై శంకర్

ప్రపంచ దేశాలపై సుంకాలతో అమెరికా విరుచుకుపడుతుండటం, మార్కెట్లు అనిశ్చితులకు గురవుతున్నవేళ భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. సరఫరా గొలుసును సుస్థిరపరచుకోవడం ద్వారా సింగిల్ మార్కెట్, ఒకే సరఫరాదారుపై ఆధారపడటం తగ్గించుకోవాలని గ్లోబల్ సౌత్ దేశాలకు విజ్ఞప్తి చేశారు. ఐరాస సాధారణ సభ 80వ సెషన్‌లో భాగంగా భావసారూప్యత కలిగిన దక్షిణాది దేశాల ఉన్నతస్థాయి సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. “పెరుగుతున్న అనిశ్చితులు, ప్రపంచ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్న సమయంలో మనం సమావేశమయ్యాం. ముఖ్యంగా గ్లోబల్ సౌత్ దేశాలు అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నాయి. మహమ్మారి నుంచి తేరుకోకముందే ఉక్రెయిన్, గాజా యుద్ధాలు మొదలు ప్రతికూల వాతావరణ సంఘటనలు, అస్థిర వాణిజ్యం.. పెట్టుబడుల ప్రవాహం, వడ్డీ రేట్లలో అనిశ్చితితోపాటు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల అజెండాలో గణనీయ క్షీణత కనిపించడంవంటి సమస్యలు ఎదుర్కొంటున్నాం” అని జైశంకర్ పేర్కొన్నారు. ఈ స్థాయిలో ఆందోళనలు, ప్రమాదాలు ముంచుకొస్తున్న నేపథ్యంలో గ్లోబల్ సౌత్ దేశాలు బహుపాక్షికతవైపు చూడడం సహజమేనన్నారు. దురదృష్టవశాత్తు ఇక్కడ కూడా నిరాశాజనకంగా కనిపిస్తోందని, బహుపాక్షికత అనే భావనపై దాడులు, అంతర్జాతీయ సంస్థలు అసమర్థంగా మారడం లేదా వనరుల కొరతను ఎదుర్కోవడం సమస్యలను మరింత పెంచుతున్నాయన్నారు. సంస్కరణల ఆలస్యంతో మూల్యం చెల్లించడం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ వ్యవస్థలో తగిన ప్రాధాన్యం కోసం గ్లోబల్ సౌత్ దేశాలు కలిసి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్వేచ్ఛాయుత ఆర్థిక పద్ధతులను అనుసరించడంతోపాటు దక్షిణాది వాణిజ్యాన్ని పెంచుకోవడం, సాంకేతిక సహకారం అందించుకోవడం వంటివి ఎంతో ముఖ్యమని జైశంకర్ స్పష్టం చేశారు.



# భారత్ మావైపే

**- చైనా సహకరిస్తుందన్న నమ్మకం లేదు..**

**- ట్రంప్ ఆరోపణలవేళ జెలెన్ స్కీ కీలక వ్యాఖ్యలు**

రష్యానుంచి ఇంధనం కొనుగోలు చేస్తూ యుద్ధానికి భారత్ వనరులు అందిస్తోందంటూ ట్రంప్ మరోసారి విమర్శలు గుప్పిస్తున్న నేపథ్యంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫాక్స్ న్యూస్‌కుఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించిన జెలెన్ స్కీ.. భారత్ తమవైపే ఉందంటూ వ్యాఖ్యానించారు. రష్యాతో భారత్ చేసుకొన్న ఇంధన ఒప్పందం తమకు సమస్యగా మారినప్పటికీ దీనిని ట్రంప్ పరిష్కరించగలరని భావిస్తున్నట్టు తెలిపారు. రష్యానుంచి ఇంధనాన్ని దిగుమతి చేసు కొనే విషయంలో మోదీ ప్రభుత్వం తనవిధానాన్ని మార్చుకుంటుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు. అయితే భారత్‌లా చైనా తమకు మద్దతిస్తుందని చెప్పలేమని జెలెస్ స్కీ అన్నారు. ఎందుకంటే రష్యాతో జరుగుతున్న యుద్ధం ముగియడంవల్ల తమకు ఎలాంటి ప్రయోజనం లేదని చైనా భావించడమే కారణమన్నారు. అయినప్పటికీ ట్రంప్ యుద్ధం విషయంలో జిన్‌పింగ్ వైఖరిని మార్చగలరని భావిస్తున్నట్టు తెలిపారు. మంగళవారం ఐరాస సర్వప్రతినిధి సభ సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ.. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి భారత్, చైనాలు నిధులు సమకూరుస్తున్నాయని ఆరోపించిన నేపథ్యంలో జెలెన్ స్కీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఐరాస సర్వప్రతినిధి సభ సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ.. చమురు కొనుగోలు చేయడం ద్వారా ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి భారత్, చైనాలు నిధులు సమకూరుస్తున్నాయని విమర్శించారు. నాటో దేశాలు కూడా రష్యానుంచి ఇంధనాన్ని, ఇందన ఉత్పత్తులను కొనుగోలు చేయడం తగ్గించలేదన్నారు. అందువల్లే ఈ యుద్ధాన్ని ఆపడానికి మరిన్ని శక్తిమంతమైన సుంకాలను విధించడానికి సిద్ధమవుతున్నట్టు వెల్లడించారు. అవి త్వరలోనే అమల్లోకి వస్తాయన్నారు. మరోవైపు రష్యానుంచి ముడిచమురు కొంటున్న భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు అమెరికా విధించిన అదనపు సుంకాలు ఆగస్టు 27నుంచే భారత్‌లో అమల్లోకి వచ్చాయి. రష్యానుంచి చమురు కొనుగోలు చేసే భారత్‌వంటి దేశాలపై ఆంక్షలు విధించడం సరైన నిర్ణయమేనని అప్పట్లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ వ్యాఖ్యానించారు.

# ట్రంప్.. అలా చేయగలరు!

## భారత్‌పై టారిఫ్‌లను సరిచేయొచ్చు: మార్కో రూబియో



రష్యానుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై విధించిన 25శాతం అదనపు టారిఫ్‌ను ట్రంప్ కార్యవర్గం సరి చేసేందుకుసానుకూలంగా ఉన్నట్టు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో సూచనప్రాయంగా తెలిపారు. ఆయన ఎన్బీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై కీలకవ్యాఖ్యలు చేశారు. “ఐరోపా దేశాలు కూడా తక్షణమే రష్యాపై ఆంక్షలు విధించడం చాలా కీలకం. అక్కడ చాలాదేశాలు ఇప్పటికీ రష్యానుంచి చమురు సహజవాయువును కొనుగోలు చేస్తున్నాయి. ఇది సరికాదు. పైగా వాళ్లు రష్యాపై అదనపు ఆంక్షలు విధించాలని మళ్లీ డిమాండ్ చేస్తున్నారు. వారు చేయాల్సినవి చేయడం లేదు”అని పేర్కొన్నారు. ఇక భారత్‌పై ఆంక్షల గురించి మాట్లాడుతూ “మేము దానిని సరిచేయగలమని ఆశిస్తున్నాం” అని పేర్కొన్నారు. రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించే ఆప్షన్‌ను ట్రంప్ పరిశీలిస్తున్నారని రూబియో చెప్పారు. “ఒక దశకు వచ్చాక ఆయన కొత్త ఆంక్షలను అమలుచేయవచ్చు. అలా చేయగల సత్తా ట్రంప్‌నకు ఉంది. ఆయన మారుతున్న పరిణామాల ఆధారంగా నిర్ణయం తీసుకొంటున్నారు” అని తెలిపారు. అలాస్కా సదస్సు తర్వాత పుతిన్ చర్యలపై ట్రంప్ తీవ్ర నిరాశలో ఉన్నారు. ట్రంప్ ఈ యుద్ధాన్ని ప్రారంభించలేదని.. ఆయనకు, గత అధ్యక్షుడి నుంచి ఈ బాధ్యతలు వచ్చాయన్నారు. దీనిని ముగించాలని ఆయన భావిస్తున్నారు.

అమెరికా, భారత విదేశాంగ మంత్రులు మార్కో రూబియో, జై శంకర్‌లు భేటీ అయ్యారు. న్యూయార్క్ ప్యాలెస్‌లో 80వ ఐక్య రాజ్యసమితి సర్వసభ్యసమావేశం నేపథ్యంలో వీరి భేటీ జరిగింది. ‘యూఎన్జీఏలో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ సమావేశమయ్యాను. వాణిజ్యం, రక్షణ, ఔషధాలువంటి కీలకమైన అంశాలపై మేము ద్వైపాక్షిక చర్చలు జరిపాం’ అని రూబియో ఎక్స్‌లో పోస్టు చేశారు. అమెరికా పర్యటనలో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ట్రంప్ కార్యవర్గంలోని కీలక వ్యక్తులతో భేటీ అవుతున్నారు. తాజాగాభారత్‌కు రాయబారిగా రానున్న సెర్గియో గోర్‌తో కూడా భేటీ అయ్యారు. మరోవైపు అమెరికా భారత్‌ల మధ్య వాణిజ్యచర్చలు సాఫీగా జరుగుతుండటంతో.. ఈ ఏడాది చివర్లో జరగాల్సిన క్వాడ్ కూటమి సదస్సుకు డొనాల్డ్ ట్రంప్ హాజరయ్యే అవకాశాలున్నాయి. న్యూఢిల్లీలో చర్చలు సానుకూలంగా జరుగుతున్నాయని ట్రంప్ కార్యవర్గంలోని కీలక వ్యక్తులు చెబుతున్నారు.

# ‘పేపర్ టైగర్ కాదు.. రియల్ బేర్’

## ట్రంప్‌నకు క్రెమ్లిన్ కౌంటర్

ఉక్రెయిన్‌పై సుదీర్ఘకాలంగా యుద్ధంచేస్తోన్న రష్యా ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై క్రెమ్లిన్ స్పందించింది. ఈ సందర్భంగా రష్యా ‘పేపర్ టైగర్’గా (పైకి బలంగా కనిపించినప్పటికీ బల హీనంగా ఉందని) మారిందని ట్రంప్ వ్యాఖ్యలకు దీటుగా బదులిచ్చింది. మాస్కో ‘బేర్’ అని..‘పేపర్ బేర్’ ఉండదంటూ వ్యాఖ్యానించింది. “రష్యా పులి కాదు.. బేర్‌తో ఎక్కువ సంబంధం ఉంది. పేపర్ బేర్ మనుగడ లో లేదు. రష్యా ఆర్థికంగా బలంగా ఉంది. ఉక్రెయిన్‌లో తమబలగాలు పైచేయి సాధిస్తున్నాయి” అని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వెల్లడించారు. నష్టాన్ని తగ్గించేందుకు అత్యంత జాగ్రత్తగా ముందుకు సాగుతున్నాయన్నారు. ఈక్రమంలో తమ సైన్యం సామర్థ్యాలను తక్కువ అంచనా వేయొద్దని, వ్యూహాలకు అనుగుణంగా నడుచుకుంటున్నాయని చెప్పారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే శాంతి ఒప్పందానికి తన వంతు ప్రయత్నాలు చేసిన ట్రంప్.. తాజాగా స్వరం మార్చినట్టు కనిపించింది. ఐరాస సాధారణ సభ సమావేశాల సందర్భంగా ట్రంప్-జెలెన్ స్కీ భేటీ అయ్యారు. అనంతరం ట్రూత్ సోషల్లో అమెరికా అధ్యక్షుడు స్పందిస్తూ...మూడున్నరేళ్లుగా సాగుతున్న యుద్ధం రష్యాను ఓ ‘పేపర్ టైగర్’గా మార్చేసిందన్నారు. గతంలో కోల్పోయిన భూభాగాన్ని ఉక్రెయిన్ తిరిగి పొందగలదన్నారు. యుద్ధంవల్ల రష్యాకు భారీగా ఖర్చవుతోందని, చమురు విక్రయంతో నిధులు సమకూర్చుకోవడం మాస్కోకు కష్టంగా మారిందని ట్రంప్ వ్యాఖ్యానించారు.



# భారత్.. ఎదుగుతున్న మహాశక్తి

## చైనా, రష్యాలతో కలిపి చూడకూడదు: ఫిన్‌లాండ్ అధ్యక్షుడు

రష్యా, చైనాతో కలిపి భారత్‌ను చూడకూడదని ఫిన్‌లాండ్ అధ్యక్షుడు అలగ్జాండర్ స్టబ్ పశ్చిమ దేశాలకు సూచించారు. న్యూఢిల్లీ సూపర్ పవర్ ఎదుగుతోందని..దానితో కలిసి పనిచేయాలన్నారు. ఆయన బ్లూమ్ బెర్గ్ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్-రష్యా-చైనా మధ్య స్నేహం పెరగడంపై అడిగిన ప్రశ్నకు ఈ విధంగా స్పందించారు. “ఐరోపా సమాఖ్యకు భారత్ అత్యంత సన్నిహిత దేశం. అదే సమయంలో దానికి అమెరికాతో కూడా మంచి సంబంధాలు న్నాయి. అందుకే దానిని చైనా, రష్యాతో కలిపి ఒకే గాటన కట్టకూడదు. అది ఎదుగుతున్న మహాశక్తి. దీనికి జనాభా, ఆర్థిక వ్యవస్థ రెండూ కలిసొచ్చాయి. అందుకే పశ్చిమ దేశాలు భారత్‌తో సఖ్యతగా ఉండటం, కలిసి పని చేయడం అవసరమని నేను చెబుతుంటాను. ఇక చైనా-రష్యాకు ప్రత్యక్ష సంబంధాలున్నాయి. 1990 వరకు రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలు సమానంగా ఉన్నాయి. కానీ, ఇప్పుడు చైనా పదిరెట్లు పెద్దది. గ్యాస్, చమురు, సాంకేతిక మార్పిడిలతో రష్యాను యుద్ధాలు చేసేంతగా బలపర్చింది. ఇరు దేశాల మధ్య చాలా బలమైన సంబంధాలున్నాయి ఉన్నాయి” అని స్టబ్ గుర్తు చేశారు.



స్టబ్ గతంలో కూడా భారత్‌కు మద్దతుగా ప్రకటనలు చేశారు. 2025లో హెల్సింకి సెక్యూరిటీ ఫోరమ్ 2025లో ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగింపులో భారత్ పాత్రను ప్రస్తావించారు. ప్రపంచ భద్రతా వ్యవహారాలపై భారత్ కలిసి పనిచేయాలన్నారు. “నేను ఇటీవల ఉక్రెయిన్‌లో పరిస్థితిపై ప్రధాని మోదీతో చర్చించాను. భారత్‌కు ఇక్కడ కీలక పాత్ర ఉంది. అందుకే వారిని కూడా భాగస్వాములు చేయాలి. మొదట శాంతి చర్చలు మొదలుపెట్టాలి. ఆ తర్వాత జెలెన్స్కీ, పుతిన్ మధ్య ద్వైపాక్షిక భేటీకి ఓ డేట్‌ను నిర్ణయించాలి” అని అన్నారు.

# ఆసియా కప్ ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్

- బంగ్లాదేశ్‌పై ఘన విజయం
- మళ్లీ దంచికొట్టిన అభిషేక్








దుబాయ్: ఆసియా కప్లో భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. సూపర్-4లో భాగంగా దుబాయ్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమ్ ఇండియా 41 పరుగుల తేడాతో నెగ్గింది. తొలుత అభిషేక్ శర్మ (75: 37 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్ లు) మరోసారి అదిరే ఇన్నింగ్స్ ఆడడంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. ఒకానొక దశలో 10 ఓవర్లకు 96 పరుగులు చేసి దూకుడు మీదున్న భారత్ 200 పరుగులు పైనే చేస్తుందని అనుకున్నారు. తర్వాత వికెట్లు పడటంతో స్కోరు నెమ్మదించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 19.3 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులో ఓపెనర్ సైఫ్ హసన్ (69: 51 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఒంటరి పోరాటం చేశాడు. పర్వేజ్ ఇమాన్ (21) ఫర్వాలేదనిపించగా, మిగతా వారు విఫలమయ్యారు. భారత బౌలర్లలో కుల్ దీప్ 3, వరుణ్ చక్రవర్తి 2, బుమ్రా 2, అక్షర్ పటేల్, తిలక్ వర్మ ఒక్కో వికెట్ తీశారు. ఇక భారత్ శుక్ర వారం శ్రీలంకతో చివరి మ్యాచ్ ఆడుతుంది. ఇది నామమాత్రమే.

### మళ్లీ దంచికొట్టిన అభిషేక్..

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు అభిషేక్ శర్మ (75: 37 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లు), శుభ్ మన్‌గిల్ (29 పరుగులు 19 బంతు ల్లో) తొలి వికెట్‌కు 77 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. వీరిద్దరు దూకుడుగా ఆడటంతో పవర్ ప్లే ముగిసే సరికి భారత్ 72/0తో నిలిచి భారీ స్కోరు చేసేలా కనిపించింది. ఆ తర్వాత భారత్ వరుసగా వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. శివమ్ దూబే (2), సూర్యకుమార్ యాదవ్ (5), తిలక్ వర్మ (5) ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. హార్దిక్ పాండ్య (38: 29 బంతుల్లో) రాణించాడు. అక్షర్ పటేల్ (10) పరుగులు చేశాడు. బంగ్లాదేశ్ బౌలర్లలో రిషాద్ హుస్సేన్ 2, ముస్తాఫిజుర్, తస్కిన్ అహ్మద్, సైఫుద్దీన్ ఒక్కో వికెట్ తీశారు.




### శ్రీలంక ఔట్

సూపర్ 4లో ఆడిన రెండు మ్యాచ్‌లలో ఓడిన శ్రీలంక ఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. గురువారం పాక్, బంగ్లాదేశ్ మధ్య మ్యాచ్ సెమీఫైనల్ లాంటింది. ఇందులో గెలిచిన జట్టు ఆదివారం జరిగే ఫైనల్‌కు వెళుతుంది.

ఆస్ట్రేలియా ఏతో రెండో టెస్ట్..

## భారత్ 194 ఆలౌట్

లఖ్ నవూ: ఆస్ట్రేలియా-ఎతో జరుగుతున్న రెండో అనధికార టెస్టులో ఇండియా-ఎ బ్యాటర్లు విఫలమయ్యారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 194 పరుగులకే ఆలౌట్ అయింది. వన్‌డౌన్ బ్యాటర్ సాయి సుదర్శన్ (75) రాణించగా.. నారాయణ్ జగదీశన్ (38) ఫర్వాలేదని పించాడు. ఆయుష్ బదోని (21), ప్రసిద్ధ కృష్ణ (16) రన్స్ చేశారు. త్వరలో వెస్టిండీస్ తో జరగనున్న సిరీసు సిద్ధం కావడం కోసం ఈ మ్యాచ్లో ఆడుతున్న కేఎల్ రాహుల్ (11), దేవ్ దత్ పడిక్కల్ (1), ధ్రువ్ జురెల్ (1), నితీశ్‌రెడ్డి (1) తీవ్ర నిరాశపర్చారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆసీసు భారత బౌలర్లు షాకిచ్చారు. సామ్ కొన్స్ (3), కాంపెల్ కెల్లావే (0), ఓలివర్ పీక్ (1)ను పెవిలియన్కు పంపారు. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 16/3తో నిలిచింది. నాథన్ మెక్స్వీనీ (11 నాటౌట్) క్రీజులో ఉన్నాడు. భారత్ ఇంకా 242 పరుగుల వెనుకంజలో ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 350/9తో రెండో రోజు ఆటను ప్రారంభించిన ఆసీస్.. 420 పరుగులకు ఆలౌటైంది. పదో వికెట్‌కు టాడ్ మార్ఫీ (76), హెన్రీ (32లి) జోడీ 91 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది.

## నేడు బంగ్లాదేశ్, పాక్ కీలక మ్యాచ్

ఆసియా కప్‌లో అబుధాబిలో జరిగిన డూ ఆర్ డై కీలక మ్యాచ్‌లో పాకిస్తాన్ శ్రీలంకను 5 వికెట్ల తేడాతో ఓడించింది. దీంతో ఫైనల్ చేరే అవకాశాలను మెరుగుపరచుకుంది. ఇక శ్రీలంక ఆడిన రెండు మ్యాచ్‌లలో ఓడి ఇంటి బాట పట్టింది. ఇక భారత్‌తో జరిగే మ్యాచ్ నామమాత్రమే. ఇప్పటికే భారత్ రెండు మ్యాచ్‌లు గెలిచి ఫైనల్‌కు చేరుకుంది. గురువారం పాకిస్తాన్, బంగ్లాదేశ్ మధ్య మ్యాచ్ సెమీఫైనల్ లాంటింది. ఇందులో గెలిచిన జట్టు ఫైనల్‌కు చేరుకుంటుంది. శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో 134 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన పాకిస్తాన్.. ఆరంభంలోనే వికెట్లు




కోల్పోయి 80-5తో కష్టాల్లో పడిం ది. శ్రీలంక స్పిన్నర్ వనిందు హసరంగ (2-5) ఒత్తిడి తెచ్చినప్పటికీ, హుస్సేన్ తలత్, మహ్మద్ నవాజ్ జోడీ 58 పరుగుల భాగస్వామ్యంతో జట్టును గట్టెక్కించింది. 40 బంతుల్లో 46 పరుగులు అవసరమైన సమయంలో నవాజ్ హసరంగ బౌలింగ్‌లో వరుస బౌండరీలు బాదాడు. 17వ ఓవర్‌లో తలత్ మరో రెండు ఫోర్లు కొట్టడంతో లక్ష్యం 24 బంతుల్లో 26 నుంచి 18 బంతుల్లో 14కి తగ్గింది. ఆ తర్వాత నవాజ్ మూడు సిక్సర్లతో మ్యాచ్‌ను ముగించాడు. రెండు ఓవర్లు మిగిలి ఉండగానే పాకిస్తాన్ విజయం సాధించి ఊపిరి పీల్చుకుంది.

# భారత మహిళల జట్టు అద్భుతంగా ఆడుతోంది

- మాజీ వికెట్ కీపర్ సుష్మావర్మ

భారత మహిళల జట్టు.. ఇటీవల కాలంలో చక్కగా ఆడుతోందని టీమిండియా మాజీ వికెట్ కీపర్ బ్యాటర్ సుష్మ వర్మ అన్నారు. హర్మన్ ప్రీత్ కౌర్ సారథ్యంలో టీమ్ ఇండియా బ్యాటింగ్ విభాగంలో బలంగా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. త్వరలో ప్రారంభం కానున్న వన్డే వరల్డ్ కప్ భారత జట్టు సత్తా చాటుతుందని సుష్మ వర్మ ఆశాభావం వ్యక్తం చేశారు.

'గత రెండు సంవత్సరాలుగా భారత మహిళ జట్టు చక్కగా రాణిస్తోంది. ముఖ్యంగా బ్యాటింగ్ విభాగం బలంగా తయారైంది. గతంలో బ్యాటింగ్ జట్టు హర్మన్ ప్రీత్ కౌర్, స్మృతి మంధాన మీదే ఎక్కువగా ఆధారపడేది. కానీ ఇప్పుడు జట్టులో ఒక స్పష్టత వచ్చింది' అని ఆమె అన్నారు. 'ప్రతీక, రిచా చక్కగా ఆడుతున్నారు. జెమీమా, స్మృతి మంధాన, హర్మన్ కూడా ధారాళంగా పరుగులు చేస్తున్నారు. ఇప్పుడు టీమండియా ముందు కేవలం 250 పరుగుల లక్ష్యాన్ని పెడితే సరిపోదని, ప్రత్యర్థి జట్లకు స్పష్టంగా అర్థమవుతోంది' అని సుష్మ వర్మ విశ్లేషించారు.

భారత ఆఫ్-స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ స్నేహ్ రాణా జట్టు ఇటీవలి విజయంలో తన పాత్ర గురించి మాట్లాడారు. నేను జట్టులో బౌలింగ్ ఆల్ రౌండర్‌గా ఉన్నాను. ఏ స్థానంలో బ్యాటింగ్, ఏ ఓవర్లు బౌలింగ్ చేయబోతున్నానో అనేదానిపై పూర్తి స్పష్టత ఉంది. గతంలో ఆడిన అన్ని సిరీస్లు, మ్యాచుల్లో, శిక్షణ శిబిరాల్లో కూడా నేను ఇలాగే సన్నద్ధమయ్యాను. మన బలాలేంటో తెలుసుకుని వాటికే కట్టుబడి ఉండటం అందరికీ సహాయపడుతుంది. చివరికి మన బలమే మనకు విజయాన్ని అందిస్తుంది' అని ఆమె అన్నారు.

### సెప్టెంబర్ 30 నుంచి వరల్డ్ కప్

ప్రస్తుత టీమ్‌ండియా ప్రదర్శన దృష్ట్యా వరల్డ్ కప్ 2025లో గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉంది. అలాగే స్వదేశం, శ్రీలంకలో మ్యాచ్‌లు జరగనుండటం భారత జట్టుకు మరింత కలిసి వచ్చే అంశం. ఈ మెగా టోర్నీ సెప్టెంబర్ 30న ప్రారంభం కానుంది. మొదటి మ్యాచ్‌లో ఆతిథ్య దేశాలైన భారత్, శ్రీలంక తలపడనున్నాయి. అయితే భారత మహిళల జట్టు ఇప్పటివరకు వరల్డ్ కప్‌ను సొంతం చేసుకోలేదు. 2005, 2017లో మాత్రం రన్నరప్‌గా నిలిచింది. ఈసారి అద్భుతం సృష్టిస్తుందో లేదో చూడాలి.



## సాయిపల్లవికి 'కలైమామణి'

తమిళనాడు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కలైమామణి పురస్కారాలను బుధవారం ప్రకటించింది. సాయిపల్లవి, ఎస్‌జె సూర్యలతోపాటు మరో 90మందికి ప్రభుత్వం ఈ అవార్డులను ప్రకటించింది. కళారంగంలో ప్రతిభ కనబరుస్తోన్న వారికి ప్రతి ఏడాది ఈ పురస్కారాలను అందిస్తారు. 2021, 2022, 2023 సంవత్సరాలకుగాను ఏడాదికి 30మందికి చొప్పున బుధవారం 90మంది కళాకారులకు ప్రభుత్వం కలైమామణి అవార్డులు ప్రకటించింది. 2021 సంవత్సరానికిగాను నటి సాయిపల్లవి, నటుడు, దర్శకుడు ఎస్.జె సూర్య సహా ఐదుగురు అవార్డును సొంతం చేసుకున్నారు. 2023కు సంగీత దర్శకుడు అనిరుధ్‌పాటు మరో ఆరుగురు కలైమామణి పురస్కారాన్ని అందుకోనున్నారు. జాతీయ పురస్కారాల విభాగంలో ప్రముఖ నేపథ్య గాయకుడు కె.జె ఏసుదాసుకు ఎంఎస్ సుబ్బులక్ష్మి పురస్కారాన్ని ప్రకటించారు. అక్టోబరులో ఈ పురస్కారాల ప్రదానోత్సవం జరగనుంది.



## ఆ విషయంలో నిరుత్సాహపడ్డా..



'కూలీ' సినిమా విడుదలకు ముందు ఒకలా, విడుదల తర్వాత మరోలా మాట్లాడుతున్నారంటూ నటి రెబా మోనికా జాన్‌ను పలువురు సినీ అభిమానులు నెట్టింట విమర్శిస్తున్నారు. ఆ మూవీ రిలీజ్‌కు ముందు చేసిన వ్యాఖ్యలు గుర్తులేవా? అంటూ సంబంధిత వీడియోను పోస్టు చేస్తున్నారు. రెబా మంగళవారం రాత్రి ఇన్‌స్టాలో అభిమానులతో చిట్ చాట్ నిర్వహించారు. ఆ క్రమంలోనే 'కూలీ'లో ఆమె పోషించిన పాత్ర గురించి మాట్లాడుతూ.. "కొన్నిసార్లు మనం అనుకున్నవి జరగవు. నేను ఆశించిన స్థాయిలో ఆ పాత్ర తెరకెక్కలేదు. ఆ విషయంలో నిరుత్సాహపడ్డా. కానీ, రజనీకాంత్‌తో కలిసి నటించడం చాలా ఆనందంగా ఉంది" అని తెలిపారు. ఈ కామెంట్‌కు సంబంధించిన పోస్టులు ఎక్స్‌లో వైరల్‌గా మారాయి. మోనికా పాల్గొన్న ఆ మూవీ ప్రమోషనల్ వీడియోను పోస్టు చేసిన పలువురు.. అప్పుడు ఒకలా, ఇప్పుడు మరోలా మాట్లాడుతున్నారని కామెంట్లు పెడుతున్నారు. 'కూలీ'లో నటించే అవకాశాన్ని తానే అడిగానని, అది పెద్ద రోల్ కాదని దర్శకుడు లోకేశ్ కనగరాజ్ చెప్పారని మోనికా వెల్లడించడం ఆ వీడియోలోని సారాంశం. రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించిన చిత్రమిది. ఇందులో శ్రుతిహాసన్ ఇద్దరు సిస్టర్స్‌లో ఒకరిగా నటించారు రెబా. నాగార్జున, ఆమిర్‌ఖాన్, ఉపేంద్రలాంటి అగ్రనటులు ఇందులో భాగమైన సంగతి తెలిసిందే. ఆగస్టులో బాక్సాఫీసు ముందుకొచ్చిన ఈ సినిమా ప్రస్తుతం ఓటీటీ 'అమెజాన్ ప్రైమ్ వీడియో'లో స్ట్రీమింగ్ అవుతోంది.

## వంగా సినిమాలో '..8 వసంతాల' ఫేమ్

'అర్జున్ రెడ్డి', 'యానిమల్ చిత్రాలతో జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా. త్వరలో ఆయన ప్రభాస్‌తో 'స్పిరిట్' సినిమాని పట్టాలెక్కించేందుకు సమాయత్తమవుతున్నారు. అయితే మరోవైపు ఆయన నిర్మాతగానూ ఓ చిన్న సినిమాకి శ్రీకారం చుట్టే ప్రయత్నాల్లో ఉన్నారు. తన సొంత నిర్మాణ సంస్థ భద్రకాళి పిక్చర్స్‌పై రూపొందనున్న ఆ ప్రాజెక్ట్‌తో వేణు అనే కొత్త దర్శకుడు తెరకు పరిచయం కానున్నట్టు తెలుస్తోంది. నాయికగా '8 వసంతాలు' ఫేమ్ అనంతిక సనీల్ కుమార్ ఖరారైనట్టు సమాచారం. ఇది తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో సాగే ప్రేమకథగా ఉండనుందని.. హీరోగా 'మేం ఫేమస్' ఫేమ్ సుమంత్ ప్రభాస్ కనిపించనున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి.



## షూట్ పూర్తి చేసిన బోయపాటి



నందమూరి బాలకృష్ణ హీరోగా హిట్ దర్శకుడు బోయపాటి శ్రీను కలయికలో చేస్తున్న చిత్రం "అఖండ 2 తాండవం". వీరినుంచి వస్తున్నా నాలుగో సినిమా. పైగా ఒక సీక్వెల్ కూడా కావడంతో సినిమాపై గట్టి అంచనాలున్నాయి. ఇక ఈ చిత్రంకి అన్నీ అనుకున్నట్టు జరిగివుంటే ఈ 25నే థియేటర్స్‌లో పడేది. కానీ ఆలస్యం కావడంతో వాయిదా వేశారు. అయితే రీసెంట్‌గానే ఓ సాంగ్ షూటింగ్ చేసుకున్న సినిమా షూటింగ్ మొత్తాన్ని పూర్తి చేసుకున్నట్టుగా ఇపుడు టాక్ వినిపిస్తుంది. ఇలా మొత్తానికి మేకర్స్ చిత్రానికి గుమ్మడికాయ కొట్టేసినట్టుగా ఇపుడు తెలుస్తుంది. దీనిపై అధికారిక క్లారిటీ బయటకి రావాలి. చిత్రానికి థమన్ సంగీతం అందించగా 14 రీల్స్ నిర్మించింది. అలాగే రిలీజ్ డేట్‌పైనా త్వరలోనే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది.

### ఆ కష్టానికి గుర్తింపులేకుండా పోయింది

చిన్న సినిమాగా విడుదలై భారీ విజయాన్ని సొంతం చేసుకుంది 'సైయారా'. తాజాగా ఈ చిత్రం విజయంపై ప్రముఖ నటుడు, దర్శకుడు అనుపమ్ ఖేర్ మాట్లాడారు. తాను దర్శకత్వం వహించిన 'తన్వి ది గ్రేట్' కూడా 'సైయారా'తోపాటే విడుదలైందని.. అయితే ఆ చిత్రం కారణంగా తన సినిమా ఆదరణ సొంతం చేసుకోలేకపోయిందని బాధపడ్డారు. "నేను తన్వి ది గ్రేట్ కోసం నాలుగేళ్లు కష్టపడ్డాను. ఒక ఏడాది స్క్రిప్ట్, ఒక ఏడాది సంగీతం కోసం వర్క్ చేశాను. యశ్ రాజ్ ఫిల్మ్స్ 'సైయారా'ను విడుదల చేసిన రోజే మా చిత్రాన్ని కూడా రిలీజ్ చేశాం. ఆ సినిమాకు వచ్చిన ఆదరణ ముందు 'తన్వి ది గ్రేట్' నిలవలేకపోయింది. దీంతో డిజాస్టర్ అయింది. నాతోపాటు మా టీంలోవున్న 200 మంది చాలా బాధపడ్డారు" అని అనుపమ్ వెల్లడించారు. "తన్వి ది గ్రేట్ విడుదల కోసం మేం ఎన్నో ఇబ్బందులు పడ్డాం. ఆర్థికంగా ఇబ్బందులు రావడంతో నెల రోజులు వాయిదా వేశాం. భారీ బడ్జెట్ సినిమా కావడంతో ఖర్చుల కోసం ఎంతోమందిని సంప్రదించాను. నా స్నేహితులు ఆర్థికసాయం చేశారు. ఈ చిత్రాన్ని కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్లో ప్రదర్శించాం. భారత రాష్ట్రపతికి కూడా చూపించాం. అందరూ దీన్ని ప్రశంసించారు. కానీ, ప్రేక్షకులు మాత్రం ఆదరించలేదు. ప్రపంచం ఒక ప్రేమ కథను చూడాలనుకుంది. అందుకే 'సైయారా'కు ఆదరణ సొంతమైంది. మన ఇండస్ట్రీలో ఉన్న పరిస్థితులు ఏంటంటే.. ఇక్కడ రెండు సినిమాలు ఒకేసారి విడుదలైతే.. ఆదరణ సొంతం చేసుకున్న చిత్రం కోసం మన సినిమా 400 థియేటర్లలో ప్రదర్శితమవుతున్నా కూడా నిర్మొహమాటంగా తీసేస్తారు" అని అనుపమ్ చెప్పారు.

## ఈడీ ముందుకు సోనూసూద్



సినీనటుడు సోనూసూద్ బుధవారం ఈడీ విచారణకు హాజరయ్యారు. నిషేధిత బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన వ్యవహారంలో విచారణకు రావాలని ఆయనకు ఈడీ సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో సోనూసూద్ బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు ఢిల్లీలోని దర్యాప్తు సంస్థ కార్యాలయానికి వెళ్లారు. బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం నిర్వహించడం, వాటితో సోనూసూద్‌కు ఉన్న సంబంధం, తీసుకున్న రుసుములు తదితర అంశాల గురించి ఆయన్ని అధికారులు ప్రశ్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఈ కేసులో ఈడీ పలువురు సినీ ప్రముఖులను, క్రికెటర్లను విచారించిన సంగతి తెలిసిందే. సురేశ్ రైనా, యువరాజ్ సింగ్, మంచు లక్ష్మి, రానా ఇటీవల ఈ కేసులో విచారణకు హాజరయ్యారు.

## 'మిరాయ్' థియేటర్లు ఓజీకి..

పవన్ కళ్యాణ్ హీరోగా దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన చిత్రం 'ఓజీ'. పవన్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తోన్న సినిమా నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా చిత్రం కోసం 'మిరాయ్' నిర్మాత విశ్వప్రసాద్ గొప్ప నిర్ణయం తీసుకున్నారు. సెప్టెంబర్ 12న తేజ సజ్జా నటించిన 'మిరాయ్' ప్రపంచవ్యాప్తంగా విడుదలై మంచి విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికీ ఈ చిత్రం ప్రదర్శితమవుతోన్న థియేటర్స్‌లో హౌస్‌ఫుల్ బోర్డులు కనిపిస్తున్నాయి. తాజాగా ఈ సినిమా నిర్మాత విశ్వప్రసాద్ పవన్ కళ్యాణ్ కోసం గొప్ప నిర్ణయం తీసుకున్నారు. సెప్టెంబర్ 25న 'మిరాయ్' థియేటర్స్ కొన్నింటిలో 'ఓజీ'ని ప్రదర్శించేందుకు అనుమతి ఇచ్చారు. మళ్లీ సెప్టెంబర్ 26నుంచి యథాతథంగా ఆ థియేటర్స్‌లో 'మిరాయ్'ను ప్రదర్శించనున్నారు. దీంతో విశ్వప్రసాద్ నిర్ణయంపై పవన్ అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. నార్త్ అమెరికాలో ఓజీ సినిమా డిజిటల్ ప్రింట్లు ఇంకా అందలేదని, కొన్ని కారణాల వల్ల కెనడాలో ఓజీ సినిమాను ప్రదర్శించడం లేదని ఇటీవల నిర్మాణ సంస్థ పోస్ట్ పెట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు వీటికి లైన్ క్లియరైంది. ప్రింట్లు అందినట్టు డిస్ట్రిబ్యూటర్లు ఎక్స్ వేదికగా తెలిపారు.

## శక్తివంతమైన పాత్రలో కనిపిస్తా

పవన్ కళ్యాణ్ హీరోగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఓజీ నేటినుంచి భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకున్న చిత్రంలో ఇమ్రాన్ హష్మి విలన్‌గా నటిస్తుండగా, సలార్ ఫేమ్ శ్రియారెడ్డి ముఖ్య పాత్రలో కనిపించనుంది. తాజాగా ఫిల్మ్‌ఫేర్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె తన పాత్ర గురించి పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. "నా పాత్రలో భావోద్వేగాలు, శక్తి రెండు కలిసి ఉంటాయి. దానివల్ల వచ్చే ఇంపాక్ట్ చాలా భారీగా ఉంటుంది. ఈ రోల్‌కి ఉన్న లోతు దానిని మరింత రా ఇంటెన్స్‌గా మార్చాయి. నేను పూర్తిగా మేకప్ లేకుండా నటించాను. అది సినిమాటోగ్రాఫర్ రవి కె. చంద్రన్ ఆలోచన. ఆయన పాత్ర సహజంగా కనిపించాలని కోరుకున్నారు. నాకూ అదే విజన్ ఉండటంతో ఎంతో సంతోషంగా నిర్ణయాన్ని అంగీకరించాను" అని శ్రియా తెలిపారు. పవన్ కళ్యాణ్‌తో పనిచేసిన అనుభవం గురించి మాట్లాడుతూ.. "ఆయన మాటలు తక్కువే మాట్లాడుతారు. నేనూ అలానే ఉంటాను. రాజకీయ పనులను పక్కనబెట్టి ఆయన షూటింగ్‌కి వస్తున్నారని నాకు తెలుసు. అందుకే ఎక్కువగా ఇబ్బంది పెట్టలేదు. అయితే సెట్‌లో సినిమాకి సంబంధం లేని ఎన్నో విషయాలు మేము చర్చించుకున్నాం" అని చెప్పుకొచ్చారు.

